ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ　మాతృదేవోభవ ! పితృదేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ !　సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 19 - సంచిక 12
మే 2015

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
040-23700722
99491 11175
94407 69798

## గాయత్రీ మహామంత్రం

భారతీయ సంస్కృతికి సమగ్ర నిర్వచనం, పరిచయం, పర్యాయం గాయత్రీ మహామంత్రం. త్రిపద గాయత్రి వలె భారతీయ సంస్కృతికి కూడా మూడు చరణాలున్నాయి. గంగ, గాయత్రి, గీత. భారతదేశంలోని ఋషులు చేసిన సాధన, వారి సిద్ధాంతాలు మరియు అన్ని సారభూత తత్త్వాలను ఈ మూడింటితో అనుభూతి చెందవచ్చు. గాయత్రీ మంత్రం యొక్క మొదటి చరణం – 'తత్సవితుర్వరేణ్యం' లో గంగ యొక్క పవిత్రత సవితాశక్తిని వరించిన వెంటనే సాధకుని చైతన్యం స్వతహాగా పవిత్రతలో మునిగి తేలుతుంది. రెండవ చరణం – 'భర్గోదేవస్య ధీమహి'లో ప్రాణాలను రక్షించే గాయత్రి యొక్క అపరిమిత ఆధ్యాత్మిక తేజస్సు ఉంటుంది. గాయత్రి సాధన చేస్తూనే అది స్వతహాగా సక్రియమవుతుంది. మూడవ చరణం 'ధియో యోనః ప్రచోదయాత్' లో బుద్ధిని వికసింపచేసే గీతా దర్శనం ఉన్నది.

ఈ మహామంత్రంలోని మూడు వ్యాహృతులు, 'భూర్భువః స్వః' ఈ మూడు త్రిమార్గగామిని అనే సందేశాన్నిస్తుంది. గంగ స్వర్గం, భూమి మరియు పాతాళాలలో ప్రవహించడంతోపాటు గాయత్రి సాధకునిలో ఇడ, పింగళ మరియు సుషుమ్నల్లో పవిత్రత, సరళత మరియు శీతలతగా ప్రవహిస్తుంది. ఇదేవిధంగా గాయత్రిలోని అపరిమిత ఆధ్యాత్మిక తేజస్సు గాయత్రీ సాధకుని వ్యక్తిత్వం, ఆలోచన, వ్యవహారాలను తేజోవంతంగా, శక్తివంతంగా, తీవ్రంగా తయారు చేస్తుంది. కర్మయోగం, జ్ఞానయోగం, భక్తియోగాలైన మహత్తర గీతాదర్శనం గాయత్రి మంత్రార్థాన్ని చింతన చేసే వ్యక్తి జీవితంలో ప్రకాశిస్తుంది, ప్రజ్వలిస్తుంది, ప్రతిబింబిస్తుంది.

జీవితానికి ఆది, అంతం కూడా కేవలం పరమాత్మే అని ఈ మహామంత్రం మొదట్లోనూ, చివరికీ కూడా ఉండే 'ఓం' సూచిస్తుంది. పరమాత్మ నుండి మొదలైన జీవనయాత్రకు అంతిమ లక్ష్యం కూడా ఆ పరమేశ్వరుడే. 'ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్ ఓం' అనే ఈ గాయత్రీ మహామంత్రానికి స్వామి వివేకానందులు తమ శిష్యులకిచ్చిన వ్యాఖ్యానం – "ఎప్పుడైనా భారతీయ సంస్కృతి గురించి తెలిపే గ్రంథాలన్నీ లుప్తమైపోయినా, కేవలం గాయత్రీ మహామంత్ర సాధనతో అవన్నీ విస్తృతంగా ప్రకటమై పోతాయి."

*– అఖండజ్యోతి, జూన్ 2014; అనువాదం: ఎం.వి. ప్రసాద్*

**ఉపకారం చేయుట ఉత్తముని లక్షణం - అపకారం చేయుట అధముని లక్షణం**

## విషయసూచిక


1. **సంపాదకీయం :** గాయత్రీ మహామంత్రం 3
2. **విషయసూచిక-సద్గురువాణి :** అలవాట్లు 4
3. **వేదమంత్రం :** ఇతరుల మేలులో మన మేలు ఉన్నది 5
4. **యుగనిర్మాణ చిత్రావళి-2 :** భగీరథుని తపస్సు మరియు గంగావతరణ 6
5. **గాయత్రీ విద్య-53 :** గాయత్రీ ఒక సమగ్ర ధర్మశాస్త్రం 7
6. **అశ్వమేధం-3 :** శ్రీర్వై రాష్ట్రమశ్వమేధః - అశ్వమేధమే ఐశ్వర్యము, రాష్ట్రము 10
7. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 35 :** ఆశీస్సులు, వాగ్దానాలు 12
8. **కర్మకాండ ఎందుకు-ఎలా? - 2 :** పవిత్రీకరణ ఎందుకు? ఎలా? 16
9. **జీవన సాధనకు బంగారు సూత్రములు-2 :** అతనిని జడంలోకాక చైతన్యంలో వెతుకుదాం 20
10. **అతీంద్రియ విజ్ఞానం-2 :** కల్పనలు సజీవము - సక్రియము 23
11. **గాయత్రీ జయంతి ప్రత్యేకం :** గంగా గాయత్రీల సాధనా పర్వం 27
12. **బుద్ధ పూర్ణిమ ప్రత్యేకం :** అప్పదీపోభవ 29
13. **బోధ కథ :** పురుషార్థికి మాత్రమే విజయం 31
14. **వ్యక్తి నిర్మాణం :** పట్టుదల ఉంటే కడగండ్లయినా కమనీయమే 33
15. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** మానవ శరీరము యొక్క అసలైన సంపదలు-1 35
16. **నా వారితో నా మాట :** ఇది కాలానుగుణ ధర్మాన్ని వికసింపచేయవలసిన సంవత్సరం 38
17. **ఆయుర్వేద వైద్యం-1 :** ఇంగువ - దానిలోని రోగనివారణ శక్తి 41
18. **స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు-12** 42
19. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 44
20. **గోదావరి నది పుష్కరాలు-2015** 48




## సద్గురు వాణి

### అలవాట్లు

అలవాట్లు ఆకాశం నుంచి ఊడిపడవు. ఆలోచనలను కార్యాన్వితం చేసే క్రమంలో ఆ అభ్యాసములు అలవాట్లుగా మారుతాయి. కాలక్రమేణ అవి ఇంకా బలంగా తయారవుతాయి. కాలాంతరంలో అవి ఎంత బలంగా తయారవుతాయంటే వాటిని వదిలించుకోవాలంటే అసాధారణ ప్రయత్నాలు అవసరమవుతాయి. ఈ అలవాట్లు మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ అలవాట్లు మంచివి అయితే మంచిదే, కానీ చెడు అలవాట్లు మనిషిని అధః పాతాళానికి చేరుస్తాయి.

*- అనువాదం: ముక్కామల రత్నాకర్*


## యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ.5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపేవారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.



**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


**దయ ఉన్నచోట దైవం నివసిస్తుంది - ద్వేషం ఉన్నచోట దయ్యం నివసిస్తుంది**

వేదమంత్రం

# ఇతరుల మేలులో మన మేలు ఉన్నది

**కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్‌స్వం సమాః ।**
**ఏవం త్వయి నాన్యథేతోస్తి న కర్మ లిప్యతే నరే ॥**

**– (యజుర్వేదం 40/2)**

**భావార్థం :** మనుష్యుడు తన జీవిత లక్ష్యాన్ని ప్రాప్తించుకొనుటకు ఏకైక ఉపాయం సదాచరణయే. మనం ధర్మమార్గంలో నడుస్తూ నూరు సంవత్సరములు జీవించాలని కోరుకొనెదముగాక.

**సందేశం :** మనుష్యజన్మ, పునర్జన్మ రెండూ అతని కర్మ, కర్మఫలం మీద ఆధారపడి ఉన్నాయి. జననం నుండి మరణం వరకు, జీవనపర్యంతం శారీరక లేదా మానసిక కర్మ ఏదో ఒకటి చేస్తూనే ఉంటాడు. కర్మ చేయకుండా ఒక్క క్షణం గడుపుట కూడా అసంభవం. మనుష్య జీవితం కర్మ చేయుట కొరకే లభించింది. ఆ కర్మ సత్కర్మ కావచ్చు, లేదా దుష్కర్మ కావచ్చు, అది వేరే విషయం.

విజ్ఞాన సంబంధముగా అందరికీ తెలిసిన సిద్ధాంతమేమంటే ప్రతి క్రియకూ ప్రతిక్రియ ఉంటుంది, ప్రతి కార్యానికీ ఒక పరిణామం ఉంటుంది. సమస్త ప్రపంచం నిశ్చిత నియమాలు లేదా సిద్ధాంతాల మీద నడుస్తుంది. పరమేశ్వరుని ఈ జగత్తులో అరాజకత్వం కాక న్యాయం, నియమపాలన సామ్రాజ్యమున్నది. ఈ ప్రపంచంలో లోకహిత కార్యాలు చేస్తూ నూరు సంవత్సరాలు జీవించమని మనుష్యుడిని పరమేశ్వరుడు ఆదేశించాడు.

కానీ అతడు లోకహితం మరచి తన స్వార్థము, అహంకార పూరిత దిశలో పనులు చేస్తున్నాడు. తదనుసారం విచారగ్రస్త పాపకర్మల ఫలాన్ని భోగిస్తూ దారుణ దుఃఖాన్ని ప్రాప్తించు కుంటున్నాడు.

అయితే మనం ఎలాంటి కర్మలు చేయాలనే ఆలోచన తలెత్తుతుంది. ప్రపంచానికి ఉపకారం చేయుట అంటే ఏమిటి? అసలు ఎందుకు చేయాలి? పైకి మనం ప్రపంచానికి ఉపకారం చేస్తున్నాము, వాస్తవమేమంటే మనం మనకే ఉపకారం చేసుకుంటున్నాము. ఇతరుల మేలులో మన మేలు కూడా ఉన్నది. ప్రపంచపు ఉన్నతిలో మన ఔన్నత్యం కూడా ఉన్నది. ప్రతి పని చేసేటప్పుడు మనకు ఈ సర్వోన్నత ఉద్దేశ్యమే ఉండాలి. ఇతరులకు సహాయం చేయుట ఒక సౌభాగ్యమని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటే, పరోపకారేచ్ఛ, సర్వోత్తమ ప్రేరణా శక్తి రూపంలో మన అంతః కరణమంతా నిండిపోతుంది.

ఈవిధంగా చేసిన కర్మ స్వార్థరహితమగుటచే దానిని నిష్కామ కర్మ అంటారు. వాటి సఫలత లేదా అసఫలత మనిషి అహంకారిగా చేయదు, దుఃఖాన్ని కలిగించదు. పనులు సఫలం కానప్పుడు తగిన కృషి ఏకాగ్రతతో తాను చేయలేకపోయానని అనుకుంటాడు. అప్పుడు దానిని రెట్టింపు పట్టుదలతో చేస్తాడు. ఈవిధంగా ఆ కర్మ మనుష్యునికంటదు, మనుష్యుడు దాని పట్ల ఆసక్తిని కలిగి ఉండడు. అతడు కేవలం తన కర్తవ్యంగా భావించి పురుషార్థాన్ని చేస్తాడు. తనకు స్వార్థం లేకపోవుట వలన **ఆత్మవత్ సర్వభూతేషు** భావన బలపడుతుంది. అందరి లాభములోనే తన లాభము కన్పిస్తుంది. ప్రపంచంలోని సుఖాలు, సౌకర్యాలు తానొక్కడే అనుభవించే బదులు పరస్పరం పంచుకొని తినుటలో ఆనందం వస్తుంది. జగత్తును ఈవిధంగా త్యాగపూర్వకంగా భోగించుటచే, తన సమస్త పనులను ఈశ్వరీయ కార్యాలలో నియోగించుటచే, ఆ కర్మలెప్పుడూ బంధకారకములు కావు. అటువంటి నిష్కామకర్మ చేసేవారే ప్రపంచంలోని శ్రేష్ఠనరరత్నములు. అందువలన మనుష్యుడు ఎల్లప్పుడూ అనాసక్తభావంతో, త్యాగ పూర్వక సత్కర్మలలో తన జీవితాన్ని సమర్పించుకోవాలి.

జీవన లక్ష్యప్రాప్తికి ఇదొక్కటే ఉపాయం.

★★★

## పండుగలు

**మే 2015**

| | |
|---|---|
| 01-05-2015 | మేడే ప్రపంచ కార్మిక దినోత్సవం |
| 04-05-2015 | బుద్ధ పూర్ణిమ |
| 28-05-2015 | గాయత్రీ జయంతి<br>పండిత శ్రీరామశర్మ ఆచార్య<br>మహా ప్రయాణం |

**జూన్ 2015**

| | |
|---|---|
| 02-06-2015 | సంత్ కబీర్‌దాస్ జయంతి |
| 13-06-2015 | కూర్మ జయంతి |

**పట్టువదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుంది**

యుగనిర్మాణ చిత్రావళి-2

# భగీరథుని తపస్సు మరియు గంగావతరణ



సగర మహారాజు యొక్క అరువది వేలమంది పుత్రులకు సద్గతుల ప్రసాదించుటకు మాత్రమే భూమిపై గంగావతరణ జరుగలేదు. భూమిపైన మానవ సుఖ జీవనానికి మరియు జంతుజాలము యొక్క దప్పికను తీర్చుటకై భూమిపై గంగావతరణ జరుగుట అనివార్య మయింది. సామాన్యమైన పనిని చేయుటకు సామాన్యులు సరిపోతారు. కాని అసామాన్యమైన గంగావతరణ అనెడి పనికి అత్యంత సమర్థుడైన వ్యక్తి అవసరం ఉంది. ఇట్టి వ్యక్తి ఆత్మబల సంపన్నుడై ఉండాలి. వీరిని వెతికి పట్టుకొనుట అత్యంత కష్టసాధ్యమైన పని. దీనిని సాధించినచో సగం పని పూర్తి అయినట్లుగా భావించవచ్చు.

గంగావతరణ కొరకై మరియు మార్గంలో ఎదురయ్యేడి అడ్డంకులనధిగమించుటకై శ్రమించుచున్న భగీరథుడు ముందుకు వచ్చి ఇలా అన్నాడు. "లోకమంగళకారక పనుల ఉపేక్షించుట తగదు. ఇట్టి పనుల ఉపేక్షతను మానవతకు పట్టిన గ్రహణంలా భావించి, తొలగించుటకు ప్రయత్నించాలి. ఇట్టి ఆలోచనా దృష్టి ప్రయత్నాలు మానవ హృదయాలను లేశమైనా కరిగిస్తాయి.

తన మాటలను కొనసాగిస్తూ చిరునవ్వుతో తిరిగి భగీరథుడు ఇట్లన్నాడు. పరమాత్మ మంగళ స్వరూపుడు. ఆయన అమంగళ కారకాల గురించి ఊసెత్తడు, అట్టి పనుల చేయబూనడు. మనిషి తన స్మృతిని కోల్పోయి కష్టాలలో పడి భ్రమలకు లోనై, ప్రగతి మార్గంలో పయనింపజాలకున్నాడు. ఇట్టి దిగ్భ్రాంతికి, భయానికి లోనైన వానికి ఉత్కృష్టమైన ప్రేరణల నందించి, తనను తాను రక్షించుకొనుటకై మనిషిని తన ప్రతినిధిగా తయారుచేసి భగవంతుడు పంపాడు. ఇందువలననే మనిషి అన్యప్రాణుల కన్న మిన్నయైన వరదానాలు కల్గి ఉన్నాడు. ఇట్టి విశిష్ట మానవుడు తన భౌతిక స్వార్థసుఖాలకు బానిస కాక, తనకున్న సమయంలో అతి స్వల్పమైన దానిని తన అవసరాలు తీర్చుకొనుటకై వినియోగించి, మిగిలిన సమయాన్ని లోకమంగళకర పనులకై వినియోగించుట తన కర్తవ్యంగా భావించాలి."

పైనుదహరించిన దృఢతరమైన సాహసాన్ని నింపుకొని జనులంతా ప్రశంసాపూర్వక మార్గంలో నడవాలి. ఇట్టి ఆలోచనల మనమున దాల్చి భాగీరథుడు హిమాలయాలకు చేరుకున్నాడు. అచ్చట ఘోర తపమొనర్చాడు. ఆయన తపస్సుకు అత్యంత ప్రభావితురాలైన గంగాదేవి, భాగీరథుని ఎదుట ప్రత్యక్షమై ఇట్లన్నది. "పూజనీయ తండ్రి! లెమ్ము! నేను వచ్చేశాను. ఈ ప్రపంచానికి మేలు చేయుటకై నేను ఎల్లవేళలా సంసిద్ధంగా ఉంటాను. కానీ నేను భూమిని సమీపించి నేలను తాకేవేళ నదుల ప్రవాహ తీవ్రతకు భూమి బద్దలై నా ధార పాతాళానికి చేరుతుంది. దీనిని తట్టుకొని నా ప్రవాహ తీవ్రతకు ఎదురొడ్డి నిలబడగల్గెడి వారేరి? వీరిని గుర్తించుటకై నేను వేచి ఉన్నాను. ఇదే నా రాకలోగల ఆలస్యానికి కారణం.

ఆ మాటలకు భాగీరథుడు విస్మయానికి లోనై ఉండగా అంతలోనే అచ్చటికి భగవాన్ శివుడు ఏతెంచి ఇట్లన్నాడు "భాగీరథీ! మనిషి తన జీవిత పరమార్థ లక్ష్యం వైపు అడుగులు వేస్తూ తన కృషిని మొదలు పెట్టగనే భగవంతుడు అట్టి వ్యక్తికి తగిన సహాయ సహకారాలనందించనిచో భగవంతుని ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుంది. కావున లెమ్ము! నీకు సహాయాన్ని అందించుటకై నేను వచ్చాను. గంగా వేగాన్ని నేను నిలువరిస్తాను."

గంగాదేవి దిగివచ్చి శివుని జటాఝూటంలో ఆవాసితం కాగా శివుడావెంకు సౌమ్యరూపాన్ని ప్రసాదించి నేలపైన ప్రవహింపజేశాడు. శివుని కృపాకటాక్షాలకు పులకితుడైన భాగీరథుడు ఆయనను స్తుతించుచుండగా, అతనిని వారించి ఇట్లన్నాడు. "భాగీరథీ! తపస్సు నీవు చేశావు. దీని ఫలితాన్ని పొందుటకు నీకే అధికారమున్నది. లోకమంగళకారక ఆదర్శాలను, గౌరవ మర్యాదలను మనుష్యులు మరువరాదు. కావున ఈ తపస్సు యొక్క ఫలాలు నీకే దక్కాలి. నేటి నుండి గంగాదేవి నీ పేరిట "భాగీరథి" గా పిలువబడుతుంది. నీ యొక్క ఈ ఆదర్శ కార్యము ఈ భూమిపై చిరకాలం నిలచి లోకకళ్యాణానికై తపస్సును త్యాగాలను చేసెడివానికి ప్రేరణను అందిస్తూ ఉంటుంది.

*హిందీమూలం: యుగనిర్మాణ చిత్రావళి మొదటి భాగము*

*అనువాదం: శ్రీమతి ఎ. శారద*

**గోరంత ఆదా కొండంత అక్కరకు వస్తుంది**



గాయత్రీ విద్య-53

# గాయత్రీ ఒక సమగ్ర ధర్మశాస్త్రం

గాయత్రీ వైదిక సంస్కృతిలో ఒక ఛందస్సు. దీనిలో చరణానికి ఎనిమిది అక్షరములు గల మూడు చరణాలు ఉంటాయి. మొత్తం 24 అక్షరాలు. గాయత్రి యొక్క అర్థం ప్రాణానికి రక్షణ ఇచ్చేది. ప్రాణాన్ని 'గయ' అంటారు. త్రి అంటే త్రాణ – సంరక్షణ చేసేది. ఏ శక్తిని ఆశ్రయిస్తే ప్రాణము యొక్క, ప్రతిభ యొక్క, జీవనం యొక్క సంరక్షణ లభిస్తుందో దానిని గాయత్రి అని అంటారు. ఈ మహామంత్ర శబ్దములలోని నవధా భక్తి సిద్ధాంతములు బ్రహ్మతత్వరూపమైన సూర్యుని నవగ్రహములుగా చెప్పబడినవి. ఈ చిన్న మంత్రమును భారతీయ సంస్కృతి, ధర్మం, తత్త్వజ్ఞానముల బీజంగా చెప్పుకోవచ్చు. ఈ కొద్ది అక్షరములలో సన్నిహితముగా ఉన్న ప్రేరణముల వ్యాఖ్యతో నాలుగు వేదములు తయారయ్యాయి. ఓం భూర్భువః స్వః – ఇది గాయత్రి యొక్క శీర్షముగా చెప్పబడింది. తరువాత ఎనిమిది అక్షరములు మూడు చరణాలు ఉన్నాయి. అందువల్లనే దీనిని త్రిపదా గాయత్రిగా చెప్తుతారు. ఒక శీర్షము, మూడు చరణములు–ఈవిధముగా దీనిలో నాలుగు భాగాలు ఉన్నాయి. ఈ నాలిగింటి రహస్యం, అర్థం నాలుగు వేదాలలో ఉన్నాయి. బ్రహ్మదేవుడు తన నాలుగు ముఖములతో నాలుగు భాగముల వ్యాఖ్యానం నాలుగు వేదముల రూపంలో చేశాడు. అందుకే గాయత్రికి వేదమాత అనే పేరు ఇవ్వబడింది.

గాయత్రిలో సన్నిహితంగా ఉన్న తత్త్వజ్ఞానాన్ని రెండు రకములుగా వ్యాఖ్యానిస్తారు. ఒకటి జ్ఞానానికి సంబంధించినది, మరొకటి విజ్ఞానానికి సంబంధించినది. జ్ఞానానికి సంబంధించిన దానిని బ్రహ్మవిద్య అని, విజ్ఞానానికి సంబంధించిన దానిని బ్రహ్మశక్తి అని అంటారు. ఈ పక్షములను ఆలంకారిక రూపములో బ్రహ్మదేవుని పత్నులని చిత్రీకరించారు. ఒకదాని పేరు గాయత్రి, రెండవదాని పేరు సావిత్రి. గాయత్రిలో యోగాభ్యాసం యొక్క ధ్యానధారణ, సావిత్రిలో తపశ్చర్య యొక్క ప్రేరణ వస్తాయి. ఒకదానిని దర్శనమని, రెండవ దానిని ప్రయోగమని చెప్పవచ్చు. గాయత్రిలో ఆత్మకళ్యాణం యొక్క గంగ, భౌతిక సమృద్ధి యొక్క యమున – రెండు ఉద్భవిస్తాయి. అవి చిన్నవిగానే ప్రారంభమయినప్పటికీ ముందుకుపోయిన కొద్దీ వికసిస్తాయి. గాయత్రీమంత్రం యొక్క అర్థము, రహస్యము ఆర్షసాహిత్యమంతటా విస్తృతంగా చెప్పబడింది.

గాయత్రీమంత్రం యొక్క సారము, శబ్దార్థం ఈ ప్రార్థనలో ఇమిడి ఉన్నాయి. "హే తేజస్వి పరమాత్మా! మేము మీ యొక్క శ్రేష్ఠమైన ప్రకాశాన్ని మాలో ధారణ చేస్తున్నాము. మా బుద్ధిని సన్మార్గంవైపు ప్రేరేపించండి!" సద్బుద్ధి ఆధారంగానే వ్యక్తిత్వం వికసిస్తుంది. సద్బుద్ధి లేమికి ఫలితం పతనం, వెనుకపడి ఉండడం.

అందరి శరీరాలు దాదాపు ఒకటిగానే ఉంటాయి. కానీ ఒకరు ఋషి అయితే, మరొకరు దొంగ అవుతున్నాడు. ఒకడు సజ్జనుడు అయి గౌరవం, సన్మానం పొందుతుంటే ఇంకొకడు దుష్టుడిగా తయారవుతున్నాడు. ఒకడు సహాయ సహకారాల సఫలతలను ప్రాప్తించుకుంటే, ఇంకొకడు దుఃఖ దైన్యాలను ప్రాప్తించుకుంటాడు. ఇదంతా బుద్ధియొక్క స్థాయిని బట్టి జరుగుతుంటుంది. వారు సాధించెడి సఫలత, పొందెడి గౌరవ మర్యాద వారి బుద్ధి కుశలతపై ఆధారపడి ఉంటుంది.

దీనిని నిజజీవితంలో సాధించుట మిగుల కష్టసాధ్యం. విశ్వాసం, శ్రద్ధ, నిష్ఠ, ప్రజ్ఞల యొక్క సమన్వయము అంతఃకరణలో జరుగుతుంది. ఈ అంతఃకరణాన్ని ప్రభావితం చేసి, వికసింపచేసే పద్ధతులను సాధన అంటారు. మస్తిష్క అంతఃకరణలో సద్భావనలను సుస్థిరం చేసి, ప్రఖరం (తీవ్రం) చేసే దానిని ఋతుంభరాప్రజ్ఞ అని, దీనినే గాయత్రిమాత అని కూడా చెప్పవచ్చు.

శబ్దముల దృష్టితో ఈ మహామంత్రం యొక్క భావార్థం సరళంగా ఉంటుంది.

**ఓం :** శబ్ద బ్రహ్మ. సృష్టికి ఆది కారణముగా భావిస్తారు. దీని యొక్క ప్రకృతి పురుషుల సమ్మేళన ప్రక్రియ నిరంతరం నడుస్తుంటుంది. దీనివలన అనాహతనాదం ఉత్పన్నం

**జీవితంలో ఏది సాధించాలనుకున్నా ఓర్పు పట్టుదల అవసరం**

అవుతుంది. ఇదే ఓంకారం (ॐ). దీనివల్లనే అనగా ఈ సృష్టి బీజం వలననే స్థూల ప్రకృతి యొక్క ఆకారం తయారవుతుంది. పరాప్రకృతి నుండి అపరాప్రకృతి, అదృశ్యం నుండి దృశ్యం ఉత్పన్నం అయ్యే ప్రక్రియ ఇదే. అందువలననే ఓంకారాన్ని (ॐ) ఈశ్వరుని యొక్క సర్వశ్రేష్ఠ నామముగా భావిస్తారు.

**భూః భువః స్వః :** ఈ మూడు వ్యాహృతులు మూడు లోకములు. వీటిని పృథ్వి (మధ్య), పాతాళం (క్రింద), స్వర్గము (ఊర్ధ్వము)గా కూడా తెలుసుకోవచ్చు. కానీ ఆధ్యాత్మిక ప్రయోజన సాధనలలో భూః – స్థూలశరీరం కొరకు, భువః – సూక్ష్మశరీరం కొరకు, స్వః కారణశరీరం కొరకు ఉపయోగించ బడతాయి. బాహ్యజగత్తు, అంతర్జగత్తులోని మూడు లోకములలో ఓంకారం (ॐ) అంటే పరమేశ్వరుడు వ్యాపించి ఉన్నాడు. వ్యాహృతులలో ఈ తథ్యాన్ని ప్రతిపాదించారు. ఓంకారం మరియు వ్యాహృతుల సమన్వయ శీర్షభాగము ఈ అర్థాన్ని, ఈ ప్రకాశాన్ని ప్రకటిస్తాయి.

**తత్ :** అంటే అది.

**సవితుః :** ప్రాతఃకాల స్వర్ణిమ (సూర్యుడిని) సవిత అని అంటారు. దీనివలన బాహ్యజగత్తులో ప్రకాశం వేడిగా, అంతర్జగత్తులో సద్జ్ఞానంగా, సత్సంకల్పములుగా, సాహసముగా ఆవిర్భవిస్తాయి. దీనికై సాధకుడు ప్రజ్ఞావంతునిగా, శక్తివంతునిగా తయారయ్యేందుకు తగిన పురుషార్థం చేయాలి.

**వరేణ్యం :** అనగా శ్రేష్ఠమైన అని అర్థం. ఈ ప్రపంచంలో ఉత్కృష్టమైనవి, నికృష్టమైనవి, మంచి చెడు అన్నీ ఉంటాయి. వీటిలో శ్రేష్ఠమైన వాటినే స్వీకరించాలి. హంస నీరక్షీర వివేకంతో క్షీరాన్ని గ్రోలినట్లు సాధకుడు ఉత్కృష్టమైన వాటినే స్వీకరించాలి. ఒక్కొక్కసారి తాత్కాలిక లాభాన్ని ఆశించి రానున్న రోజులలో మున్ముందు వచ్చేడి లాభాలను వదులుకుంటుంటారు. ఇలాంటి తప్పు జరగకుండా చూసుకోమని గాయత్రిమంత్రంలో సంకేతం ఉన్నది.

**భర్గో :** భర్గ అనే శబ్దం ప్రతిభ, సాహసం, తత్పరత, తన్మయత వంటి తత్త్వములకు ప్రతీక. క్రియలో ఓజస్సు, ఆలోచనలలో తేజస్సు, భావనలలో వర్చస్సు ఏ తత్త్వం వలన లభిస్తుందో దానిని భర్గో అని అంటారు. అవాంఛనీయత, అనైతికత, మూఢ విశ్వాసాలు వంటి దుష్ప్రవృత్తులు మనిషిని మాయలో పడవేసి పతనంలోనికి తోస్తాయి. దీనిలో నుండి బయటపడాలంటే ప్రఖరత ఉద్భవించాల్సిందే. ఇది లోపల ఉన్న కషాయ కల్మషములను శౌర్య పరాక్రమాల ద్వారా తొలగిస్తుంది.

సవిత, వరేణ్యం, భర్గో తరువాత నాలుగవ విభూతి పేరు 'దేవ'. దేవతలు అందంతో కూడి ఎల్లప్పుడు యవ్వనంలో ఏ లోటు లేకుండా ఉంటారు. ఎల్లప్పుడు ప్రసన్నంగా ఉంటారు. వారు దివ్యమైన గుణములతో, కర్మలతో, స్వభావంతో ఉంటారు. ఈశ్వరుడి దేవశబ్దంతో సంబోధించేటప్పుడు దేవత్వ ప్రత్యేకతలను అనుసరించాలి.

**ధీమహి :** దీని యొక్క అర్థం ధారణ చేయుట. ఆదర్శాలను ఆచరణలోకి తెచ్చుకొనుటే ధారణ చేయుట. ఆదర్శాల గురించి ఆలోచించడం వలన ఎటువంటి లాభం ఉండదు, అవి క్రియా రూపంలోకి రావాలి. అలా వచ్చినప్పుడే సద్జ్ఞానం యొక్క సత్పరిణామ ములు లభిస్తాయి.

శీర్షభాగంలో ఈశ్వరుడు సర్వవ్యాపి అనే విశ్వాసం వికసింప చేసుకుని, పదార్థములను సదుపయోగం చేసుకుని ప్రాణుల పట్ల సదాచరణ చేయాలనే నిర్దేశమున్నది. గాయత్రి యొక్క ప్రథమ చరణములో సవిత, వరేణ్యం, ద్వితీయ చరణంలో భర్గో, దేవస్య పాటించడంపై శిక్షణ ఉన్నది.

**తృతీయ చరణం – ధియో యోనః ప్రచోదయాత్ :** దీనిలో అంతర్గతంగా పరమేశ్వరుని ప్రార్థన ఉన్నది. సాధకునిలో మాత్రమే కాక సమస్త ప్రాణి సముదాయంలో ధీ తత్త్వం – సద్బుద్ధిని ప్రేరేపింపచేస్తుంది. 'నః' అంటే మాకందరికి. ఇక్కడ ఒకరి బుద్ధిని వికసింపచేయడం కాక, వ్యాపకరూపంలో అందరి బుద్ధిని వికసింపచేయడమనే ప్రార్థన ఉన్నది.

ప్రచోదయాత్ అనే శబ్దంలో ప్రేరణ ఇమ్మని అడగడం ఉన్నది. ప్రేరణ అంటే అంతఃకరణలో ప్రబలమైన ఆకాంక్షల ఉత్పత్తి. అంతఃకరణ యొక్క అనుసరణ మనస్సు చేస్తుంది. మనస్సు యొక్క నిర్దేశముపై శరీరం పనిచేస్తుంది. క్రియల యొక్క పరిణామము పరిస్థితి రూపంలో ఎదురు వస్తుంది, తదనుసారంగా సుఖదుఃఖాలు లభిస్తుంటాయి.

గాయత్రి యొక్క 24 అక్షరములలో ఇటువంటి వివరణలు ఉన్నాయి. దీనిని ధర్మం యొక్క సారతత్త్వం అని చెప్పవచ్చు. ఇది ఒక దేశానికి, ఒక జాతికి, ఒక సమాజానికి చెందినది

**పరిస్థితులకనుగుణ్యంగా దినచర్యను రూపొందించుకో**

కాక సమస్త మానవజాతికి సంబంధించిన నీతిశాస్త్రము. ఒకప్పటి స్వర్ణిమకాలంలో ఈ 24 అక్షరాలనే నీతి మర్యాదల అనుశాసనంగా భావించేవారు. భవిష్యత్తులో "వసుధైవ కుటుంబకం" సూత్రం ఆధారంగా సమస్త మానవ సమాజమును ఏకత్రాటిపైకి తీసుకురావాలి. ఏకతకు నాలుగు సూత్రములు ఉన్నాయి. 1) ఒకే ప్రపంచం (విశ్వ రాష్ట్రం) 2) ఒకే భాష (విశ్వ భాష) 3) ఒకే సంస్కృతి (విశ్వ సంస్కృతి) 4) ఒకే మనస్సు (విశ్వ మనస్సు). దీనినే విశ్వధర్మం అని కూడా అనవచ్చు. దీని కొరకు ఆదర్శములు, సిద్ధాంతములను నిర్ధారించుకోవాలి.

తత్త్వదర్శులైన ఋషులు అప్పటి సత్యయుగంలో ఈ దిశలో చాలా అన్వేషించి, పరీక్షించి అనుభవం సంపాదించుకున్నారు. ఈ సిద్ధాంతములను సమాజానికి అందించి, ప్రజల సహకారం పొందారు. ఫలస్వరూపంగా మనుష్యులలో దేవత్వ ఉదయం, పృథ్విపై స్వర్గావతరణల ప్రత్యక్ష స్వరూపం సర్వత్ర దృష్టిగోచర మయ్యేది.

గాయత్రీమంత్రం యొక్క 24 అక్షరాలలో 24 సూత్రాలు ఉన్నాయి. వీటిని మనిషి యొక్క ఆలోచనలలోకి, ఆచరణలోనికి వస్తే మనిషి వ్యక్తిత్వం దైవత్వంతో నిండిపోతుంది. రాబోయే రోజులలో నవ యుగం యొక్క సంరచన కొరకు ప్రబల ప్రయత్నములు జరుగుతాయి. దీనికొరకు జీవనక్రమం యొక్క దిశాధార, ఆచరణ, రీతినీతుల నిర్ధారణ అవసరమవుతుంది. పూర్వకాలంలో ఏమి చేశారో, ఇప్పుడు అదేవిధంగా చేయాలి. ఇప్పుడు క్రొత్తగా కనిపెట్టవలసినది ఏమి లేదు.

*– పూజ్యగురుదేవుల వాఙ్మయం 9 (8.1) నుండి*
*అనువాదం: ముక్కామల రత్నాకర్*

## ఆధ్యాత్మిక, భౌతిక శ్రమలు సమానమే

*తథాగతుడు కాశీలో ఒక వ్యవసాయదారుని ఇంటికి భిక్ష కోసం వెళ్ళారు. వ్యవసాయదారుడు అతనిని పై నుంచి క్రింది వరకు తేరిపార చూసి ఇలా అన్నాడు. "నేను కర్మ పూజారిని. పరిశ్రమ చేసి పొట్ట నింపుకుంటాను, ఇంకా ఇతరుల ఆకలి తీరుస్తాను. నువ్వు ఏ పని చెయ్యకుండా చెయ్యి చాపుతున్నావు. ఆరోగ్యంగా, సుఖంగా ఉన్నట్లు కనిపిస్తున్నావు" అన్నాడు. బుద్ధుడు శాంతి స్వరంతో ఇలా అన్నాడు – "నేను కూడా వ్యవసాయదారుడినే.) అతను ఎలా అని అడిగాడు? బుద్ధుడు జవాబిస్తూ "నేను జ్ఞానం అనే నాగలితో శ్రద్ధ అనెడి బీజాలను, ఆత్మ అనెడి పొలంలో నాటుతాను, తపస్సు అనే జలంతో తడుపుతాను. అభ్యాసంతో నా లక్ష్యం వైపు పయనిస్తాను. అక్కడ సుఖ దుఃఖాలు ఉండవు. నీవు పండించిన పంటలో కొంత భాగం నాకు ఇస్తే నేను కూడా నా పంటలో కొంత భాగాన్ని నీకు ఇస్తాను. ఇది నీకు సమ్మతమేనా?" అన్నాడు. వ్యవసాయ దారుడికి విషయం అర్థమయింది. అతడు బుద్ధుడికి శిష్యుడుగా మారాడు.*

*– అఖండజ్యోతి, మార్చి 2010*
*అనువాదం: ముక్కామల రత్నాకర్*

## ఫాదర్ ఆండ్రూస్

*లక్నోస్టేషన్‌లో అప్పట్లో ఒక బ్రిటీష్‌వ్యక్తి స్టేషను మాస్టరుగా ఉండేవాడు. ఆయన గది ఎదుట పొయ్యివద్ద దీనంగా, హీనంగా ఉన్న ఒక వృద్ధుడు కూర్చొని విపరీతంగా చలికి వణుకుతున్నాడు. ఇది స్టేషను మాస్టరుకు నచ్చలేదు. గౌరవభంగంగా భావించి యాత్రికులకు అసౌకర్యంగా ఉంటుందని, బయటకు పొమ్మని గట్టిగా కేకలు వేశాడు. యాత్రికుల సమూహం నుండి ఒక వ్యక్తి ముందుకు వచ్చి ఎస్.ఎమ్.ను ఉద్దేశించి మీరు క్రైస్తవులు గదా? బైబిల్ చదవటంగాని, వినటం గాని చేసే ఉంటారు. అలాంటప్పుడు చెప్పకుండానే ఆ వృద్ధుని పరిస్థితి గ్రహించి సహాయం అందించటానికి ముందుగా రాగలగాలి. కానీ అలా చేయలేదు. సమాజంలో పౌరులపట్ల ఈవిధంగా ప్రవర్తిస్తే సద్‌వ్యవహారం యొక్క తులాదండం భ్రష్టుపట్టిపోతుంది. సావధాన్! అని హెచ్చరించి తాను కప్పుకొన్న దుప్పటిని తీసి ఆ వృద్ధుని ఒంటినిండా కప్పి ముందుకు సాగిపోయాడు. ఈయన ఎవరో కాదు. తన జీవితమంతా పీడిత మానవ సేవకై ధారపోసిన ఫాదర్ సి.ఎస్.ఆండ్రూస్ మహనీయుడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**ఒంటరి జీవితానికి కామ, క్రోధ, లోభ మోహాలతో పనిలేదు**

# శ్రీర్వైరాష్ట్రమశ్వమేధః - అశ్వమేధమే ఐశ్వర్యము, రాష్ట్రము

## మహాయజ్ఞముల ద్వారా మహాప్రాణకుండలినీ యొక్క మధనము

యజ్ఞతత్వము ఎంత వ్యాపకమో అంత సూక్ష్మము. ఈ ప్రక్రియ యజ్ఞవేదికలలోనే గాక సృష్టిలోని అతిసూక్ష్మ పరమాణువు నుంచి బ్రహ్మాండము వరకు విస్తరించి ఉందని ఋషులు గుర్తించారు. ఈ మహాయజ్ఞ సంచాలక శక్తినే వేదాలలో అగ్ని అని సంబోధించారు.

లక్ష్యరహితమైన, యుక్తము కాని క్రియాకలాపాలకు యజ్ఞములో స్థానము లేదు. ప్రాచీన కాలములో చేసే యజ్ఞముల కర్మకాండ శరీరములో ఉన్న వాయువుల యొక్క అలౌకిక శక్తి సామర్థ్యాలను సాక్షాత్కరింపచేసి సాధకుడిని అతి సమర్థవంతునిగా చేస్తుంది అందువల్లనే ఋషులు ప్రాణవిద్యను తెలుసుకొని యజ్ఞ విధానములో ఆ సూక్ష్మతను ఉపయోగించుకోవాలని కోరారు.

కుడి, ఎడమ నాశికల ద్వారా సూర్య, చంద్రనాడుల రహస్యాన్ని తెలుపుటయే "పౌర్ణమాస్యేష్టి" విధానము. ఇది తెలియనివాడు యజ్ఞఫలాన్ని పొందజాలడు? యజ్ఞముద్వారా ప్రాణవిద్య వ్రతం తీసుకున్న తరువాత పశుబంధ యజ్ఞము చేసేవారు. అనగా సాధకుడు తన పాశవిక ప్రవృత్తులపైన అంకుశము పెట్టేవాడు. ఐదు ఇంద్రియములు, ఆరవది మనస్సు (పంచకోశ సాధన, ఆత్మబోధ) – ఈ ఆరు పశువుల బంధనమే పశుబంధ యజ్ఞము. బాహ్యఇంద్రియ సంయమనము తరువాత ఆంతరిక, దుష్ప్రవృత్తుల నియంత్రణ అవసరము ప్రాణ అపాన వాయు సమత్వము లేక ఇడ, పింగళ స్వరములు సమత్వముతో నడచినపుడు ఉన్న స్థితి సాధకుడికి సోమ యాగ వాజపేయ యజ్ఞములు చేసే అర్హతను ప్రసాదిస్తాయి.

సుషుమ్నానాడి ద్వారా ప్రాణాలను ఊర్ధ్వగమనము చేయించి దానితోపాటే శరీరములోని వీర్యమును సూక్ష్మీకృతము చేసి శీర్ష స్థానమునకు తీసుకెళ్ళి అక్కడ ఉన్న దేవతలకు, ఇంద్రియాలకు ఈ సోమపానము చేయించుటయే వాజపేయ యజ్ఞము. ఈ విధముగా తిరిగి (శతక్రతు) యజ్ఞము చేయుటవలన ఇంద్ర పదవి పొందుతాడు. అతని ఆధీనములోకి అన్ని దేవతలు, ఇంద్రియాలు వచ్చేస్తాయి. "ఇదే సాధకుని రాజసూయ యజ్ఞము" ఈ విధముగా రాజసూయ యజ్ఞముద్వారా రాజు అయిన సాధకుడు తన ఆత్మరూపి రాష్ట్రము, లేక విశ్వసమృద్ధి కొరకు అశ్వమేధము చేయగలిగే అర్హత, సామర్థ్యము పొందుతాడు.

పైన చెప్పిన ఆధ్యాత్మిక, ప్రాణవిద్య యజ్ఞములనే వివరించి సాధకులకు తెలపడానికి వాటి ఆలంకారిక ప్రదర్శన మాత్రమే ఈ కర్మకాండతో కూడిన యజ్ఞములు. ఆధ్యాత్మిక ఉన్నతిని తెలుపని కర్మకాండ నిష్ప్రయోజనము, నిష్ప్రాణము. ప్రాణవిద్యరహితమైనటువంటి యజ్ఞముల ద్వారా సాధకుని ఉన్నతి క్రమము తప్పుటయే గాక "శబ్దములను చదివి జ్ఞానులను కొనేవారి వల్ల" యజ్ఞము అశ్లీలత, పశువధ, మాంసాహారము లాంటి హేయ కర్మలకు కారణమయింది.

యజ్ఞములలోని బాహ్య కర్మకాండ సాధకుని ఆంతరిక స్థితిని తెలుపుతుంది. యాజకుని శ్రద్ధ యొక్క బాహ్య స్వరూపము భార్య. యాజకుని లక్ష్యమే యజ్ఞ స్తంభము (యూపము). యాజకుని భార్యని యూపానికి కట్టివేయడమనగా శ్రద్ధ లక్ష్యముతో కలిసి ఉండాలని అర్థము. అంటే ఇడ పింగళా స్వరములు విధి పూర్వకముగా మేరుదండములో స్థాపించబడుట. $3^1/_2$ కాయిల్స్‌లో ఉన్న కుండలినీ శక్తి ప్రతీకయే యూపముతో కట్టి ఉన్న యాజకుని భార్య.

యజ్ఞములలోని పశువధ సాధకుని పాశవిక వృత్తులపైన నియంత్రణగా తెలుసుకోవాలి. అజైర్యష్టవ్యం అనే వాక్యాలలో మనుష్యుని కామవాసన ప్రవృత్తిని నియంత్రణ చేయడమే అని అర్థము. అదేవిధంగా "అవిహనన" అంటే గొఱ్ఱెను బలి ఇచ్చుట గాక సూర్యమార్గ భేదనము అని అర్థము. శృతివాక్యము కూడ "సూర్యద్వారేణ తే విరజా ప్రయాంతి" అనగా మోక్షము కోరుకునే వారు సూర్యద్వారము గుండా ప్రయాణిస్తారు. కాని అధ్యాత్మ విద్యాశూన్యులయిన మనుష్యుల చేతిలో కర్మకాండ వచ్చినప్పుడు మేకలను, గొఱ్ఱెలను బలి ఇవ్వాలనే శిఖరాన్నే తీసుకున్నారు తప్ప వానిని అతి ఉచ్ఛ సాధనా సంకేతాలుగా తీసుకోలేదు.

**సంజీవని విద్య ద్వారా ఆలోచనలను, మనస్సును సంస్కరించవచ్చును**

ఇంతేగాక యజ్ఞములలో ఆవులను (గోవు), గుఱ్ఱము (అశ్వము)లను వధించుట ప్రారంభించారు. నిజానికి గో తాత్పర్యము వాణి లేక మాట. వాణి అనగా కామధేనువు. దీనివల్లనే సంసారములో కావలసిన పనులు చేయబడు చున్నాయి. "వాచోమే విశ్వభేషజం" – నా మాటే విశ్వానికి ఔషధి. ఔషధిగా మారటానికి పదార్థాన్ని అనేక రకాలుగా నలిపి, కాచి పుటము పెట్టి భస్మీకృతము చేస్తారు. అట్లే మనవాణి సంసారానికే మహౌషధిగా మారాలంటే దానిని ఎన్ని విధాలుగా సంస్కరించాలి. ఇదే గోమేధము.

ఇదే విధముగా రాష్ట్ర ప్రజలలోని ఆసురీ ప్రవృత్తుల నాశనము అశ్వమేధము. ఆధ్యాత్మిక యజ్ఞాలలో సోమ పానము యొక్క ఉద్దేశ్యము కూడా అలంకారికమే. "అథః వై సోమో వృష్ణి అశ్వస్యరేతః" అనగా సూర్యుని వేడిలో భూమి మీదనున్న నీరు సూక్ష్మరూపమై అంతరిక్షములో తిరుగుటయే సోమవల్లి. ఇదే సూర్యుని యొక్క రేతస్సు. ఇదేవిధముగా శరీరంలో ఉన్న ప్రాణరూపి సూర్యుని వేడిలో వీర్యమును ఊర్ధ్వగామి చేసి ఆసోమపానము చేయుటకు ఇంద్రుణ్ణి ఆహ్వానించాలి.

దక్షిణాగ్ని దేహము యొక్క జఠరాగ్ని. గార్హపత్యాగ్ని స్థాపన అందులో హవిప్రధానము. హృదయస్థ అగ్నిలో ప్రాణదాన ఆహుతి యొక్క ఆలంకారిక వర్ణన. ఈ రెండు అగ్నుల వల్ల శరీరము రసయుక్తమై ప్రాణ సంయుక్తమై ఉంటుంది. ఆహవనీయాగ్ని ఉత్తరాగ్ని సంబంధము మూర్ధ్నిలో ఉన్న జ్ఞానాగ్నితో సంబంధము ఉంది. అక్కడే ఏడుగురు హోతలు యజ్ఞము చేస్తూ ఉంటారు. ఈ నాలుగు అగ్నులతోనే జరామర్త్య సత్రయాగము జరుగుతూ ఉంటుంది. ఈ విధమైన ఆధ్యాత్మిక యజ్ఞములలో ఆత్మ, పరమానంద స్వరూపమైన పరమాత్మలో తిరిగి తిరిగి మునిగి లేచుటయే బాహ్య యజ్ఞములలో అవభృత స్నానముగా రూపొందింది. ఈ విధముగా ప్రతి యజ్ఞము తనలో అనేక రహస్యాలను దాచుకొని ఉన్నది.

అశ్వమేధ యజ్ఞ స్థితిలో ఉన్న సాధకుడు తన ప్రాణరూపి అశ్వాన్ని శరీరంలో ఉన్న సమస్త నాడులలోకి ధ్యాన విజయము కొరకు పంపుతాడు. శరీరరూపి రాష్ట్రములోని నాడులే ప్రాణరూపి అశ్వము యొక్క విచారణ క్షేత్రము. ఎక్కడైనా వికారము ఉంటే, ప్రాణరూపి అశ్వమార్గము అధిరోహింప బడుతుంది. అదే విధముగా రాష్ట్రములో ఎక్కడైనా వికారరూపి శత్రువు అంటే అతడు ప్రాణరూపి అశ్వాన్ని కట్టేస్తాడు. ఇటువంటి పరిస్థితులలో అవరోధాన్ని నివారించుటకు అశ్వమేధ కర్త చేసే ప్రయత్నాలే యుద్ధాలు. ఈ యుద్ధాలలో ప్రాణరూపి అశ్వము వికారరూపి శత్రువుల ద్వారా బంధింపబడి ఉంటే అశ్వమేధము సఫలం కాదు. కాని వికారాలను గెలుచుకొని, అన్ని నాడీ సముదాయాలలో నిర్విఘ్న ప్రాణసంచారము చేయించగలిగితే తనను తాను పూర్తిగా వశము చేసుకున్న సాధకునకు అనేక అతీంద్రియ శక్తులు, లోక లోకాంతర గమనము, ఆత్మబోధ, తత్వబోధలతోకూడిన స్పష్టమైన వివేకము లభిస్తుంది.

బ్లూ ప్రింట్ లేకుండా భవనాన్ని ఎలా నిర్మించలేమో ఆధ్యాత్మిక పృష్ఠభూమి లేకుండా ఏ యజ్ఞాన్ని నిర్వర్తించలేము. దీనిని సాధకులు, ఆత్మ విద్యాపిపాసువులు ప్రాణవిద్యా రహస్యోద్ఘాటన ప్రక్రియగా అర్థము చేసుకోవాలి. వ్యక్తిరూపి, రాష్ట్రములో జరిగేదే సమిష్టిగత రాష్ట్రములో జరుగుతుంది. "రాష్ట్రం వ అశ్వ మేధః"లో ఈ రహస్యమే చెప్పబడి ఉన్నది. అశ్వమేధ యాజకులు తమ ఇంద్రియాల మీద, దుష్ప్రవృత్తుల మీద విజయాన్ని సాధించవలసి ఉన్నది. అలా చేసినప్పుడే అశ్వమేధము యొక్క ఆధ్యాత్మిక ఫలితార్థమైన ప్రాణవిద్య యొక్క రహస్యాత్మిక లాభాలు వారి వారి జీవితాలలో దేదీప్యమానంగా వెలుగుతూ కనిపిస్తాయి.

## సత్ప్రవృత్తుల పెంపు

*నెపోలియన్ తన మిత్రులను వెంట పెట్టుకుని వెళుతూ ఉండగా, ఎదురుగా బరువు నెత్తిన పెట్టుకుని ఒక కూలివాడు రావడం ఆయన కంటపడింది. తక్షణం ఆయన మిత్రులను ప్రక్కకు లాగి, ఆ శ్రమ జీవికి దారి ఇస్తూ, "శ్రమను గౌరవించటం నేర్చుకోండి. రోడ్డంతా ఆక్రమించి విలాసంగా నడవటం కాదు" అని హెచ్చరించాడు. ఏ సత్ప్రవృత్తులను మనం మన రాజ్యంలో వృద్ధి చేయాలను కొంటున్నామో, వాటిని ముందుగా మనం గౌరవించి ఆచరించి తీరాలి. అప్పుడే ప్రజలు వాటిపట్ల శ్రద్ధను, ఉత్సాహాన్ని చూపిస్తారని నెపోలియన్ పదేపదే తోటివారికి గుర్తుచేస్తూ ఉండేవారు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**తెలిసింది గోరంత! తెలియాల్సింది కొండంత**

### పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-35

# ఆశీస్సులు, వాగ్దానాలు


## కులదేవతయే గ్రామదేవత

కన్హైయా ఇలా అన్నాడు – "గ్రామ ప్రజలు ఈ దేవతను గురించి పట్టించుకోవాలని మా కోరిక. వారు పూజలు చేయక పోవచ్చు. అరుగుకు మరమ్మత్తు చేయించాలి. సాధ్యమయితే ఓ చిన్న ఆసరా కూడా నిర్మించాలి."

శ్రీరామ్ అతనిని అడిగాడు – "ఆసరా అంటే ఏమిటి?"

అతడు ఇలా జవాబు చెప్పాడు – "ఆసరా అంటే చిన్న ఆలయం. మేము పేదవాళ్ళం. మా దేవత కూడా పేదవాడే."

శ్రీరామ్ ఇలా అన్నారు – "ఇలా ఆలోచించకు. ఇక్కడ దేవత యొక్క పాదాలు స్థాపితమై ఉన్నాయి. శక్తిపీఠాలు 51 ఉన్నాయి. మేము దీనిని గ్రామదేవత యొక్క చరణపీఠం అని పిలుస్తాం. ప్రజలంతా ఇక్కడికి రావాలి."



ఆ వెంటనే కార్యక్రమం రూపొందింది. మార్గశిర పౌర్ణమినాడు అఖండ పారాయణ జరపాలని నిర్ణయించారు. ఆ పారాయణకు ప్రజలందరినీ ఆహ్వానించాలనీ, వారి సహకారం పొందాలనీ ఆలోచించారు. ఆ అరుగుమీద చిన్న ఆలయం నిర్మించాలి. పనిలో పనిగా అరుగును మరమ్మత్తు చేయాలి. అంచనావేసి చూచారు. 80 రూపాయల బడ్జెట్ తయారయింది. 1930-32 లో ఈ మొత్తంలో చిన్న ఆలయం నిర్మాణం అయ్యేది. ఇంటికి పావలా చందా వసూలు చేయాలనీ, దేవతకు అర్పించబడే కానుకలు దానికి కలిపితే కావలసినంత సొమ్ము సమకూరుతుందనీ భావించారు. మరునాటి నుండి శ్రీరామ్ సేనకు చెందిన యువకులు సహకారాన్ని సమీకరించే పని ప్రారంభించారు. దళితుల అరుగుమీద వారి కులదేవతను ప్రతిష్ఠించడం కోసం పారాయణ జరుపుతారనే వార్త విని గ్రామ ప్రజలు ఆశ్చర్య పడ్డారు. ఆ పేటలో పూజలను ప్రోత్సహించడం మతానికి విరుద్ధమని గ్రామంలోని కొందరు పెద్దలు అభ్యంతరం చెప్పారు.

ఇలాంటి ప్రశ్నలు, అనుమానాలు వస్తాయని శ్రీరామ్ ముందుగానే ఊహించారు. యువసేన కార్యకర్తలకు వాటికి సమాధానాలను బోధించారు. శబరి, గుహుడు మున్నగు భక్తుల ఉదాహరణలు, కిరాతులు, వానరుల ఉదాహరణలు వారికి తెలిపారు. భక్తి–సేవ జరపడానికి అందరికీ అధికారం ఉన్నది. పూజలు జరపడాన్ని ప్రోత్సహించడం అధర్మం కాదు ధర్మమే. శ్రీరామచంద్రుడు వానరులతో రామేశ్వరంలో పూజ చేయించాడు. కృష్ణపరమాత్మ గోవర్ధనపూజ కొరకు గోప బాలురను ముందు నిలిపాడు – ఇలా యువకులు ప్రజలకు వివరించారు.

తర్కము, ప్రమాణము కాక– యువకుల వ్యక్తిత్వం కూడా ప్రభావం చూపింది. యువకులు క్లిష్ట సమయాలలో గ్రామ ప్రజలకు చేస్తూ వచ్చిన సేవను ప్రజలు గుర్తించారు. అంతేకాదు. ఆ నవ యువకులను తమ మంచాలపై కూర్చోబెట్టుకునే వారు. మామూలు రోజులలో కూడా ఈ యువకులు పాఠశాల కోసం, వ్యాయామశాల కోసం పని చేస్తూ వచ్చారు. (పాఠశాలకు విద్యార్థులు హాజరు అవుతున్నారా లేదా; గ్రామంలోని ఏ పిల్లవాడు చదువుకోకుండా లేడు కదా; పిల్లల చదువులు ఎలా ఉన్నాయి.) మున్నగు విషయాలను ఆ యువకులు నిశితంగా పరిశీలించే వారు. ఎక్కడయినా ఏదయినా లోటు ఉంటే వారు వెంటనే దాన్ని సరిచేసేవారు. తమ శరీర ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకై వారు పిల్లలకు ప్రేరణ ఇచ్చేవారు.

మామూలు రోజులలో ఈ మెలకువతోపాటు – ప్రత్యేక సందర్భాలలో వారి తత్పరత కూడా గ్రామ ప్రజల హృదయాలను చూరగొన్నది. దళితుల పట్ల మనస్సులలో విషంలా వ్యాపించిన విద్వేషం వలన ప్రజల నోళ్ళనుంచి కుతర్కాలు వెలువడేవి. కానీ, యువకుల మాటలు విన్న తర్వాత వారి బాణాల వాడి నశించిపోయింది. యువకులు ఏ ఇంటికి వెళ్ళినా, కనీస విరాళం తీసుకుని తిరిగి వచ్చారు. కొన్ని ఇళ్ళ

**మనిషికి బాధలు మనోదౌర్బల్యం లేక కొన్ని అలవాట్ల బానిసత్వం వలన వస్తాయి**

నుండి రూపాయి, రూపాయి పావలా విరాళాలు వచ్చాయి. లాల్ జడాల్ చంద్ దళితులను తిట్టిపోసేవాడు. అట్టివాడు ఐదు రూపాయలు ఇచ్చాడు. పారాయణకు సన్నాహాలు జోరుగా సాగాయి.

## పారాయణను ప్రారంభించిన తాఊజీ

మార్గశిర పౌర్ణమి వచ్చింది. తాఊజీ పారాయణకు ముఖ్య యజమానిగా, కర్తగా ఉండాలని చౌధరి యువక బృందానికి సూచించాడు. పలువురు ఆ సూచనను బలపరచారు. ఆమె పూజకు కూర్చున్నారు. "వర్ణానామార్థ సంఘానాం" అంటూ పండిత దయాశంకర్ పారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదుగురు వ్యక్తులు ఆయనతోపాటు పారాయణకు ఎంపిక చేయబడ్డారు. మొదటి విడత పారాయణకు ఎంపికైన వారంతా పారాయణ చేయడం చేతకానివారు. కనుక – క్రొత్త ఏర్పాటు జరిగింది. ఆ ఐదుగురిలో ఇద్దరిని తొలగించారు. వారికి తర్వాత విడత పారాయణలో చోటు కల్పించారు. వారి స్థానంలో ఎంపికైన ఇద్దరు 5వ తరగతి, 7వ తరగతి చదివిన యువకులు. వారు తేలికగా రామచరిత మానస చదువగలరు. వారు పండిత దయాశంకర్‌తోపాటు చౌపాఈలు (రామచరిత మానసలోని పద్యాలు) పాడారు. మిగతా ముగ్గురు వారితో శ్రుతి కలిపారు. ఇలా అక్షరాస్యులతో, నిరక్షరాస్యులతో కూడిన అయిదుగురు పారాయణ చేశారు. అలా 24 గంటల అఖండ పారాయణ పూర్తయింది. చదువురాని వారిని పారాయణకు కూర్చుండ బెట్టడం అవసరమయింది. కనీస విద్యా పరిమితి నిర్ణయించ బడితే, ఆ హరిజనవాడలోని ఏ ఒక్కరు పారాయణలో పాల్గొన లేరు. మరి, వారికి ప్రాతినిధ్యం ఇవ్వాలి. కనుక ప్రతిజట్టులో అక్షరాస్యులను, నిరక్షరాస్యులను కలిపి కూర్చుండబెట్టారు.

పాడ్యమినాడు గ్రామదేవత పూజ, సంక్షిప్త హవనం జరగడంతో – పారాయణ పూర్తయింది. గ్రామస్థులు ఇచ్చిన విరాళాలు, దేవతవద్ద కానుకలుగా ఇవ్వబడిన మొత్తం కలిపి 105 రూపాయలు పోగయింది. పారాయణ, వాహనం, ప్రసాదం మున్నగు వాటికి ఖర్చు చేయగా, చరణపీఠం జీర్ణోద్ధరణకు కావలసినంత సొమ్ము మిగిలింది. ఆ మొత్తాన్ని శ్రీరామ్ చేతిలో పెట్టారు. ఆయన చౌధురిబాబును పిలిచి, ఆ నాణెముల సంచీని అతడి చేతిలో పెట్టారు. జీర్ణోద్ధరణకు మొదటి రాయిని చౌధురి చేతనే వేయించారు.

## "సైనిక్" పత్రికతోపాటు సమాజసేవ

ఆగ్రాలో "సైనిక్" పత్రిక పరిస్థితి కొంత దెబ్బతిన్నది. 1932 లో కార్యకర్తలు కారాగారం నుండి విడుదలైన తర్వాత అది తిరిగి వెలువడసాగింది. అయితే, దానిలో పూర్వపు వాడిని, వేడిని ఉంచడం సాధ్యపడలేదు. తాఊజీ నిర్దేశం ప్రకారం – శ్రీరామ్ పర్యటించే యోగి యొక్క జీవన సరళిని అవలంబించారు. ఒక్కోసారి ఆగ్రా, ఒక్కోసారి ఆవల్‌ఖేడా, ఒక్కోసారి మథుర వెళ్ళేవారు. గ్వాలియర్, మీరట్, హాథ్‌రస్‌ల వరకు కూడా పర్యటించేవారు. ఆనాడు ఆగ్రాలో ఆర్యసమాజం ఒక్కసారిగా ఊపందుకున్నది.

పూనా పాక్ట్ యొక్క ప్రభావం వల్ల సమాజంలో దళితుల పట్ల ఆత్మీయత, అనురాగం పెంపొందాయి. ఫలితంగా – కాంగ్రెస్ కార్యకర్తలు దళిత బస్తీలకు నిస్సంకోచంగా వెళ్ళి రావడం సాగించారు. వర్ణభేదాన్ని అంగీకరించకపోవడంతో, కులాలు ఆధారంగా హెచ్చు తగ్గులను ప్రతిఘటించడంలో ఆర్యసమాజం మొదటి నుండి పేరు ప్రతిష్ఠలు సంపాదించింది. పూనా పాక్ట్ కారణంగా, గాంధీజీ ఒత్తిడి కారణంగా ఇతర సామాజిక–రాజకీయ ఒత్తిడి కారణంగా – దళితులు హిందూ సమాజం నుండి విడిపోవడం చివరి క్షణంలో ఆగిపోయింది. ఆర్యసమాజం ప్రచారకులు ఈ పరిణామాన్ని తమ పద్ధతిలో ప్రజలకు వివరిస్తున్నారు. పూనా ఒప్పందం గురించి, దాని ప్రభావాలను గురించి శ్రీరామ్‌కు పూర్తిగా తెలుసు. అయినా – సామాజిక కార్యంలో ప్రజల మాటలను శ్రద్ధగా వినేవారు. వారి మాటలకు అంత పట్టు ఉండదు. అయినా, శ్రీరామ్ వారి భావాలను ఉపేక్షించరు.

ఉత్సాహవంతుడైన ఆర్యసమాజం ప్రచారకుడు ఆనంద ప్రకాశ్ ఆవల్‌ఖేడాలో ఆయన వద్దకు వచ్చాడు. శ్రీరామ్ 20–21 సంవత్సరాల ఉత్సాహవంతుడైన యువకుడని మాత్రమే ఆయనకు తెలుసు. ఆయన నిర్ణయించుకున్నదాన్ని చేస్తారని, చేసి తీరుతారని కూడా తెలుసు. ఆయన శ్రీరామ్‌తో ఇలా అన్నాడు.

"సంఘ సంస్కరణల పట్ల మీకు అభిరుచి ఉన్నదని విన్నాను."

అందుకు శ్రీరామ్ ఇలా బదులిచ్చారు.

**మనస్సు దృఢంగా ఉంటే స్నేహితులతో పనిలేదు**

"సమాజ సంస్కరణలో కాదు, సమాజ సేవలో."

సంభాషణను కొనసాగిస్తూ ఆనందప్రకాశ్ ఇలా అడిగాడు–

"ఇంతవరకు మీరు ఏయే పనులు చేశారు?"

శ్రీరామ్ వినమ్రంగా ఇలా అన్నారు–

"ఉపదేశక మహాశయా! మేము ఏమీ చేయలేదు. భగవంతుడు ఏది చేయించదలచుకున్నాడో దానిని చేయించాడు. మేము ప్రత్యేకంగా దానిని నమోదుచేసి ఉండలేదు."

శ్రీరామ్ విషయాన్ని దాటవేస్తున్నారని ఆ ఆర్యసమాజ ప్రచారకునికి అనిపించింది. అయినా, శ్రీరామ్ యొక్క స్వరంలో శిష్టాచారం, నిశ్చల భావం స్పష్టంగా ప్రతిబింబించాయి. అలాంటి జవాబు తనకు ప్రోత్సాహకరం అని ఆయన భావించాడు. ఆయన ఇలా అన్నాడు –

"దళితులకు, గ్రామ ప్రజలకు మధ్య సామరస్యాన్ని స్థాపించడానికై మీరు వారి కులదేవతను గ్రామదేవతగా ప్రతిష్ఠింపజేశారు. మంచిదే. కానీ, దానివల్ల అవిద్య వ్యాపించదా?"

"అవిద్య ఎలా వ్యాపిస్తుంది?" – అని శ్రీరామ్ జిజ్ఞాసను వ్యక్తపరచారు.

ప్రచారకుడు దానికి సమాధానం చెప్పడానికి ఇలా ప్రయత్నించాడు –

"వేదశాస్త్రాల ప్రకారం పరమేశ్వరుడు ఒక్కడే. అతడు నిర్గుణుడు, నిరాకారుడు. అతడికి వివిధ రూపములు ఉండ జాలవు. మనం రకరకాల దేవతలను ప్రతిష్ఠిస్తూ పోతే – ఆ పని పరమేశ్వరుని పట్ల శ్రద్ధ జన్మింపజేయుటకు ఆటంకం కలిగిస్తుంది."

శ్రీరామ్ అందుకు ఇలా సమాధానం చెప్పారు –

"ఆనందజీ! మేము వేదాలను లోతుగా అధ్యయనం చేయలేదు. అయినా– విద్వాంసుల ద్వారా విన్నాము. వారు వ్రాసిన గ్రంథాలను అధ్యయనం చేశాము. వేదాలలో పెక్కు దేవతల స్తోత్రాలు ఉన్నాయని అందువల్ల మాకు తెలిసింది. కనీసం 50 మంది దేవతల పేర్లను మేము కూడా చూచి ఉన్నాము. అంతేకాదు. రాముడు, కృష్ణుడు, బుద్ధుడు మున్నగు వారు పరమేశ్వరుని అవతారాలే కదా. ప్రజలు వారిని కూడా పరమేశ్వరునిగా పరిగణించి పూజిస్తారు."

ప్రచారకుడు ఇలా జవాబు చెప్పాడు –

"ఇది అవిద్యవల్ల జరుగుతోంది. చూడు. క్రైస్తవులు ఒకే దేవుడిని నమ్మారు. ఆ క్రైస్తవులు ప్రపంచమంతటా ఆధిపత్యం వహిస్తున్నారు. ముస్లింలు ఒకే దేవుడిని నమ్మారు. వారు కూడా ప్రపంచంలో ఢంకా బజాయిస్తున్నారు. మనం పెక్కు దేవతలను పూజిస్తున్నాం. కనుక దారి తప్పుతున్నాం. ఎవరినీ ఎదుర్కొన లేకపోతున్నాం."

ఈ వాదానికి సమాధానం శ్రీరామ్ వద్ద ఉంది. కానీ, వాదాన్ని పెంచడం ఆయనకు ఇష్టం లేదు. ఆయన ఇలా అన్నారు–

"సిద్ధాంత చర్చలో మునిగిపోవడం మా పని కాదు. మేము పనిచేసేవాళ్ళం. చెప్పండి. మనం కలిసిమెలిసి సమాజ కార్యాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్ళాలి?"

## సంస్కరణవాది ప్రతిపాదన

ఆనందప్రకాశ్ ఆవేశం చల్లబడింది. ఆయన ఇలా అన్నాడు–

"మీరు చరణపీఠాన్ని నిర్మించారనే వార్త విని నేను ఇక్కడికి వచ్చాను. ఇది మంచిదయినా, చెడ్డదయినా – దానివల్ల దళిత వాడకు ప్రజల రాకపోకలు పెరిగాయి. వంచితులైన మన సోదరులను మనవాళ్ళుగా చేసుకునే దిశలో ఇది ఒక అడుగు. అందరినీ అక్కున చేర్చుకోవాలని స్వామి దయానందులు ప్రబోధించారు. ఇప్పుడు నేను మీకొక సూచన చేయడానికి వచ్చాను."

శ్రీరామ్ రెప్పవాల్చకుండా ఆయనవైపు చూస్తూ ఉండి పోయారు. ఏమీ చెప్పలేదు. ఆయన మౌనంలోనే తర్వాతి విషయం వినాలనే ఉత్సుకత తొణికిసలాడింది.

ఆనందప్రకాశ్ ఇలా అన్నాడు –

"గ్రామంలోని దళితవాడలోని ప్రజల ఉపాధికి సముచితమైన ఏర్పాటు లేదని మీకు తెలియదా?"

శ్రీరామ్ ఇలా అన్నారు –

**సోమరితనం మనిషిని జడునిగా మార్చితే - శ్రమ మనిషిని చేతనత్వంతో నింపుతుంది**

"మీ మనస్సులో ఏదైనా పథకం ఉన్నదా?"

ఆనందప్రకాశ్ ఇలా అన్నాడు -

"పథకాన్ని మీరు రూపొందించండి. సాధన సంపత్తిని సమీకరించడంలో నేను సహకరిస్తాను."

పథకం గురించి చర్చలు జరపడం కోసం సాయంత్రం వరకు ఆ సంభాషణను వాయిదా వేశారు. కొంత ఆలోచించడానికి ఆ వ్యవధి సరిపోతుంది. సాయంత్రం ఆనంద ప్రకాశ్‌తో సమావేశం జరిగింది. అంతవరకు జరిగిన చర్చల సారాంశాన్ని ఆయన ముందుంచారు. ఒక చేనేత పరిశ్రమను స్థాపించాలన్నది ఆయన అభిప్రాయం. ఇందువల్ల 9-10 మందికి పని దొరుకుతుందని ఆయన వివరించారు.

గాంధీజి యొక్క ఖద్దరు ఉద్యమం అప్పుడు అంతగా వ్యాప్తి చెందలేదు. శ్రీరామ్ స్వయంగా ఖాదీవస్త్రాలు ధరించేవారు. ఆయన చుట్టుప్రక్కల నివసించేవారు కూడా ఖద్దరు ధరిస్తారు. అయితే - గ్రామ స్వరాజ్యం, గ్రామాల స్వయంపోషకత్వం, స్వదేశీ కుటీర పరిశ్రమల వంటి కార్యక్రమాలు ఉద్యమ స్థాయికి ఎదగలేదు.

గ్రామంలో చేనేత పరిశ్రమ స్థాపించడానికి ఏడు వందల రూపాయలు అవసరం అవుతాయి. ఆర్యసమాజం నుండి అందులో సగం పైకం ఏర్పాటు చేస్తానని ఆనందప్రకాశ్ మాట ఇచ్చాడు. పూర్తి మొత్తం ఏర్పాటుచేయడానికి ప్రయత్నిస్తానని, అయినా శ్రీరామ్, ఇతరులు తమవంతుగా కొంత ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు.

★★★

## భక్తశిఖామణి రామానుజాచార్యుడు

*ఒకసారి కాంచీపూర్ణులు కేశవాచార్యుల ఇంటికి వెళ్ళారు. రామానుజాచార్యులు శ్రీ కేశవాచార్యుల కుమారుడు. తండ్రి రామానుజాచార్యులతో ఇలా అన్నాడు - 'కుమారా! శ్రీ కాంచీపూర్ణులు సాక్షాత్తుగా వరదరాజస్వామియే. వారిని సేవించి తరించు'. శ్రీకాశీపూర్ణులు శయనించేముందు గదిలోకి శ్రీరామానుజాచార్యులు వెళ్ళారు. ఆసనం వద్దకు వెళ్ళి ఆ మహాభక్తుని పాదాలను తన ఒడిలోకి తీసుకున్నాడు. శ్రీకాంచీపూర్ణులు ఉలిక్కిపడిలేచారు. 'ఇదేమి పని నాయనా! నీవు బ్రాహ్మణుడవు', 'నేను శూద్రుడను' రామానుజుడు చెప్పాడు - 'హే భక్తశిరోమణీ! కులానికి, భక్తికి సంబంధం లేదు. ఎవరయినా తన కర్మకారణంగా మహాత్ముడవుతాడు. జన్మచేత కాదు. మీరు మహాపురుషులు. మీ సేవ చేయడం నా మహాభాగ్యం' శ్రీకాంచీపూర్ణులు పరవశులైపోయినారు. 'ప్రభూ! నీ ఇచ్ఛ' అని చెప్పి శయనించారు. రామానుజుడు శ్రద్ధాభక్తులతో వారి పాదాలను ఒత్తుతూ కూర్చున్నాడు. ఉదయమే లేచి శ్రీకాంచీపూర్ణుడు రామానుజులకు 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీమంత్రాన్ని ఉపదేశించారు. ఈ మంత్రాన్ని ఇతరులెవ్వరికీ ఉపదేశించరాదని శ్రీరామానుజుల చేత ప్రమాణం చేయించుకున్నారు. కొంత కాలం తర్వాత రామానుజుల హృదయంలో ఒక పవిత్రమైన కోరిక చిగురించింది. అందరికీ శ్రేయస్సును చేకూర్చాలి అనే భావన కలిగింది. దేవాలయ శిఖరంపైకి ఎక్కి రామానుజుడు ఆ మంత్రాన్ని పెద్దగా ఉచ్చరించడం మొదలుపెట్టాడు. చూస్తుండగానే అన్ని వర్గాల ప్రజలు అక్కడ గుమిగూడారు. అందరూ కలిసి 'ఓం నమో నారాయణాయ!, మంత్రాన్ని ఉచ్చరించారు. అనుకోకుండా కాంచీపూర్ణులు కూడా అక్కడికి వచ్చారు. 'రామానుజా! ఇది ఏమిటి? నీ ప్రతిజ్ఞను భంగం చేశావు. ఇది అపరాధం. నీవు నరకానికి వెళ్తావు. దుఃఖం అనుభవిస్తావు' అని అన్నారు. రామానుజుడు తొణకలేదు. ప్రశాంత భావంతో చెప్పాడు - 'మహాత్మా!, ఈ మంత్రాన్ని సాముహికంగా ఉచ్చరించడం వల్ల అసంఖ్యాకులైన జీవులు భగవద్భక్తులయినారు. వారంతా భవసాగరాన్ని దాటుతారు. అందుకు నేను కోట్లాది నరకాలలో కష్టాలు అనుభవించేందుకు సిద్ధంగా ఉన్నాను.*

*కాంచీపూర్ణులు మౌనంగా ఉండిపోయారు. ఆయన నేత్రాలు ప్రకాశించాయి. ఆయన నోటి నుండి ఈ మాటలు వినబడ్డాయి. 'వత్సా! నీకు మేలు జరుగుతుంది. నీకు నా ఆశీస్సులున్నాయి.'*

**అవకాశాలను అందిపుచ్చుకొనేవారు విజయానికి చేరువవుతారు**

కర్మకాండ ఎందుకు ఎలా?-2

# పవిత్రీకరణ ఎందుకు? ఎలా?

గురుదేవులు అధిక సమయమును ధ్యానములోనే గడుపుతున్నారు. తపోభూమికి వచ్చే అతిథులు, యాత్రీకులతో మేమే సమయమును వెచ్చించవలసివచ్చేది. వారి అనుమాన నివృత్తికై సమాధానమియ్యవలసివచ్చేది. తర్కశీలురైన వ్యక్తులను సంతుష్టులను గావించుటలో అప్పుడప్పుడు చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇందువల్లనే ఒకరోజు మేము పరమపూజ్య గురుదేవులను ఇలా ప్రశ్నించాము. 'గురుదేవా! పవిత్రీకరణను ప్రప్రథమముగా ఎందుకు చేస్తాము?' చేతిలోకి జలమును తీసికొని మంత్రోచ్చారణ గావిస్తూ శిరస్సున జల్లుకున్నంత మాత్రముననే పవిత్రులమౌతామా? మేము ముందుగానే స్నానము చేసి, ఉతికి శుభ్రము చేసిన వస్త్రములను ధరించి కూర్చున్నాము'.

ఈ ప్రశ్నలను విన్న గురుదేవులు ముందు చాలాసేపు నవ్వి, తరువాత అన్నారు 'పుత్రా! క్రియతోపాటు తప్పకుండా భావన కూడా చెయ్యవలసినదే! కేవలము స్థూల-ఉపచారములతో ఏమీ జరుగదు. ఆధ్యాత్మికతను లోతుల లోలోపలికి మునిగి తెలుసుకొనవలసి ఉంటుంది. ముత్యములు సముద్రము అట్టడుగునమాత్రమే దొరుకుతాయి. పైన కేవలము కంకర, రాళ్ళే చేతికొస్తాయి. జపముతో నాలుకను త్రిప్పినంత మాత్రముచేత లాభము చేకూరదు. భావనారహిత జపము నిరుపయోగమౌతుంది. మంత్రముతోపాటుగా 'నలుచెఱగులా పవిత్రత వర్షిస్తూ అది మన అపవిత్రతను, మాలిన్యమును క్షాళన చేస్తున్నది, ఆధ్యాత్మిక వర్షము కురియుచున్నది' అన్న భావన చెయ్యాలి. వేసవికాలములో పృథ్వి తపిస్తుంది. కానీ వర్షము కురిసినప్పుడు నలుదిశలా పచ్చదనము, శీతలత్వము వ్యాపిస్తుంది. పవిత్రీకరణ చేస్తున్నప్పుడు కూడా 'ఆధ్యాత్మిక వర్షము కురిసినప్పుడు శరీర తాపము తొలగిపోతున్నది. శాంతి, కరుణ, సంవేదన, పవిత్రతల నీటిజల్లులు కురియుచున్నవి, మనస్సు స్వచ్ఛమూ, పవిత్రమూ అవుతున్నది' అని భావించవలసివుంటుంది. అయితే ప్రస్తుతము జనులు 'మా గేదె ఎందుకు తక్కువ పాలు ఇస్తున్నది? భగవంతుడు మాకు కొడుకుని ఎందుకు ప్రసాదించలేదు? ధనసంపత్తుల నెందుకు అనుగ్రహించలేదు?' వంటి భావనలు చేస్తున్నారు. ఇట్టి ప్రార్థనల క్రమమే నడుస్తున్నది.

క్రియ కేవలము సంకేతము, గుర్తు, ప్రతీక. గార్డ్ ఎఱ్ఱ జెండా చూపించినప్పుడు రైలుబండి ఆగి, పచ్చజెండా చూపించినప్పుడు ముందుకు పరుగులుతీస్తుంది. భావనకు మరో పేరు 'దేవత'. శంకరభగవానుడు కైలాసపర్వతము మీద వెతికితే దొరకకపోవచ్చు. మీరాబాయి తన భావనాబలముతోనే శిలామూర్తిలో భగవంతుడైన కృష్ణుడిని ప్రత్యక్షముగా దర్శించేది. ఏకలవ్యుడు ఆ మూర్తి వద్దనుండే భావనాత్మకముగానూ, శ్రద్ధతోనూ గురు ద్రోణాచార్యుని మృణ్మయమూర్తిని మలచి ధనుర్విద్యను అభ్యసించాడు. ఉత్కృష్టభావనలే దేవతలై మనకు సహాయము నందిస్తాయి. భావనల బలం ఆధారముగానే భగవంతుడు మంగలి నందునికి బదులుగా కాళ్ళు ఒత్తుటకు, సుదాముని చరణ ప్రక్షాళన కావించి ఆ పాదోదకమును స్వీకరించుటకు, అడవిరేగుపళ్ళను తినుటకు శబరి గృహమునకు వెళ్ళాడు. భగవంతునికి ముఖస్తుతికన్నా శ్రేష్ఠకార్యములే ఇష్టము. మనశ్శరీరములలో పవిత్రత, నిర్మలత్వము నిండినప్పుడే భగవంతుని అవతరణ జరుగుతుంది. పవిత్రమైన ఆచరణ ఉండాలి.

ఇటువంటి భావనలు-ఆచరణలతో పవిత్రీకరణ చేసినట్లయితే శరీరము-అంతఃకరణములు శుభ్రపడతాయి. మనము ఇటువంటి భావనతో శరీరము-మనస్సు-అంతఃకరణములను పవిత్రము కావించుకొనవలెను.

### ఆచమన సార్థకత

'గురుదేవా! మాకు పవిత్రీకరణ క్రియ గురించి అర్థమైనది. అయితే ముమ్మారు ఆచమనము చేయుట వలన ఏమి లాభము ఒనగూడుతుంది? కేవలము మూడు చెంచాల నీటితో దాహము కూడా తీరదుకదా!'

అహాన్ని తగ్గించుకో - ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకో

'పుత్రా! ఈ ఆచమనములు దాహమును తీర్చుకునేందుకు చేయబడవు. వీటి వెనుక లోతైన తథ్యము దాగియున్నది. మనకు స్థూల, సూక్ష్మ, కారణములనే శరీర త్రయము ఉంది.'

స్థూలశరీరములో సోమరితనము, అసంయమనము అనే వ్యాధులు ఉంటాయి. ఈ రోగద్వయము స్థూలశరీరమును నిర్వీర్యము చేస్తుంది. నష్టపరుస్తుంది. సమయమును వృథా చేసుకునే వ్యక్తి 'ఆత్మఘాతి' అని పిలువబడతాడు. ఒకసారి హకీమ్ లుకమా 'మనుష్యులు స్వయముగా తమ నాలుకతో తమ సమాధిని తవ్వుకుంటారు' అని అన్నాడు. నాలుక యొక్క అసంయమితతయే మనిషి శరీరమును రోగముల నిలయముగా తయారుచేస్తుంది. మొదటి ఆచమనము జాగరూకత మరియు సంయమశీలతలకు ప్రేరణనిస్తుంది. ఈ ఆచమనము భవ రోగములకు ఔషధము. ఆచమన సమయములో 'అమృత పానము చేస్తున్నాను' అన్న భావన చేసుకోవాలి.

ఇదేవిధముగా రెండవ ఆచమనమునకు కూడా నిశ్చిత ఉద్దేశ్యము ఉంది. సూక్ష్మశరీర రోగములైన లోభ మోహము లను దూరము చేయుటకు రెండవ ఆచమనము చేయబడుతుంది. లోభము మరియు మోహము అను రోగములు సూక్ష్మ శరీర శక్తిని నశింపజేస్తాయి. మనము ఎల్లప్పుడు ధనము సంపాదించి, దానిని దాచుకుంటున్నాము తప్పితే పిల్లలను సుయోగ్యులుగా, సంస్కారవంతులుగా తీర్చిదిద్దటము లేదు. పిల్లవాడిని వకీలు, వైద్యుడు, అధికారిగా కాక సంస్కార వంతుడుగా చేసినచో ఈ వసుధ స్వర్గముగా మారివుండేది. ఈ లోభ మోహములు మన పరివార వ్యవస్థను పాడుచేశాయి. రెండవ ఆచమనముతో లోభ-మోహముల నివారణ జరుగుతోంది అనే భావన చెయ్యాలి.

మూడవ ఆచమనము కారణశరీరానికి వర్తిస్తుంది. కారణశరీరములో కూడా అవివేకము, అశ్రద్ధ (అపనమ్మకము) లనే వ్యాధులుంటాయి. కర్మఫలము నిశ్చయముగా వచ్చి తీరుతుంది అన్న నమ్మకము లేనప్పుడే లోకులు నిర్భయముగా, నిర్లజ్జతో పాపకర్మలలో లీనమైయుంటారు. ధర్మముపట్ల విశ్వాసము కలిగి ఉంటారు, పూజా పారాయణలు చేస్తారు కానీ ఆత్మ చెప్పిన మాటలను అంగీకరించరు. అవివేక కారణముగా ఉచితానుచితములకు సంబంధించిన జ్ఞానము లోపిస్తుంది. పరమాత్మ సర్వవ్యాపి, ఆయన దృష్టి అనుక్షణము మనమీద ఉంటుంది అన్న విశ్వాసము ఉన్నట్లైతే ఎవరైనా తప్పు పనులు ఎలా చేయగలరు? మూడవ ఆచమనము చేసే సమయములో 'మన అంతర్ మనస్సులో వివేకము, శ్రద్ధ ఉదయిస్తున్నాయి. భవరోగములను దూరము చేసుకొనుటకు మనము ఔషధములను సేవిస్తున్నాము' అన్న భావన చేస్తాము.

## శిఖావందన మెందుకు?

'గురుదేవా! ఆచమన రహస్యము అవగాహనలోకి వచ్చింది. అయితే శిఖావందనము వెనుక ఏ తథ్యము సన్నిహితమై ఉన్నది? దయచేసి అది కూడా తెలియజెప్పండి.

గురుదేవులు అన్నారు 'పుత్రా! ఇది కోటమీద ఉన్న జెండాతో సమానము. ఇది ఉన్నతమైన ఆలోచనల జెండా. మన జెండా వినువీధిలో ఉన్నతంగా ఉండాలి. ప్రాణము పోయినప్పటికి దాని రీవి తగ్గకూడదు అనే భావన, సంకల్పము ఉండాలి. ధనము, గృహము, దుకాణము, సంతానము గొప్పవికావు. ఆదర్శములు, సిద్ధాంతములు మాత్రమే ఉన్నతమైనవి. శిఖ జ్ఞానగంగకు ప్రతీక. దీనితో మస్తిష్కములో పవిత్రభావనలు ఉత్పన్నమౌతాయి. అవి మనలను ప్రపంచములో సదా ఉత్కృష్టముగా ఉంచుతాయి. అందరికన్నా ఎత్తున నిలుపుతాయి. శిఖ ఆ భావనలకు సంకేతము, గుర్తు. శిఖ భారతీయ సంస్కృతికి ధర్మధ్వజము.

మస్తిష్కములో వికృతులు చొరబడితే చాలా కష్టములు ఎదురౌతాయి. ఏనుగు పిచ్చిదైనచో వివేకమును కోల్పోతుంది. అప్పుడు దాన్ని చంపాల్సి ఉంటుంది. శిఖ ఒక అంకుశము వంటిది. ఏనుగుమీద అంకుశము ప్రయోగించి నట్లు; శిఖ అనేది మనమీద ఆదర్శముల, సిద్ధాంతముల అంకుశము. మనం శ్రేష్ఠభావనలను, వివేకశీలతను ధారణ చేస్తున్నాము, చెడు ఆలోచనలు నష్టమైపోతున్నాయి, దూరమౌతున్నాయి. ఈ భావన చేస్తూ శిఖావందనము చేస్తాము. భావ సంవేదనలను జాగృతము చేసుకుంటాము.

## ప్రాణాయామ సిద్ధాంతము

'అవును గురుదేవా! శిఖావందన ప్రయోజనము అర్థమైనది కానీ ఈ ప్రాణాయామము చెయ్యటము వలన ఒనగూడే లాభమేమిటి? ముక్కుకు త్రాడు వేసిన గుఱ్ఱము కూడా ముక్కుతో గాలి పీల్చి, ఆ గాలిని బయటకు వదులుట అను కార్యమును

నిరాశావాదికి నిస్పృహ మిగులుతుంది - ఆశావాదికి అవకాశాలు లభిస్తాయి

చక్కగా నిర్వహిస్తుంది అని లోకులు అంటుంటారు. మా జిజ్ఞాస తీరునట్లుగా కృపతో మాకు దీనిని గురించి కూడా తెలియ జెప్పండి.'

'కుమారా! ఇది నీకు మాత్రమే కాదు, అనేకమందికి ఉన్న భ్రమ. క్రియతోపాటు భావన కూడా ఉండాలి అని మేము మొదటే చెప్పాము. మన ఉపాసన ప్రాణవంతముగా ఉండాలి అన్నదే ప్రాణాయామ సిద్ధాంతము. ప్రాణము పోగానే శరీరము బిగుసుకుపోతుంది. విద్యుఛ్ఛక్తితో సంబంధము తెగిపోగానే మైకు, పంకా, బల్బు, హీటర్ మొదలైనవి పనిచేయవు. అదే విధముగా కర్మకాండలో కూడా ప్రాణాయామము ఊపిరు లూదుతుంది. సాహసమును ఉత్పన్నము చేస్తుంది. సాహసము లేకుండా ఏమీ జరుగదు. దొంగతనము, దోపిడీలు చేయటానికి కూడా ధైర్యసాహసములు కావాలి. నీటితో నిండిన కుండను ఎత్తటానికి కూడా సాహసము కావాలి. చెడును త్యజించుటకు సైతము సాహసము కావాలి. 'మేము అనుచితమైన మాటలను, విషయాలను స్వీకరించము. దోషపూరిత సంప్రదాయ మును అనుసరించము, ఆడంబరమైన వివాహములను జరుపము, ప్రపంచములోని ఈ పనికిమాలిన వృథా రీతి రివాజులను ఖండిస్తాము' మొదలైన సంకల్పములు రూపుదాల్చుటకు కూడా సాహసము ఉండాలి. చేప వలె సాహసముతో నీటిని చీల్చుకుని పైకి రావల్సివుంటుంది. ఆధ్యాత్మికము పిరికివారి పనికాదు, అది శూరవీరుల పని, దానికొరకు ప్రాణవంతులుగా అవ్వాలి. పిరికివారిని, లోభులను అధ్యాత్మవాదులు అని అనలేము. పోరాటపటిమగల శూరుడు అధ్యాత్మవాది అవుతాడు తప్ప దేవతల ఎదుట యాచించేవాడు ఆధ్యాత్మిక వాది కాలేడు.

మనము ప్రాణాయామము ద్వారా ధైర్యసాహసములను లోపలికి పీల్చుకుంటూ తద్వారా ప్రాణములలో జీవనీశక్తిని ఉత్పన్నము చేసుకుంటాము. శ్వాస పీలుస్తున్న సమయములో ప్రాణములలో దివ్యభావనలను ధారణ చేస్తున్న భావన చేయ బడుతుంది. రేచకము (శ్వాస బయటికి వెళుతున్న సమయము) లో 'మన లోపలున్న బలహీనతలు, నికృష్టత, మాలిన్యము బహిర్గతమౌతున్నాయి' అన్న భావన ఉండాలి. ఇలా రేచకమును చేసిన తరువాత కుంభిస్తాము అనగా శ్వాసను నిలిపివేస్తాము.

సుసంస్కారములు మన లోపల సురక్షితముగా ఉందుగాక!! చెడు లోపలికి ప్రవేశించకుండుగాక!! అన్న భావన చేస్తాము. ఈ భావనలతో ప్రాణాయామము చేసినప్పుడే కొంత లాభము ఒనగూడుతుంది.

ఇంతవరకు చెప్పి గురుదేవులు అన్నారు 'ఇప్పుడు ప్రాణాయామ సిద్ధాంతము అర్థమయ్యేవుంటుంది.'

'అవును గురుదేవా! మాకు ఈ క్రియ యొక్క భావన అవగాహనలోకి వచ్చింది. ఇప్పుడు తమరు న్యాసమును గురించి కూడా దయతో మాకు మార్గదర్శనము చెయ్యండి' అని మేము అన్నాము

## న్యాసము యొక్క ఉపయోగము

న్యాసము చేసే సమయములో 'ఈ ఇంద్రియములు శక్తికి, ఆనందమునకు స్రోతములు, మేము వీటిని సదుపయోగము చేసే సంకల్పము తీసుకుంటున్నాము, దేవత్వస్థాపన చేస్తున్నాము, వీటిని క్రియాశీలము చేయుటకు క్రియను పాటిస్తున్నాము' అన్న భావన చేయాలని గురుదేవులు చెప్పారు. ఆయుధమును కూడా సమర్థవంతముగా తయారుచెయ్యాలి. దానికి పదును పెట్టాలి, అంతేకాక ఆయుధమును సరైన రీతిలో ప్రయోగించే పద్ధతి వచ్చి ఉండాలి. ఇప్పుడు ఏ అంగములకు న్యాసము చేస్తున్నామో వాటిని గురించి విను.'

**నోరు:** దీనికి రెండు పనులున్నాయి. ఒకటి – భోజనము చేయుట అనగా రసాస్వాదనా శక్తి. నాలుకని సరిగా వినియోగించు! సాత్వికాహారమును గ్రహించు!' **'ఎటువంటి ఆహారమో అటువంటి మనస్సు!' నాలుకను అదుపులో ఉంచుకున్నప్పుడే మనము ఆరోగ్యముగా ఉండగలము. అవినీతిమార్గమున సంపాదించిన డబ్బుతో సమకూర్చుకున్న ఆహారమును కూడా భుజించరాదు'** అని ఉపనిషత్తులు నొక్కి వక్కాణిస్తున్నాయి. నోటికి ఉన్న రెండవ పని మాట్లాడటము. నోటితో **ఎవరిని గురించి తప్పుగా మాట్లాడరాదు. ఇతరులను చెడుగా విమర్శించరాదు.** నువ్వు ఉచితమైన మాటలను మాట్లాడితే వివేకానందుడు మొదలైన మనీషులకున్నటువంటి ప్రభావవంతమైన వాణి నీ సొంతమౌతుంది.

**ముక్కు:** నోటి తరువాత నాసికాన్యాసము చేస్తాము. కుక్క తన గ్రహణశక్తితోనే చోరులను పట్టుకుంటుంది. అనేక జీవజంతువులు వాసననుబట్టే ఆహారపదార్థముల ఉనికిని తెలుసుకుంటాయి. ఈ శక్తి సదుపయోగము ఇదే. మనము

**ప్రయత్నానికి వివేకం తోడైతే విజయం తలుపు తడుతుంది**

కూడా నాసికాశక్తితో ఉచితమైనవాటిని వెదికే ప్రేరణ పొందాలి, ఉచిత వస్తువులను వెదకాలి. తలక్రిందులుగా ఉన్న మాటల కోసము అనవసరమైన పట్టుదలకుపోయి ముక్కు తెగగోసుకునే ఆలోచనలను వదిలివెయ్యాలి.

**కళ్ళు:** చక్షుర్న్యాసము చేస్తాము. ఆ సమయములో 'ఈ కన్నులతో మనము దివ్యమైనవి దర్శించెదముగాక!!' అన్న భావన చెయ్యాలి. సమస్త విశ్వవసుంధరను భగవానుని రూపముగానే అంగీకరించి 'సియారామ్ మయ్ సబ్ జగ్ జానీ' సర్వప్రపంచమును సీతారాములుగా తెలుసుకో!' అనే దృష్టిని ఉంచుకుంటాము. ఈనాడు ప్రతి మనిషి నకారాత్మకమైన దృష్టినే కలిగి ఉన్నాడు. చెడునే చూస్తున్నాడు. ఈర్ష్య-ద్వేష భావనలతోనే చూస్తున్నాడు. కన్నులకు న్యాసము చేసే సమయములో 'ఓ భగవంతుడా! మేము మీ దివ్య స్వరూపమును దర్శించుటకు, అందరిలోను మిమ్ములను దర్శించేందుకు వీలుగా మాకు దివ్యచక్షువులను ప్రసాదించెదవుగాక!!' అని ప్రార్థించాలి.

**చెవులు:** కర్ణేంద్రియన్యాసము కూడా చేస్తాము. ఆ సమయములో మనము 'భద్రం కర్ణేభి: శృణుయామ' అనే భావనను కలిగి ఉండాలి. మేము కళ్యాణకరమైన శ్రేష్ఠభావనలనే గ్రహించాలి. ఓ భగవంతుడా! మా చెవులు హితకరమైన, పరోపకారమైన, లోకమంగళకరమైన వాక్కులనే ఆలకించాలి, మాకు అటువంటి ప్రేరణ నిమ్ము!' అనే భావనతో చక్షుర్-న్యాసము చేయాలి.

**భుజములు:** బాహువులన్యాసము చేసేటప్పుడు 'మా చేతులు శక్తివంతమవ్వాలి, అవి సత్కర్మలలోనే ప్రేరేపితమవ్వాలి' అన్న భావనను జాగృతపరచుకోవాలి. బిచ్చగాళ్లుగా మారవద్దు, ఎవరి ముందరా చేయి చాపి అర్థించవద్దు, వరములను అడుగ వద్దు, పురుషార్థులుగా మారాలి. ఈ భావనలే ఉండాలి. ఇచ్చుట లోనే మానవుడికి గౌరవము దక్కుతుంది. ఇచ్చే ప్రవృత్తిని పెంపొందించుకోండి. రెండు చేతులా ఇవ్వండి. రెండు చేతులతో ఒక జానెడు పొట్ట నింపుకోవటము కష్టము కాదు. శ్రమ చెయ్యండి, కష్టపడండి, సోమరులుగా అవ్వకండి.

**తొడలు:** నిరంతర గతిశీలత అనే భావన హృదయంగమము చేసుకొనుటకు ఊరువులన్యాసము చేస్తాము. 'చరైవేతి-చరైవేతి' అనే సిద్ధాంతమును ధారణ చెయ్యండి. ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య, వరాన్ని బోధత' - 'లేవండి! మేల్కొనండి! లక్ష్యమును సాధించే వరకు ఆగకండి!' అనే లక్ష్యస్ఫూర్తిని రగిలించే వాక్యమును ఎల్లప్పుడు మీ మనస్సులో గుర్తుంచుకోండి. ఈ శక్తి చమత్కారముతోనే స్వామీ వివేకానంద భారతీయ సంస్కృతీ ప్రకాశస్తంభముగా నిల్చి ప్రపంచమంతటిని ప్రకాశింపజేసినాడు. బ్రహ్మచర్య-శక్తిని సముపార్జించండి. గాంధీ వద్ద ఈ శక్తే ఉంది. ఆ శక్తి యొక్క తేజస్సు అతని కన్నులలో తొణికిసలాడేది. ఆ శక్తి అతని చేత అసాధారణ కార్యములను చేయించినది.

'న్యాసక్రియాపక్షము ఇప్పుడు తెలిసినదా (అర్థమైనదా?)' అని పూజ్యవర్యులు ప్రశ్నించారు.

- *అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## పెరల్ బక్

*పెరల్‌బక్ జన్మించినపుడు ఆమె తండ్రి చైనాలో ధర్మ ప్రచారకుడు. తరచుగా తండ్రి వెంట ఆమె వెనుకబడిన ప్రాంతాలకు వెళ్ళి ప్రజల దుస్థితిని పరికించే అవకాశం లభించేది. పట్టణాలలోని సంపన్నులను, పల్లెలలో వెనుకబడి దీనంగా, హీనంగా జీవించేవారిని పోల్చి చూసినపుడు అంతులేని దుఃఖం కలిగేది. ఈ తరతమ భేదాలను మార్చి సమసమాజ నిర్మాణ స్థాపన చేయాలంటే తాను చేయగలిగింది ఏమిటా అని నిరంతరము ఆలోచించ సాగింది. పట్టభద్రురాలైన తర్వాత కలాన్ని చేతపట్టి, వెనుకబడిన ప్రాంతాలలో నివసిస్తూ ప్రపంచం మొత్తం మీద వెనుకబడిన ప్రజల జీవితాలను పర్యవేక్షించి, గంభీరమైన ఆలోచన చేసింది. వీరి గురించి, వీరి ఉద్ధరణ గురించి సమాజం దృష్టికి తీసికొనివస్తూ రచించిన పుస్తకాలను అతి చౌకగాను, అతిసరళమైన భాషలోను ప్రజలకు అందించింది. ఈమె తన 80 సం॥ల జీవితాన్ని సదా ఏదో ఒక సమస్యను తీసుకొని దానికి సమాధానాన్ని వెతికి, ప్రజలకు అందించటానికే ధారపోసింది. ఈమె నిష్ఠ, భావసంవేదన ఎందరికో మార్గదర్శకమైనది.*

- ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**చేసిన పొరపాట్ల నుండి క్రొత్త పాఠం నేర్చుకోవచ్చు**

జీవన సాధనకు బంగారు సూత్రములు-2

# అతనిని జడంలోకాక చైతన్యంలో వెతుకుదాం

విధాత మాత్రమే నిర్మాత. భగవంతుని ఇచ్ఛ లేనిదే ఆకైనా కదలదు. రెండు ప్రతిపాదనలతో పాటు ఇంకొకటి కలపాలి. **భగవంతుని కలియుటకు, ఆయనకు నివేదించుకొనుటకు అతి దగ్గరి స్థానం అంతఃకరణయే.** భగవంతుడు సర్వవ్యాపి మరియు ఆయన ఎక్కడైనా ఉన్నాడు అని నమ్ముతాము. కానీ ఎక్కడెక్కడికో పరుగెత్తుట నుంచి తప్పించుకోవాలంటే తన యొక్క అంతః కరణమునే పరీక్షించుకోవాలి. ఆ పరదా వెనుక కూర్చున్న పరమాత్మను ఇష్టమైనంత సేపు చూచుటకు హృదయమును తెరిచి కలుసుకొనుట, కౌగలించుకొను కోరికను సహజంగానే పూర్తి చేసుకోవాలి. భావుకతను రెచ్చగొట్టుట లేక కలలలో తేలిపోవుట వలన ఉపయోగమేమీ లేదు.

భగవంతుడు జడము కాదు చేతనము. ఆయనను ప్రతిమలకి పరిమితము చేయలేము. మానవ అంతఃకరణమే భగవంతునికి అన్నింటికంటే దగ్గరైన మరియు సునిశ్చిత స్థానం కాగలదు. భగవద్దర్శనం, సాక్షాత్కారం, ప్రభుసాన్నిధ్యం వంటి ఉచ్ఛస్థితి యొక్క రసాస్వాదన ఎవరు నిజంగా చెయ్యదలుచు కున్నారో వీరు బాహ్యప్రపంచం వైపునుంచి కళ్ళు మూసుకుని తన అంతరంగంలోనికి ప్రవేశించాలి మరియు ఎవరిని పొందు టకు, చూచుటకు కష్టసాధ్యము మరియు శ్రమ సాధ్యమైన ప్రయత్నం చేస్తున్నారో, ఆయన చాలా దగ్గరగా విరాజమానుడై ఉన్నాడు. తేలికైనదానిని కష్టసాధ్యం చేసుకొనుట, ఈ శీర్షాసనము వేయుట కూడా మనిషి యొక్క ఇష్టం మరియు చేష్టలపై ఆధారపడి ఉన్నది. అంతరంగంలో ఉండే భగవంతునికే నిజానికి కోరిన వరములనిచ్చి తృప్తిపరచగల సామర్థ్యము ఉన్నది. బయటి వారు లేక దేవతలు అంతరంగంలోని చైతన్యమును గురించి జ్ఞాపకం చేయగలరు. లేదా ఏదో విధంగా మనస్సును ఆనందపరచే మాధ్యమం కాగలరు.

మందిరం కట్టించాలని తపన చెందుతున్న భక్తుడు ఒక సూఫీ సంతును మందిరం యొక్క రూపురేఖలు తయారు చేయమని ప్రార్థించాడు. ఆ సంతు అత్యంత గంభీరంగా భక్తునితో "భవనం నీ కోరిక ప్రకారం పనివారి సహాయంతో బడ్జెట్‌కు అనుగుణంగా తయారుచేయించుకో. కాని ఒకమాట నేను చెప్పేది విను, అందులో ప్రతిమ స్థానంలో విశాలమైన అద్దం ప్రతిష్ఠించు, అందులో తమ ప్రతిబింబం చూసుకొని దర్శకులు ఈ నిజం తెలుసుకోగలగాలి, భగవంతుని నివాసం ప్రత్యేకంగా తయారైన శరీరమనే కళేబరంలో ఉన్నదని లేక ఆత్మశక్తిని సంస్కరించుకోగలిగితే ఈ శరీరము భగవంతునిగా వికసింపగలదని తెలుసుకోగలగాలి. ఇంతేకాక ఆ ఆత్మశక్తి పాత్రత ననుసరించి ఎల్లప్పుడూ వరదానముల వర్షము కురిపించగలదు." అని అన్నాడు.

భక్తునికి ఏదేదో చేసెయ్యాలనే చౌకబారు భావుకత నుంచి స్వేచ్ఛ లభించినది. ఆయన ఒక పెద్ద హాలు నిర్మించి నిజంగానే ఒక ప్రత్యేక స్థానంలో ఒక పెద్ద దర్పణం ప్రతిష్ఠింపజేశాడు. దానిని చూసి దర్శకులు తమ అంతరంగంలో ఉన్న భగవంతుడిని చూడాలని మరియు దానిని పరిశుభ్రము చేసి భగవంతుడిని చూసే ప్రయత్నము చెయ్యాలని తెలుసుకోగలుగుతున్నారు.

మనస్తత్వ శాస్త్రజ్ఞులు చెప్పేదేమిటంటే మనస్సుయొక్క స్థితే పరిస్థితులను ఉత్పన్నం చేస్తుంది. మనిషి ఎలా ఆలోచిస్తాడో అలాగే చేస్తాడు. మరియు అలాగే తయారవుతాడు. చేసిన మంచి చెడు పనులే సుఖదుఃఖముల రూపంలో మన ముందు కొస్తాయి. వాటి ఆధారం పైనే ఏడ్చుట లేక నవ్వుట అనే స్థితి ఏర్పడుతుంది. అందువల్లనే పరిస్థితుల యొక్క అనుకూలత మరియు బాహ్యం నుండి లభించే సహాయమును పొందాలనే ఆలోచనతో తిరిగే బదులు భావన, నమ్మకం, ఆకాంక్ష, విచారణ మరియు పద్ధతులను సంస్కరించుకొనట మనేది వెయ్యి రెట్లు మేలు చేస్తుంది. క్రొత్త సాహసమును ప్రోగు చేసుకొని, క్రొత్త కార్యక్రమమును తయారుచేసుకునే ప్రయత్నం చేయాలి మరియు తనచే నాటబడినదానినే కోయుట నిశ్చయమనే సత్యంపై విశ్వాసముంచాలి. దారి తప్పకుండా ఉండుటకు ఇదే ఒక సునిశ్చిత మార్గము.

మనిషి తన స్వరూపమును, శక్తిని, గొప్పతనమును, లక్ష్యమును మరియు మార్గమును మరచిపోయి అసంఖ్యాకమైన ఆపదలలో చిక్కుకుంటాడనేదాన్ని ఆధాత్మికవేత్తలు కూడా తర్కము, తథ్యము, ప్రమాణము మరియు ఉదాహరణలను

**జిజ్ఞాస అనేది విజ్ఞానానికి తాళంచెవిలాంటిది**

ఇంకోవిధంగా నివేదించారు. తనను తాను సరిదిద్దుకోగలిగితే తన సరియైన ప్రతిబింబం వ్యక్తులు మరియు పరిస్థితులలో వెలుగుతూ కనిపిస్తుంది. ఈ ప్రపంచం ఒక గుహ వలె తన ఉచ్చారణనే ప్రతిధ్వనిస్తుంది. తనవంటివారే ఒక గుంపుగా చేరుతారు మరియు మంచి చెడు అభిరుచులను ఉత్తేజితం చేయుటలో సహాయపడతారు. దుష్టుల, దుర్జనుల చుట్టూ సరిగ్గా అదే స్థాయికి చెందిన సమూహములు తయారవుతాయి. దీనికి ధీటుగా శీలసంపన్నులు, సజ్జనుల వంటి ఉన్నతస్థాయి ప్రతిభావంతులు కలిస్తే సముచిత లాభం లభిస్తుందనేది కూడా సునిశ్చితము.

## నీచత్వంనుండి బైటపడండి - మహిమను ఆశ్రయించండి

మేఘములు అన్ని ప్రదేశాల్లో సమానంగానే వర్షిస్తాయి. కాని వాటిలోని నీరు ఎక్కడ ఎంత లోతు ఉంటుందో, ఎంత యోగ్యత ఉంటుందో అంత మాత్రమే నిలువ ఉంటుంది. వర్షం యొక్క అనుగ్రహం వలన విస్తారమైన భూక్షేత్రంలో పచ్చదనం పెరిగి ఆహ్లాదపరుస్తుంది, కానీ ఎడారుల్లో మరియు బండఱాళ్ళలో ఒక గడ్డిపోచ అయినా పెరుగుట కనబడదు. అందులో మేఘముల పక్షపాతమేమీ లేదు, భూమియొక్క సారహీనతే ముఖ్య కారణము.

ఉతకనిదే రంగెలా మెఱుస్తుంది? కరిగించకుండా ఎవరు పోతపోసి చూపగలరు? మలమూత్రాలతో నిండిన బాలునికి అతని తల్లి స్నానము చేయించి శుభ్రం చేసిన తరువాతగాని ఒడిలోకి తీసుకోదు. మైలమురికితో నిండిన నీరు త్రాగుటకు ఎలా పనికొస్తుంది? దుమ్ముతో నిండిన అద్దంలో రూపం ఎలా కనబడుతుంది? మండే నిప్పుపై బూడిద పొర కప్పి ఉంటే దాని వేడిని, కాంతిని గుర్తించలేము. మేఘములచే ఆవరించ బడిన సూర్య, చంద్రుల కాంతి భూమికి చేరదు. పొగమంచు ఆవరించున్నప్పుడు పగటి సమయంలో కూడా రాత్రివలే చీకటి వ్యాపించి ఉంటుంది మరియు కొద్ది దూరంలో ఉన్న వస్తువులు కూడా కనబడవు.

ఈ ఉదాహరణలు అన్నింటినీ చూస్తూ మనిషి లోభమనే సంకెళ్ళలో, మోహమనే బంధనాలలో మరియు అహంకారమనే గొలుసులతో బంధించబడివుంటే అతని సమస్త సామర్థ్యములు ఎందుకూ పనికిరావని ఊహించవచ్చు. బంధింపబడిన పనివాడు బలమైన త్రాడుచే బంధించబడిన పశువు వలె విసుగు చెంది అశక్తుడై ఉంటాడు. వారు తమ వాస్తవిక పరాక్రమమును కోల్పోయి యజమాని చెప్పినట్లు నడుచుకొనుటకు వివశులై ఉంటారు. కీలుబొమ్మలు తమంతట తాము లేవలేవు, నడువ లేవు కదా. గారడీవాడు మాత్రమే వాటిని ఆడించి గెంతించ గలడు.

కుసంస్కారముల మరియు చెడు ఆచరణముల ద్వివిధ ఒత్తిడే మనుష్యుని మౌలికచింతనతో సరైన మార్గమును అనుసరించుటలో పెద్ద అవరోధముగా నిలబడుతుంది మరియు ఉత్కృష్టత దిశలో సహజముగా సంభవమయ్యే ప్రగతికి పెద్ద అడ్డుగా ఏర్పడుతుంది. అంతరాత్మ ఉన్నత స్థానమునకు చేరమని చెప్తుంది కాని నెత్తిపై ఎక్కిన దుష్ట ప్రవృత్తులు పతన దిశవైపుకు ప్రేరేపిస్తాయి. ఫలితంగా మనిషి త్రిశంకుని వలే మధ్యలోనే వ్రేలాడుతూ ఉంటాడు. ఈ అసమంజసం అలాగే ఉంటుంది. మరి మనిషి ఏమౌతాడో, భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు.

ఈ విషమ పరిస్థితి నుండి తప్పించుకొనుటకు ఒకే ఒక ఉపాయము ఉన్నది, అది దోష దుర్గుణములనబడే ఏ బరువైన బండఱాళ్ళు తలపై మోయబడుచున్నాయో వాటిని ఏ విధంగానైనా తొలగించిపడవేయాలి. అంత బరువైన ఆపదను తలపై మోస్తూ కొంచమైననూ ముందుకెళ్ళగలుగుట అసంభవము. వాసనలు మనిషిని పిండి వేస్తున్నాయి. జీవితంలో నుంచి ఆరోగ్యము, సంతులనము, ఆయుష్షు వంటి అన్నిటిని పిండివేసి దానిని తొక్కవలె నిస్తేజంగా తయారుచేస్తున్నాయి.

తృష్ణల లోయ ఎంత లోతైనదంటే రావణుడు, హిరణ్య కశిపుడు, వృత్రాసురుడు వంటి పరాక్రమవంతులు కూడా పూర్తి బలమును పందెముగా పెట్టినా కూడా దానిని పూడ్చివేయ లేకపోయారు. సికిందర్ వంటి విజయసాధకుడు కూడా పిడికిలి బిగించి ఈ లోకంలోకొచ్చి చివరకు వట్టిచేతులతో వెళ్ళిపోయాడు. అహంకారమును ప్రదర్శించే దర్పములో ప్రపంచంమొత్తమును సవాలుచేసే మరియు తొడలు చఱిచే దుస్సాహసులైన రాక్షసులలో ఎవ్వరూ ఇప్పుడు కనబడుట లేదు. రాజులయొక్క మణులతో నిండిన రాజమకుటములు మరియు సింహాసనములు భూమిపై పడి ఎక్కడ దుమ్ములో కలిసిపోయాయో ఎవరికి తెలుసు? ఈ క్రియా కలాపాలన్నీ మనుష్యులపై ఉన్మాదం

**శరీరానికి ఏది అలవరిస్తే అలా తయారవుతుంది**

వలె ఆవరించి ఉన్న పైశాచిక దుష్ప్రవృత్తులదే. మరియు అతి విలువైన జీవన సంపదను గవ్వలవలె కోల్పోవుట దిగ్భ్రమమును కలిగిస్తుంది.

స్వార్థము, గెలవాలనే గాఢమైన కోరిక వల్ల నిజానికి అనర్థంతప్ప మరేమీ చేతికి అందదు. స్థితి మయసభ వలె అవుతుంది. అందులో ప్రవేశించిన దుర్యోధనుడికి జలం స్థానంలో నేల మరియు నేల స్థానంలో జలం కనిపించ సాగింది. దానివలన ఏమి చేయాలో తెలియదు. తమ చాతుర్యమును గురించి బడాయి చెప్పేవారు చేయగూడనిదే చేస్తుంటారు. ఈ వ్యామోహమునకు సమ్మోహనము అనే పేరు పెట్టుట తప్ప ఇంకేమి అనగలము? ఈ దుర్గతి మరియు దుర్గంధముతో నిండిన దుర్దశే మానవ జీవితము యొక్క నియతి అనిపించుచున్నది.

ఏదేమైనా నిజమేమిటంటే సగటుమనిషి ఈ పరిస్థితుల లోనే ఇష్టపూర్వకంగాకాని, విసుగుచెందికాని అలవాటుపడి జీవించడము చూస్తాము. హానిని లాభంగాను, లాభమును హానిగాని అనుకునేవాళ్ళకు ఇలాంటి దుర్గతే కలుగుతుంది.

కుళ్ళిన కాలువలలో పెరిగే పురుగులు తమ దయనీయ స్థితిని గురించి గుర్తించను కూడా గుర్తించవు. ఆ స్థితినుండి తప్పించుకునే క్రొత్త ఆలోచన కూడా ఏమాత్రమూ చేయలేవు. ఇలా పురుగుల మాదిరిగానే ఉండేట్లయితే పుష్పములపై ఎగిరే సీతాకోక చిలుకల మాదిరిగా ఆకర్షణీయంగా ఉండాలి అనుకునే మానసికస్థితి ఏర్పడదు. ఆకాంక్ష లేనప్పుడు ఇక ఉన్నతికి సంబంధించిన ఆలోచన కూడా ఎక్కడనుంచి ఎలా పుట్టగలదు?

మానవ జీవితము యొక్క పరమ పురుషార్థము సర్వోన్నత స్థాయికి చెందిన సౌభాగ్యము ఒకటే ఉన్నది. అది తన నీచ మానసిక స్థితి నుంచి రక్షణ పొందుట – భ్రష్టచింతన మరియు దుష్టఆచరణా స్వభావం ఇంకా గాఢంగా పెంచుకోకూడదు. తప్పు తెలుసుకున్నపుడు వెనుకకు మరలుటలో తప్పేమీ లేదు. అంకెలు లెక్కపెట్టుట మరచిపోయినప్పుడు మరల క్రొత్తగా లెక్కపెట్టుట ఆరంభించుటకు తెలివైనవారు సంకోచించవలసిన పనిలేదు. నిజమైన అర్థంలో జీవితము భూమిపై నివసించే దేవత. నరకీటకము, నరపశువు, నరపిశాచం వంటి స్థితిని అతను ఇష్టపూర్వకంగానే స్వీకరించాడు. అతను కాయకల్పం వంటి పరివర్తన గురించి ఆలోచించగలిగితే అతనికి నర–నారాయణుడు, మహామానవునిగా మారుటకు కూడా ఎంతో సమయం పట్టదు. చివరకు అతను ఋషుల, తపస్వుల, మనస్వుల మరియు మనీషుల యొక్క వంశజుడే కదా.

*(సశేషం)*

*– అనువాదం: ఊటుకూరి సత్యన్నారాయణ గుప్త*

## రాశి కన్నా వాసి మిన్న - బుద్ధభగవానుడు

*బుద్ధభగవానుడు ఒక సభావేదికపై ప్రసంగించవలసి ఉంది. సభా సమయానికి సరిగ్గా వేదికవద్దకు వచ్చి, సభాసదులను పరికించి ఏమి చెప్పకుండా వెళ్ళిపోయారు. అప్పుడు సుమారు 150 మంది ఉన్నారు. రెండవరోజు యథావిధిగా సభా సమయానికి వచ్చి, అచ్చట ఉన్న 100 మందిని చూచి, ఏమి చెప్పకుండా తిరిగిపోయారు. మూడవరోజు శ్రోతల సంఖ్య మరింత తగ్గి 60 కి చేరింది. మూడవరోజు కూడా బుద్ధుడు వచ్చి శ్రోతలను కలయజూచి యథాలాపంగా వెనుదిరిగాడు. నాల్గవరోజు శ్రోతలు మరింత తగ్గారు. బుద్ధుడు వచ్చి వెనుదిరిగిపోయారు. ఐదవరోజు శ్రోతల సంఖ్య 14 కు పడిపోయింది. ఆరోజు మహాత్మా బుద్ధుడు ప్రవచించాడు, ఆ పదునల్గురు ఆయన శిష్యులుగా మారిపోయి ఆయనను అనుసరించారు. అప్పుడు ఒకాయన మహాత్మా బుద్ధుడిని ప్రశ్నిస్తూ నాలుగురోజులు మౌనంగా ఉండి వెళ్ళిపోయి, ఐదవరోజు ప్రవచించుట వెనుక గల కారణాన్ని అడిగాడు. అప్పుడు బుద్ధుడు జవాబిస్తూ నాకు గుంపు లేక సమూహం కాదు కావలసింది. పనిచేసేవారు మాత్రమే కావాలి. ధైర్య స్థైర్యాలు ఉన్నవారు మాత్రమే నాతో కలిసి ఉండగలరు. కేవలం సమూహంతో ధర్మం వ్యాప్తిజెందజాలదు. సమర్థులు కావాలి. తమాషా చూచుటకై రోజూ ఇచ్చటకు వచ్చి అటు ఇటు తిరుగుతూ ఉంటారు. సమర్థులైన వారు మాత్రమే స్థిరంగా నిలుస్తారు. వెయ్యిమందిలో సమర్థుడొక్కడున్నా చాలు, పని నెరవేరుతుంది.*

*హిందీ మూలానికి అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**నిజాయితీగా నిర్భయంగా ఒక్క అడుగు వేస్తే ప్రకృతి నీ చేత పది అడుగులు వేయిస్తుంది**

## అతీంద్రియ విజ్ఞానం-2

# కల్పనలు సజీవము - సక్రియము

వస్తువులను అనుభవించటములోనూ, ఇతర ప్రాణులతో వ్యవహార నైపుణ్యములోనూ మానవీయచేతనత్వము స్థూలంగా ఉపయోగపడుతుంది. కానీ రహస్యమయమైన పొరలు తొలగింపబడేకొలదీ ఈ స్థూలశరీరము లోపల ఏదో దివ్య చేతనత్వపు లోకము ప్రకాశిస్తుంటుందని, అందులోకి ప్రవేశించి బహుమూల్యమైన రత్నరాసులను వెదకి తీసుకురాగల శక్తికూడా మనుష్యులలో ఉంటుందని నిరూపించబడుతూ ఉన్నది. సాధారణముగా మనస్సనేది ఇచ్ఛా-జ్ఞాన-క్రియలలో సంలగ్న మయ్యే చేతనత్వపు రూపముగా భావించబడుతున్నది. కానీ ప్రస్తుతకాలములో దాని అతీంద్రియ చేతనత్వముపైన నమ్మకము బలపడుతున్నది. ఎముకలు, మాంసముతో నిండిన 'శరీరము' అని చెప్పబడే ఈ దేహము చెయ్యగలిగినదానికంటే మానవీయ చేతనత్వము ఎన్నో రెట్లు ఎక్కువ పరిధిని కలిగి ఉంటుంది. అందులో అతిమానవ, అసాధారణశక్తులు సన్నిహితమై ఉంటాయి.

అమెరికాలోని టొరంటో టెలివిజన్‌స్టూడియోలో ఒక వ్యక్తి ఊహలకు లేదా కల్పనలకు రూపం వస్తే ఎలా ఉంటుందో దాన్ని ఋజువుపరచే చిత్రము తియ్యబడినది. 49 సంవత్సరముల వయస్సున్న థియోడర్‌సెరిక్షోస్ అనే ఒక ట్రక్కు డ్రైవర్‌కు 'తన ఆలోచనలు చిత్రంగా తియ్యగలిగినంత స్పష్టమైనవి' అనే నమ్మకము ఉండేది. పైన చెప్పబడిన ప్రయోగశాలలో ఆ పని నిర్వహించబడినది. ఇందుకోసము ఏమాత్రమూ తడి తగలనటువంటి పోలరాయిడ్‌కెమేరాను కొనుగోలు చెయ్యటము జరిగినది. ఫిల్మ్ తయారుచేసే సంస్థవద్ద నుండి సరాసరి ఫిల్మ్ అందులో అమర్చబడినది. ఆ కెమేరా తనంతట తానే ఒక్క నిమిషములో తీసిన ఫోటోను మన చేతిలో పెడుతుంది. 'ఎవరో ఒక వ్యక్తికి పేరు తెచ్చిపెట్టడము కోసము ఈవిధమైన అద్భుతమును చేశారు' అనే మాట రాకుండా ఉండేవిధముగా ఆ పరికరమును తయారుచేయించారు. ఉపకరణములు, స్వచ్ఛత కోసము కొంతమంది సాక్షులను కూడా అక్కడుంచారు.

థియోడర్ ఏమేమి ఊహించాడో అతడి మెదడులో ఏమేమి ఆలోచనలు మెదిలాయో కెమేరా వాటిని యథాతథముగా ఫోటోలు తీసింది. కొలరాడో విశ్వవిద్యాలయ యాజమాన్యము వారు ఆ వ్యక్తిని గురించి లోతుగా అధ్యయనము చెయ్యదలచి డా॥ ఆయిమనవద్ అనే వైద్యుని నేతృత్వములో ఒక ప్రత్యేకమైన విభాగమునే ఏర్పరచి కెమేరా ఫోటోలు తీసిన ఈ అద్భుతమును గురించేకాక, అందుకు కారణములను కూడా పరిశోధించాలని నిర్ణయించారు. 2 సంవత్సరముల కాలము పరిశోధన సాగిన పిదప నిజముగానే థియోడర్‌లో ఆ అద్భుతశక్తి దాగియున్నదనే సారాంశమును వెలువరించారు. అందుకు కారణమేమిటో తెలుసుకొనలేకపోయినారు కానీ కొన్ని కొన్ని సంభావనల గురించి చర్చించబడినది.

కల్పనలు, ఆలోచనలు, భావనలు, సంకల్పములు మొదలైనవన్నీ కేవలము గాలిలో తేలేవీ, కంటికి కనిపించనివి అయినప్పటికీ అవికూడా భౌతికక్రియల వలె ప్రభావ వంతమైనవీ, ఇంకా చెప్పాలంటే భౌతికక్రియలకంటే అధిక సామర్థ్యము కలవీకూడా! ప్రాచీనకాలములోని ఋషులు, మహర్షులు వాని ప్రాముఖ్యతను తెలుసుకొని వాటిని సాధ్యమైనంతవరకు సరళముగా ఉపయోగించుకునే పద్ధతులను అన్వేషించారు.

ఎటువంటి యంత్రములు, సంకేతాలు, ఇంద్రియముల సహాయము లేకుండా ఎక్కడో దూరంగా ఉన్న వ్యక్తులతోటి పరస్పరము ఆలోచనలను పంపగలిగే ఈ ప్రక్రియ 'టెలీపతి' క్రిందకు వస్తుంది. 'కన్నుల' సహాయము లేకుండా అతీంద్రియ దృష్టితో దృశ్యాలను చూడగలగటము కూడా ఇందులో సమ్మిళితమై ఉంటుంది. పూర్వజ్ఞానముతో గడిచిపోయిన సంఘటనలను తెలుసుకొనగలగటము, భవిష్యత్‌జ్ఞానముతో జరగబోయే సంఘటనలను గురించిన అవగాహన ఏర్పడటము కూడా ఇందులో సాధ్యమౌతుంది. కలలలో వ్యక్తుల యొక్క స్థితి లేదా మనకు తెలియని సంఘటనల క్రమం ద్వారా భూతకాలపు లేదా భవిష్యత్తులో జరగబోయే అంశాలను గురించి సంకేతాలు లభిస్తాయి. సైకోకైనేసిస్ విధానము ద్వారా

**స్వాతిచినుకు ముత్యపుచిప్పలో పడిన ముత్యమవుతుంది**

వస్తువుల పైన మెదడు చూపించే ప్రభావము అంచనా వెయ్య బడుతుంది.

లూథర్‌వరథేంక్ అనే వ్యక్తి మొక్కలు, పూలు, క్రిమి కీటకాలు, పక్షులు, పశువులు మొదలగువాటిమీద తన భావ సంవేదనల ద్వారా వివిధ రకాలైన ప్రభావాలను చూపించటంలో సఫలీకృతుడైనాడు. దీనితో పరిశోధకుల ఉత్సాహము ద్విగుణీ కృతమైనది. ఫలితము ప్రాణులమీదనేగాక, పదార్థములు, వస్తువులమీద కూడా ఆలోచనాశక్తి ఆశ్చర్యజనకమైన ప్రభావాలను చూపించగలదని నిరూపించడములో విజయము సాధించారు.

'ప్రాపంచిక వస్తుసంపదలు, తుచ్ఛమైన ఇంద్రియభోగాల నుండి మనస్సును కొంచెము పైకి లేపి ఊర్ధ్వగామిని చెయ్యగల్గితే, అది సాధారణ ప్రజలకు అద్భుతాలుగా అనిపించే శక్తి సామర్థ్యములతో పరిపూర్ణమవుతుంది. మనస్సు ఆకాశములో పరిభ్రమించగలదు, మన జ్ఞానేంద్రియములు గ్రహించలేనటు వంటి, మన తర్కము వ్యక్తము చెయ్యలేనటువంటి సంఘటనలను గ్రహించగలదు కూడా' అని మెస్మరిజమ్‌ను కనుగొన్న మెస్మర్ వ్రాసియున్నాడు.

అమెరికాకు చెందిన ప్రసిద్ధ విద్వాంసుడు డా॥ రైన్ పైన చెప్పబడిన సత్యమును గురించి విస్తృతమైన పరిశోధనలు చేసి 'ఆలోచనలను, భావాలను ఏదో ఒక ప్రయత్నము, అభ్యాసము ద్వారా మనస్సులోని ఆలోచనలు సాగే సామాన్య భూప్రపంచపు పరిధినుండి పైకిలేపి ఆకాశములో పరిభ్రమింప జెయ్యగలిగితే; అది భూత-భవిష్యత్తులకు సంబంధించిన అనేక సంఘటనలను ఎటువంటి తీగలు లేకుండానే సందేశాలను మనకు అందించగలదు' అని కనుగొన్నారు. పైన చెప్పబడిన తథ్యములను ప్రతిపాదించే అనేక సంఘటనలను 'న్యూ ఫ్రాంటి యర్స్ ఆఫ్ మైండ్' అనే పుస్తకములో వివరణాత్మకముగా లిఖించారు. ఇది అంధవిశ్వాసము కాదు, విజ్ఞానము సమ్మతించిన ప్రక్రియ!

ఈ సత్యమును అర్థము చేసుకునేముందు, మనస్సు యొక్క శక్తిని గురించి తెలుసుకొనుట చాలా అవసరము. ధ్వని తరంగాలను పట్టుకునేందుకు రేడియోలో ఒక ప్రత్యేకమైన క్రిస్టల్ బిగించబడి ఉంటుంది. అదేవిధముగా శరీరమనే ఆధ్యాత్మికతకు 'మనస్సు' అనే క్రిస్టల్ అనుసంధానమై ఉంటుంది. ఈథర్ అనబడే పదార్థము ఈ విశ్వబ్రహ్మాండ మంతా వ్యాపించి ఉన్నదని విజ్ఞానశాస్త్రమును చదువుకున్న ప్రతి ఒక్కరికీ తెలుసు. మనము మాట్లాడే మాటలుకూడా తేలికపాటి ప్రవాహముగా ఆకాశములో కదులుతూంటాయి. మనము మాట్లాడిన శబ్దాలను విద్యుత్పరమాణువుల రూపములోకి మార్చగలిగితే అప్పుడు ఆ శబ్దతరంగాలు కూడా విద్యుశ్చక్తి వలె ప్రచండరూపమును దాల్చి, వేగముగా నాలుగు దిక్కులకూ వ్యాపిస్తాయి. ఆ శబ్దతరంగాలు ఆకాశమంతటా నిండి ఉంటాయి. రేడియో ఆ శబ్దములను పట్టుకుంటుంది. విద్యుత్పరమాణువులను అడ్డుకొని శబ్దతరంగాలను మాత్రమే లౌడ్‌స్పీకర్ దాకా వెళ్ళనిస్తుంది. అప్పుడు ఎక్కడో దూరంగా కూర్చున్న వ్యక్తి మాట్లాడిన మాటలుకూడా మనకు ఇక్కడ వినపడతాయి. శబ్దములను తరంగములుగా; తరంగాలను తిరిగి శబ్దములుగా మార్చే పని విద్యుత్తు చేస్తుంది. అదే విధముగా ఆధ్యాత్మిక చికిత్స ఆలోచనలను పంపించడము (టెలీపతి) అనే పనిని మనస్సు చేస్తుంది.

మానవ శరీరములోని 'మనస్సు' అనేది ఒక ప్రత్యేకశక్తిగా కన్పించినప్పటికీ శరీరములోని 'ప్రతికణములోనూ ఒక మనస్సు' లేదా ఒకొక్క కణములో ఒక్కొక్క మనస్సు ఉంటుందని శాస్త్రజ్ఞులకు తెలుసు. కణములలోని మనస్సుల సమూహము లన్నీ కలిసి 'మనస్సు' నిర్మించబడుతుంది. ఒక్కో అవయవము యొక్క క్రియాక్షేత్రము ఒక్కొక్క రీతిలో ఉంటుంది. కానీ అవయవములన్నీ మనస్సు యొక్క అధీనములో ఉంటాయి. గుదము యొక్క సమీపములో ఉండే జీవకణములన్నీ తమవంటి రసాయనికపదార్థమును వెదుకుతూ, అది లభించి నప్పుడు స్వీకరిస్తూవుంటాయి. అవి ఉత్తేజితమైనప్పుడు కామ వాసన ప్రేరేపించబడుతుంది. కానీ మనస్సనే అవయవము అందుకు ఇష్టపడినప్పుడు ఆ కామవాసనపైన నియంత్రణ ఏర్పడుతుంది. ఈవిధముగా శరీరములోని అన్ని అవయవ ములలోని మనస్సులూ తమ తమ కోరికలను వ్యక్తము చేస్తాయి. అయితే మనస్సు అనే అవయవము వాటన్నింటినీ జల్లించివేస్తుంది. ఏదైనా కోరిక కచ్చితముగా నెరవేరదు అని తెలిసినప్పుడు, దానిని అణచివేసి మరొక కోరికకు సహకార మిచ్చి, దానిని నెరవేర్చేవిధముగా పనిచేస్తుంది.

**చందనవృక్షం వద్ద ఉన్న గడ్డి కూడా సుగంధభరితమవుతుంది**

ఈ అంశమును ఇంకా బాగా అర్థము చేసుకొనవలెనంటే శరీర నిర్మాణమును గురించిన పరిజ్ఞానము కొంతవరకూ అవసరము. ఈ భౌతికశరీరము సూక్ష్మమైన జీవకణములతో నిర్మించబడుతున్నది. ప్రతి ఒక్క కణమూ ప్రోటీన్ యొక్క ఒక అండాకారపు గోడతో చుట్టివేయబడి ఉంటుంది. ఆ కణము లోపల వందలకొలది మిశ్రమధాతువులుంటాయి. నైట్రోజన్, న్యూక్లియక్ ఆమ్లముల యొక్క పెద్ద సమూహము ఈ కణము లోపల ఉంటుంది. ఫాస్ఫరస్, క్రొవ్వు, చక్కెర కూడా ఇందులో మిళితమై ఉంటాయి. విటమిన్స్, హార్మోన్స్‌కు చెందిన ఇతర కర్బన పదార్థములు కూడా తక్కువ మోతాదులో ఇక్కడ చోటు చేసుకుంటాయి. వాటిలో కర్బనము లేని లవణాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. అంటే ప్రోటీన్స్, క్రొవ్వు, న్యూక్లియక్ ఆమ్లము, చక్కెర, లవణము మొదలైన ప్రాపంచిక భౌతిక పదార్థములను శాస్త్రవేత్తలు ఒక జీవకణములో ఏవిధముగా కనుగొన్నారో; నిశ్చయముగా ఆలోచనల నిర్మాణము జరిగే పదార్థమేదీ లేదని కూడా వారు ప్రతిపాదించారు. కానీ అలాంటి పదార్థముల మీదనే అసంభవమైన ఆలోచనల భవనం నిర్మించబడుతున్నది, దానినే మనము జీవితము అంటున్నాము. అందుచేత ఈ జీవితము యొక్క వైచిత్రి ఇంకా పెరిగిపోతున్నది అని ఆధునిక శాస్త్రవేత్తల ప్రతిపాదన.

ఈ జీవకోశములన్నింటిలోనూ ఉన్న వేర్వేరు మనస్సులన్నీ కలిసి మనస్సు అనే అవయవమును నిర్మిస్తున్నాయి. అందుచేత మనస్సనే దాన్ని ఏదో ఒక పదార్థముగాకాక; 'మనోమయ కోశము' అని ఆధ్యాత్మికవేత్తలు పిలుస్తున్నారు. శరీరములోని మనస్సులన్నీ కలిసి ఆ అసలు మనస్సు యొక్క అధీనములోకి వచ్చి పనిచేసే స్థితి ఒకటి ఉంటుంది. ఈ స్థితి కనుక మంచి క్రమశిక్షణతో స్థాపించబడగల్గితే మనస్సుకు చండప్రచండమైన శక్తి ఏర్పడుతుంది. ఫలితముగా దానిని ఏ దిశలో ప్రయోగిస్తే ఆ దిశగా అది తుపాను వంటి అలజడులను ఉత్పన్నము చేస్తుంది.

ఈ సూక్ష్మజీవుల మనస్సులు సంస్కారజన్యమనస్సు యొక్క అధీనములో ఉండి; బుద్ధి ఇచ్చే ఆజ్ఞలను అమలుపరుస్తుంటాయి. వీని మనస్సులో తాము చెయ్యవలసిన విశేష కార్యమునకు కావలసిన విచిత్రమైన యోగ్యత ఉంటుంది. రక్తములోనుండి అవసరమైన వాటిని గ్రహించడము, అనవసరమైనవాటిని విసర్జించడము వీని బుద్ధికి ప్రమాణాలు. శరీరములోని ప్రతి అవయవములోనూ ఈ క్రియ జరుగుతూనే ఉంటుంది. ఏ జీవకోశవ్యవస్థ ఎక్కువ క్రియాత్మకముగా ఉంటుందో అది శక్తివంతమై తన చుట్టుప్రక్కల ఉన్న జీవకోశముల శక్తిని సన్నగిల్లచేస్తుంది. గుదము చుట్టుప్రక్కలుండే జీవకణములన్నీ కామభోగము నందు అభిరుచి కలిగియుంటాయి. అవి క్రియాత్మకమైనప్పుడు అన్నకోశములోని జీవకణముల శక్తిని కూడా హరించివేస్తాయి. ఈవిధముగా కామవాసన ప్రతిసారీ తృప్తిచెందినప్పుడల్లా జీర్ణాశయశక్తి మందగిస్తుంటుంది. ఫలితముగా ఆ వ్యక్తి జీర్ణాశయరోగిగా మారతాడు. జీవ కణములు సరియైన క్రమశిక్షణలో లేకపోవడము వలన శరీరము బలహీనమౌతుంది. ఏదియేమైనా మంచి జీర్ణశక్తి, గాయములు మానడము, అవసరమైనప్పుడు వేరొక ప్రదేశమునకు పరుగెత్తుకుపోగలగటము, ఇంకా ఇతరమైన ఎన్నో పనులు కోశముల లోపలి జీవకణముల యొక్క మానసికశక్తిననుసరించి జరుగుతుంటాయి. వాటిని విశృంఖల ముగా వదిలివేస్తే వాటన్నింటికీ చక్రవర్తి అయిన మెదడులో ఉండే అసలు మనస్సు బలహీనమై అస్తవ్యస్థమౌతుంది. అలాకాక యావత్ శరీరములోని మనస్సులన్నీ మెదడు లోపల ఉండే అసలు మనస్సు యొక్క అధీనములోకి వస్తే శక్తి ద్విగుణీకృతమవుతుంది.

మృదువైన నరములు, కండరములు, పొరలు మొదలైనవి కాక, దృఢముగా ఉండే ఎముకలు, పళ్ళు, గోళ్ళు వంటి కఠిన పదార్థములు కూడా సూక్ష్మజీవకణముల సహకారముతో తయారవుతాయి. తమతమ కార్యవిధానములకు తగినట్లుగా వాటి ఆకృతి వేర్వేరుగా ఉంటుంది. కానీ వీటిలో స్వతంత్రముగా పనిచేసే శక్తి సద్యోజాతమనస్సు యొక్క ఆధీనములో ఉండి పనిచెయ్యగలిగే రెండవ శక్తికూడా ఉంటుంది. అంటే జీవ కణములన్నీ తామున్న చోటనే ఉండి పనిచెయ్యగలవు. సంఘటితకార్యమును సైతము నిర్వహించగలవు. ఉదాహరణకు: ఒక గ్రామములోని వ్యక్తులందరూ వేర్వేరుగా ఉంటూ తమ వృత్తులు తాము నిర్వహించుకుంటుంటారు. తమ పొలము తాము దున్నుకోవటము, పంట కోసుకోవటము, ఎవరి ఇంట్లో వాళ్ళుంటూ, ఎవరి వంట వాళ్ళు తయారుచేసుకోవటము... మొదలైనవన్నీ ఎవరికివారికే పరిమితమౌతాయి. కానీ

**చింతామణి స్పర్శతో ఇనుము బంగారంగా మారుతుంది**

అవసరము వచ్చినప్పుడు అందరూ కలసి సార్వజనికమైన బావులు త్రవ్వడమో, చెఱువులను ఏర్పాటుచేసుకోవటమో వంటి పనులను చేస్తారు. అప్పుడు ఒకరికొకరు సహాయము చేసుకుంటారు. అదేవిధంగా జీవకణములలో మనస్సు-సద్యో జాతమనస్సు అనే రెండు క్షేత్రములుంటాయి. రెండూ ముఖ్య మైనవే, కానీ కొన్ని కణములు కేవలము శరీరము యొక్క ఆరోగ్యమును పరిరక్షించటానికే నియమింపబడి ఉంటాయి. అవి శరీరములో మురికిని చేరనీయకుండా, మలినమును దూరము చేయటానికీ, రోగకారక క్రిములతో పోరాడి వాటిని బయటకు నెట్టివేయటానికీ పనిచేస్తుంటాయి. ఈవిధముగా శరీరములోని మనస్సులు తమ తమ వ్యక్తిగతమైన బాధ్యతలను నిర్వహిస్తుంటాయి. బాహ్యజగత్తుతో సంపర్కమును ఏర్పరుచు కుంటుంటాయి, రెండు విభిన్నమైన పనులను నిర్వహిస్తుంటాయి.

ఈవిధముగా శరీరము లోపల జీవకణముల సమూహములు ఉంటుంటాయి. ఎఱుపురంగు కణముల సంఖ్య సుమారు 75,00,00,00,000 ఉంటుంది. శరీరమంతటికీ ఆక్సిజన్‌ను సరఫరా చెయ్యటము వీటి కర్తవ్యము. ఈ జీవ కణములు ఎంతో ప్రాముఖ్యత కలిగినవి. ఎందుకంటే ఇవి జగత్తునుండి ఆక్సిజన్‌ను గ్రహించడమనే వైజ్ఞానికకార్యమును నిర్వహిస్తున్నాయి. అందుచేత మనిషి కొంత బలహీనుడైనప్పటికీ చాలాకాలము వరకూ జీవించే ఉండటము జరుగుతున్నదంటే విశ్వవ్యాప్తమైన ప్రాణశక్తితోటి శరీరమునకు సంబంధము ఏర్పరచబడు తుండటమే అందుకు కారణము!

*- పూజ్యగురుదేవుల వాఙ్మయం 17 (11.2) నుండి*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

---

## సుఖదుఃఖాలు మనం సృష్టించుకొన్నవే

*సుందరవనములో ఒక కాకి నివాసముండసాగింది. అది అప్పటివరకు కొంగను చూచి ఎఱుగదు. వర్షాకాలములో దూరప్రాంతం నుండి వచ్చిన ఒక కొంగ ఆ వనంలో ప్రవేశించింది. దానిని చూచిన కాకికి చాలా దుఃఖము కలిగింది. తన శరీర రంగు ఇంత నల్లగా ఉండి, కొంగ రంగు ఇంత తెల్లగా ఉన్నదనెడి చింతనలో పడి దుఃఖపడసాగింది. తన దుఃఖాన్ని భరించలేక కొంగవద్దకు వెళ్ళి "కొంగ సోదరా! నీ శరీర రంగు చాలా తెల్లగా ఉంది. దీనితో నీవు ఎంతో సుఖాన్ని పొందుతున్నావు!" అంది. దానికి కొంగ జవాబిస్తూ "నేను మొదటి నుంచి దుఃఖంతో ఉన్నాను. ఈ చిలుకను చూడు. రెండు రంగులతో కూడిన తన శరీరంతో ఎంత అందంగా ఉందో. నాకున్నది ఒక్క తెలుపు రంగేగా" అన్నది. దీనిని విన్న చిలుక మరింత బాధను వ్యక్తపరుస్తూ "అరె! నేను మీ ఇరువురికి మించిన దుఃఖంలో ఉన్నాను. కొంచెం ఈ నెమలిని చూడండి అది పలురంగుల కలయికతో ఎంతో అందంగా ఉంది" అన్నది. అప్పుడు అన్నీ కలసి నెమలివద్దకు పోగా వేటగాండ్రు దానిని చంపుటకై దాని వెంటపడుట చూచాయి. నెమలి వేటగాండ్ర బారి నుండి తప్పించుకొని సురక్షిత ప్రాంతానికి చేరిన తదుపరి, మిగిలిన పక్షులు తమ దుఃఖాల గురించి నెమలితో చెప్పగా, నెమలి ఇలా బదులిచ్చింది. "సోదరులారా! నా సుందర ఆకర్షిత రంగుల కారణంగా నా జీవితం అభద్రంగా మారింది. దిన దిన గండం నూరేళ్ళ ఆయుష్షులా మారింది. ఈ రంగులు నాకు లేకుండా ఉన్నచో ఆనందంగా నేను మురళిని వాయించుకుంటూ సుఖంగా ఉండేదాన్ని" అన్నది.*

*ఇప్పుడు పక్షులన్నింటికీ అర్థమైంది. భగవంతుడు ప్రతిప్రాణిని అమూల్యమైన దానినిగా సృష్టించాడు. ఏ ఒక్క దానిని గొప్పదానినిగా లేక హీనమైన దానినిగా సృష్టించలేదు. కావున మనం అసంతోషంగా జీవించాలనుకొన్నచో ప్రతి పరిస్థితిలో అసంతోషాన్ని వెతుకుతాము. అట్లే సంతోషంగా ఉండాలనుకొన్నచో సంతోషాన్ని ప్రతి పరిస్థితిలో పొందుతాము. కావున సుఖ దుఃఖాలు మనలోనే ఉన్నాయి.*

*- హిందీ మూలం: అఖండజ్యోతి, మార్చి 2015*

*అనువాదం: శ్రీమతి ఎ. శారద*

**అతి ఉచ్ఛస్థాయిలో పని చేయుటకు ఏకాంత, శాంత, సత్వగుణాలు అవసరం**

### గాయత్రీ జయంతి ప్రత్యేకం

# గంగా గాయత్రీల సాధనా పర్వం

ఈ సంవత్సరం మే 28 నాడు గాయత్రీ జయంతి లేదా గంగా దశహరా జరుపుకుంటాం. మనిషి పాపాలను గంగమ్మ ప్రత్యక్షంగా కడిగి పవిత్రుల్ని చేస్తుంది. పరోక్షంగా, సూక్ష్మ రూపంలో గాయత్రి మన ప్రాణాలను వికసింపచేసి నిర్మలంగా మారుస్తుంది. గంగ, గాయత్రి రెండూ మాతృరూపంలో పూజనీయులు. ఎందుకంటే వీరు తల్లి వలె బిడ్డలైన ప్రాణులందరినీ సమానంగా ప్రేమిస్తారు, పోషిస్తారు. గంగా, గాయత్రి – ఈ రెండు భారతీయ సంస్కృతికి ఆధార స్తంభాలు. గంగమ్మ లేకపోతే భారతదేశపు గొప్పతనం, పవిత్రత అసంపూర్ణంగా ఉండేది. గాయత్రి లేకుండా మానవజాతి ఉత్కృష్టత అసంపూర్ణంగా ఉండేది. ఈ రెండూ ఆధ్యాత్మిక జీవితానికి పరమ సోపానాలు. ఎందుకంటే గంగ వల్ల పవిత్రత లభిస్తే గాయత్రి వల్ల ప్రఖరత లభిస్తుంది.

మానవజాతికి పవిత్రతని, ప్రఖరతని ప్రసాదించే గంగ, గాయత్రి రెండూ పూజనీయ, వందనీయ మాతృమూర్తులు. 'గంగా దశహర' రోజున గంగమ్మ భువిపై అవతరించింది. అదే రోజు మహర్షి విశ్వామిత్రుడు గాయత్రీమంత్రాన్ని దర్శించి బ్రహ్మర్షి స్థానంలో ప్రతిష్ఠితులయ్యారు. ఆయన సంవత్సరాల తరబడి చేసిన తపస్సు ఆ రోజు ఫలించింది. ఎందుకంటే అసురులు సైతం ఆర్యులుగా, సభ్యపౌరులుగా మారే విధానాన్ని అన్వేషించారు. సరైన వివేకం లేనివారిని అసురజాతివారు అనేవారు. వారు అసభ్యంగా ఉండేవారు. అసురజాతివారిలో స్వచ్ఛత, సౌందర్యం, సంస్కృతి ఉండేది కాదు. కాబట్టి వీరు ఎల్లప్పుడూ హింసాత్మకంగా ప్రవర్తిస్తుంటారు. వీరి శరీరంలో ప్రవహించే ప్రాణతత్త్వం కలుషితమవడమే వీరి స్థితికి కారణం.

విశ్వామిత్ర మహర్షి తమ తపస్సు ద్వారా ఈ సమస్యకు పరిష్కారాన్ని వెతికి పట్టుకున్నారు. కేవలం గాయత్రీ మంత్రారాధన వల్ల ఈ ప్రాణాలను వికసింపచేసి ఊర్ధ్వముఖం కావించవచ్చు. ఈవిధంగా అసురులను కూడా సభ్యులుగా, సుసంస్కారవంతులుగా తీర్చిదిద్దవచ్చు. విశ్వామిత్రమహర్షి ద్వారా పరిశోధించబడ్డ ఈ విధానం కాలక్రమేణా కీలితమైంది. ఎవరో కొంతమంది ముఖ్యుల వద్దనే పరిమితమైంది. కాని యుగనిర్మాణ ప్రణాళికను ప్రోత్సహించిన పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యగారు మళ్ళీ తమ జీవితంలో కఠోర గాయత్రి తపస్సు చేసి దీన్ని ప్రజలందరికీ సులభతరంగా అందేటట్టు చేశారు.

ఒకప్పుడు ఈ మంత్రజపం ఏదో కొన్ని కులాల వారు మాత్రమే చేసేవారు. మహిళలకు మంత్రోచ్చారణ నిషేధించ బడింది. గాయత్రీమంత్రం గురించి ఈవిధమైన అనేక మూఢ నమ్మకాలు పుకార్లుగా రేకెత్తాయి. కులమత భేదాల పరంపర కొనసాగుతున్న కాలంలో పరమపూజ్య గురుదేవులు సమాజంలోని అన్ని వర్గాల వారికి గాయత్రీ దీక్షనిచ్చి వారి చేత ఒక సంకల్పం చేయించారు. "వయం రాష్ట్రే జాగృయామ పురోహితాః" అంటే మేమంతా రాష్ట్రం సజీవంగా, జాగృతంగా ఉండడానికి సంఘటిత ప్రయత్నం చేస్తాం. నేడు ప్రపంచమంతా గాయత్రీ మంత్రోపాసన, సాధన, ఆరాధన చేస్తోంది. మహిళలు కూడా పురుషులతో సమానంగా గాయత్రీమంత్ర జపం చేసి యజ్ఞంలో సమాన భాగస్వామ్యాన్ని నిర్వర్తిస్తున్నారు. నేడు మన దేశంలోనే కాక, ప్రపంచంలో కూడా చాలచోట్ల మనుషులు గాయత్రీ అనుష్ఠానం, యజ్ఞం చేస్తూ భగవంతుని నుండి సద్బుద్ధిని కోరుకుంటున్నారు.

అందుకే నేడు సమాజంలో మార్పు కనిపిస్తోంది. సమాజంలో కూరుకుపోయిన దురాచారాలు, దుష్ప్రవర్తనలను అంతమొందించడానికి అందరూ కలిసి నడుం బిగించారు. మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు, పర్యావరణ పరిరక్షణ కోసం సంకల్పాలు తీసుకుని వాటిలో సక్రియంగా భాగం పంచుకుంటున్నారు. కాలుష్యాన్ని నివారించడానికై జాగరూకులై ఉంటున్నారు. కాని ఈ ప్రయాస సరిపోదు. గమ్యం చాలా దూరంలో ఉంది. దాన్ని చేరుకునేంత వరకు అందరూ కలిసి సర్వోత్తమ ప్రయత్నం చేయవలసిందే.

గాయత్రీ జయంతితోపాటు గంగా దశహరా పర్వం కూడా జరుపుకుంటాం. ప్రత్యేకమైన పది జ్యోతిష యోగాలు ఈ రోజు కలిసి ఉంటాయి. జ్యోతిషం దృష్ట్యా జ్యేష్టమాసం, శుక్ల

**ధర్మం ఎక్కడుంటే విజయం ఆ వైపే ఉంటుంది**

పక్షం, దశమితిథి, వారం (విశేషంగా బుధవారం), హస్తా నక్షత్రం, వ్యతిపాతయోగం, గరకరణం, ఆనందయోగం, కన్యారాశిలోని చంద్రుడు, వృషభ రాశిలోని సూర్యుడు – ఈ పదియోగాలు విశేషంగా కలిసి ఉంటాయి. అందుకే దీనిని దశహరా లేదా దశయోగాలను ప్రసన్నం చేసుకున్నది అని అంటారు. ఈ పది జ్యోతిష యోగాల వల్ల గంగానది జలాలలో దివ్య ప్రకాశం అవతరిస్తుంది, అందుకే ఈ నీరు భౌతికంగా, ఆధ్యాత్మికంగా కూడా అత్యంత లాభదాయకమైనది.

గంగానది మనందరికీ చల్లటి, పవిత్రమైన, తియ్యటి నీరుని అందిస్తుంది. కాని అందుకు బదులుగా అందరమూ దాని అస్తిత్వమే కోల్పోయేంతగా దానిని మలినం చేస్తున్నాము. ఒకప్పుడు మనదేశంలో సరస్వతీనది ప్రవహించేది, కాని ఇప్పుడది లుప్తమైపోయింది. ఇప్పుడున్న పరిస్థితి చక్కబెట్టక పోతే చరిత్రలో గంగ అవతరణ, ప్రవాహం గురించిన పౌరాణిక కథలను గాథలుగా చెప్పుకుంటారే తప్ప, ప్రత్యక్షంగా చూసే భాగ్యం ఉండదు.

చాలాచోట్ల ఇప్పుడు గంగ నీరు తాగడానికి, వాడడానికి కూడా పనికిరానంతగా కలుషితమైపోయింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్ వారు నిర్వహించిన అధ్యయన ఫలితాలే ఇందుకు ప్రమాణం. గంగ ఒడ్డు నుండే ముఖ్య ప్రదేశాలైన వారణాసి, బీహార్‌లోని వైశాలి, బెంగాల్‌లోని ముర్షిదాబాద్ మొదలైన చోట్ల పదివేల మందిపై జరిపిన పరిశోధనల ప్రకారం వారిలో క్యాన్సర్ లక్షణాలు బాగా పెరిగాయి. గంగ ఒడ్డున స్థిరపడ్డ నగరాలు, పరిశ్రమలు వాటి నుండి వెలువడే కలుషిత నీటిని, రసాయనిక వ్యర్థాలను గంగ నీటిలో కలపడమే అందుకు కారణం. 1986 నుండి నిరంతరాయంగా గంగ ప్రక్షాళన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. కానీ గంగలో వదులుతున్న కలుషిత, రసాయనిక వ్యర్థాలపై ఆంక్షలు పెట్టనిచో గంగను శుభ్రపరిచే ప్రయత్నం అసంపూర్ణంగా ఉన్నట్లే.

గంగమ్మను తల్లిగా భావించి, ఆ నీటిని పూజగదిలో పెట్టుకుని పూజిస్తాం, మోక్షదాయిని అంటాం. మరి అలాం టప్పుడు ఆ నీరు కలుషితమై, దాని అస్తిత్వమే సమసిపోయే పరిస్థితి తెచ్చేంత అపరాధాన్ని ఎలా చేయగలం. పవిత్రతను, ప్రఖరతను ప్రసాదించే తల్లులైన గంగ, గాయత్రీ మాతల పట్ల మన కర్తవ్యాన్ని నిర్వర్తించాలి అనే సందేశాన్ని ఈ సంవత్సరం గంగా దశహర, గాయత్రీ జయంతి అందిస్తున్నాయి. గంగతోపాటు మిగిలిన నదీమ తల్లుల పరిశుభ్రతకు తగిన పరిశ్రమ, సహకారాన్ని అందిస్తాము. సామూహిక సాధనా సంవత్సర సాధన ఫలించే విధంగా సామూహికంగా గాయత్రీ మంత్రోపాసన చేస్తాము.

*– అఖండజ్యోతి జూన్ 2014*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## సంస్కరింపబడినవారే యుగ నిర్మాణంలో భాగస్వాములయ్యెదరు

*శిలల సమూహం, తగిన సంస్కారాన్ని పొందుటకై శిల్పిద్వారం వద్ద వేచి ఉన్నాయి. శిల్పి తన పనిని ప్రారంభిస్తూ మొదటి శిలపై తన ఉలిని ప్రయోగిస్తూ సుత్తితో మోదాడు. ఉలి మాధ్యమంగా సుత్తిదెబ్బ తగలగానే ఆ శిల ఆర్తస్వరంతో బాధగా మూల్గసాగింది. దీనిని చూచిన శిల్పి ఆ శిలను వదలి, రెండవ శిలను సంస్కరింప ప్రయత్నించగా, అది కూడా మొదటి శిలలా బాధగా మూలిగింది. చిట్టచివరకు ఒక్క శిల మాత్రం గంభీరంగా నిలచి, శిల్పి ద్వారా సంపూర్ణంగా సంస్కరింపబడి (చెక్క బడి) భగవాన్ శివుని అత్యంత సుందర రూపాన్ని సంతరించుకుంది.*

*ఈ సుందర శివుని విగ్రహాన్ని దర్శించిన వారంతా ఆ మూర్తి ఎదుట సాగిలపడి మ్రొక్కుట చూచిన (అప్పటి వరకు సంస్కరించుకొనుటకు విముఖత చూపిన) మిగతా శిలలన్నీ "తమకు ఇంతటి సౌభాగ్యాన్ని ఏల కలిగించలేదు?" అని ప్రశ్నించాయి శిల్పిని. జవాబుగా శిల్పి వానితో "వికృతాన్ని మొదట తొలగించిననేగాని సుందరత బహిర్గతం కాదు. ఎవ్వరైతే వారిలోనున్న ముఱికిని దుష్టత్వాన్ని తొలగించుకొనుటకు సంసిద్ధులు కారో వారు నవ నిర్మాణానికి సాక్షులుగా లేక భాగస్వాములుగా కానేరరు" అన్నాడు. సుఖాలనందిపుచ్చుకొనవలయునన్నచో తొలుత కష్టాలను భరించవలసిందే!*


*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 2015*
*అనువాదం: ఎ. శారద*

**కార్యసిద్ధికి సంకల్పబలం, కార్యశీలత అత్యంత ప్రధానం**

బుద్ధ పూర్ణిమ ప్రత్యేకం

# అప్ప దీపో భవ

బుద్ధపూర్ణిమగా పిలువబడే వైశాఖపూర్ణిమ బుద్ధత్వము యొక్క ప్రకాశమును వెదజల్లేందుకై ఈ సంవత్సరం మే 14న వచ్చింది. పవిత్రమైన ఈ తిథిరోజునే ఈ పృథ్విమాత ఒడిలో, శుద్ధోధన మహారాజుగారి మందిరములో రాజకుమారుడైన సిద్ధార్థుడు జన్మించాడు. ఆయన పుట్టిన తరువాత ఎన్నో వైశాఖ పూర్ణిమలు వచ్చి వెళ్ళాయి. కానీ ఒక వైశాఖపూర్ణిమ మహాపుణ్య తిథినాడు ఒక గొప్ప పరివర్తన జరిగింది. ఆ రోజున మహా తపస్వియైన సిద్ధార్థుని అంతఃచేతన యందు బుద్ధత్వము ఉదయించింది. అది కేవలం భారతదేశాన్నే కాదు, విశ్వము యొక్క చేతనత్వమును కూడా జాగృత పరచి అందరినీ ఒక్క కుదుపు కుదిపేసింది. బుద్ధత్వ అవతరణతో జీవితము యొక్క అసలైన అర్థమేమిటో బోధపడింది, ఆయన జన్మ సార్థక మయింది. ఆయనతో పాటే మొత్తం మానవజాతికంతటికీ మానవత్వమును, జీవితమును సార్థకపరుచుకునేందుకు ఒక మార్గము కనపడింది. ఇప్పుడు ఆయన సిద్ధార్థుడు కాదు, ఆయన మహాత్ముడైన బుద్ధునిగా పరివర్తన చెందారు. ఆయన ఒక అద్భుతమైన క్రాంతిని తనతోపాటే తీసుకువచ్చారు. ఆయన ఉనికిని అందరూ స్వీకరించారు, ఆమోదించారు, ఆయన బోధలను పాటించారు. ఆయన అహింస-కరుణల సహాయముతో మానవత్వం అంటే ఏమిటో మనిషికి తెలియచేశారు.



సిద్ధార్థుడు జన్మించిన శుభముహూర్తాన కపిలవస్తు రాజ్య మంతటా గొప్పగొప్ప వేడుకలు, ఉత్సవాలు జరిగాయి. నగర మంతా ఎంతో అందంగా అలంకరించబడింది. నగరవాసులు రాత్రంతా దీపాలు వెలిగించి నాట్యం చేశారు. వారంతా ఈ శుభదినం కొరకు ఎన్నో రోజులుగా కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. తత్ఫలితంగా దొరికిన అద్భుతఘడియలవి. నవజాత రాజకుమారునికి సిద్ధార్థుడని నామకరణం చేశారు. సిద్ధార్థుడు అంటే జీవితము యొక్క అర్థమును తెలుసుకొని దానిని సిద్ధింపచేసుకున్నవాడు అని, తన అభిలాషను నెరవేర్చు కున్నవాడు అని అర్థాలున్నాయి. నిజం చెప్పాలంటే సిద్ధార్థుడు బుద్ధునిగా మారి తన జీవితము యొక్క అర్థమును సిద్ధింప చేసుకున్నాడు.

రాజమహల్‌లో రాజకుమారుడు సిద్ధార్థుడు జన్మించిన సందర్భంగా ఉత్సవాలు చేసుకుంటున్న సమయంలో హిమాలయాల నుండి ఒక వృద్ధ తపస్వి వేంచేశారు. ఆయన వచ్చి మహల్ యొక్క ముఖద్వారము వద్ద నిలబడ్డారు. ఆయనే మహాతపస్వియైన అసితుడు. ఆయనను సమస్త నగరవాసులే కాదు స్వయంగా సామ్రాట్టు కూడా గౌరవిస్తారు. ఆయన ఇంతవరకెప్పుడూ రాజధానికి రాలేదు. ఎప్పుడూ సమ్రాట్టే ఆయనను చూసేందుకు వెళ్ళేవాడు. అయితే ఈ రోజు అనుకోకుండా ఆయనను మహల్ యొక్క ద్వారము వద్ద చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఆశ్చర్యము నుండి ఇంకా తేరుకోని మహారాజు "మహాతపస్వీ! నేను మీకు ఏమి సేవ చేయగలను" అని వినయంగా అడిగాడు.

ఆయన సందేహాలను పటాపంచలు చేస్తూ "కంగారుపడకు శుద్ధోధనా! మేము నీ పుత్రుడిని దర్శించాలని వచ్చాము" అన్నారు. శుద్ధోధనమహారాజుకి ఏమీ అర్థం కాలేదు. అసితుని వంటి వీతరాగి అయిన సాధుపుంగవుడు తన కుమారుడిని చూసేందుకు రావడమే తనకు లభించిన మహద్భాగ్యం. వెంటనే తేరుకున్న మహారాజు పరిగెత్తుకుంటూ వెళ్ళి నవజాత శిశువును బైటికి తీసుకువచ్చాడు. అసితులవారు వంగి ఆ శిశువు పాదాల వద్ద శిరస్సునుంచారు. అప్పుడు ఆ శిశువు పాదాలు ఆయన

**దండోపాయాన్ని ధర్మరక్షణ, కర్తవ్యపాలనకు మాత్రమే ఆశ్రయించాలి**

జటలలో ఇరుక్కున్నాయని చెప్పారు. ముందు అసితులవారు నవ్వారు కానీ తరువాత ఏడవసాగారు. అది చూసి మహారాజు హతాశుడై "మహామునీ! మీరు ఎందుకు ఏడుస్తున్నారు" అని అడిగాడు.

అసితులవారు ఇలా చెప్పారు –'నీ ఇంట్లోకి వచ్చిన ఈ పిల్లవాడు ఏదో సాధారణమైన ఆత్మకాదు. ఇతను అన్ని రకాలుగా అలౌకికమైన పిల్లవాడు. ఎన్నో వేల సంవత్సరాలు గడిస్తే కానీ ఇతను రాడు. ఇతను నీ కోసం సిద్ధార్థుడు కాదు. ఇతను సంపూర్ణమానవజాతి కోసం వచ్చిన సిద్ధార్థుడు. నాకు పరమసంతోషంగా ఉన్నది. కారణం ఏంటంటే నావంటి ముసలివాని జటలలో తన పాదాలు ఇరికించాడు. ఈ క్షణం నాకు పరమసౌభాగ్యకరమైనది. అందుకే నేను నవ్వాను. అయితే ఈ పువ్వు వికసించి పుష్పించి, దశదిశలా తన సుగంధాన్ని వెదజల్లే సమయానికి నేను ఉండను కదా అనే ఆలోచన రాగానే దుఃఖం పొర్లివచ్చింది. నా శరీరమును కూడా విడిచి పెట్టే సమయం ఆసన్నమయింది' అన్నారు.

కాలం గడిచింది, శిశువుగా ఉన్న సిద్ధార్థుడు కిశోరావస్థకు చేరాడు, యువకుడైనాడు, యశోధర రాణి అయింది, రాహుల్ అనే కుమారుడు జన్మించాడు. ఇవన్నీ భౌతికంగా మన కంటికి కనిపించే సంఘటనలు. అదృశ్యజగత్తులో చాలా జరిగింది. ప్రచండ వైరాగ్యము, అపారవివేకములు కలిసి మహాభి నిష్క్రమణగా పరిణామం చెందాయి. దాంతో యువరాజు తపస్విగా మారాడు. తపస్సుతో బలహీనమై, శిథిలావస్థకు చేరుకున్న సిద్ధార్థునికి సుజాత పాయసం తినిపించింది. దానితో ఆయన దేహానికే కాక జీవనచేతనకు కూడా ఒక నూతన జవశక్తి లభించింది. దానితో ఆయన ధ్యానంలోకి వెళ్ళి పోయారు. ధ్యానం నుండి కళ్ళు తెరిచేసరికి గౌతమబుద్ధుడైనాడు.

గౌతమబుద్ధునిగా మారిన ఆయన మంచుతో కప్పబడిన హిమాలయాల నుండి ప్రవహించే కరుణ అనే జలధార వలె ప్రకాశించసాగారు. ఆయన నుండి మహాకరుణ అనే గంగ ప్రవహించసాగింది. ఆ ప్రవాహము ఎంతోమందిని ఉద్ధరించింది. మహాత్ముడైన బుద్ధుడు మానవజాతికి మహోన్నతమైన శిరోమణి వంటివారు. ఆయనతో సమానంగా మహిమాన్వితమైన నామం మరొకటి లేదు. ఇంతవరకు ఎవ్వరూ కదిలించలేనంత మంది హృదయాలను ఆయన కదిలించారు. ఆయన ద్వారా ఎంతో మంది జాగృతులైనారు. ఎంతోమంది పరమభాగవతోత్తములు అయినారు. మరెవ్వరి ద్వారా అంతమంది జాగృతులు కాలేకపోయారు. ఈ కార్యం ఎవ్వరికీ సాధ్యపడలేదు.

బుద్ధభగవానుని వాక్కు చాలా మధురమైంది. ఆయన పలుకు అద్భుతమైంది. ఆయన ద్వారా చెప్పబడిన బోధిసత్త్వుని గాథలు జీవితంలోని ప్రతిదశలోను సత్యములనే ఋజువవు తాయి. బోధిసత్త్వుని ప్రతి ఒక్క కథ జీవితానికి ఒక మార్గమును చూపిస్తుంది. హెచ్.జి.వెల్స్ ఇలా అన్నాడు "మొత్తం భూమి మీదనే ఆయనలాంటి వ్యక్తి లేడు. ఆయన వలె ఈశ్వర శూన్యుడైన ఒక వ్యక్తిని పొందగలగడం చాలా కఠినమైనది. ఎంతటి ఈశ్వరుడో, అంతటి నిరీశ్వరుడు. అంటే ఈశ్వరుని ప్రతిభను ఎవరైనా వెతికేందుకు ప్రయత్నిస్తే బుద్ధుని కంటే ప్రతిభ ఉన్నవారు మరెక్కడా లభించరు. అయినా సరే ఆయన అంతటి ఈశ్వరశూన్యుడు. దీని అర్థం ఏమిటంటే ఆయన ఎప్పుడూ ఈ పరమసత్యాన్ని కనీసం ఉచ్చరించనైనా లేదు.

బుద్ధుడు దార్శనికుడు, ఆలోచనాపరుడు మాత్రమే కాదు, ఆయన కరుణాసాగరుడు కూడా. చాలామంది వ్యక్తులు మానవుని రోగాలను విశ్లేషించారు. అయితే ఇంత కరుణాత్మకంగా, సరైన విధానంలో ఎవరూ విశ్లేషించలేదు. బుద్ధుడు చెప్పే విధానమే కొంత వేరుగావుంటుంది. అది ఎవరైనా ఒక్కసారి వింటే చాలు ఆయనకు అనుయాయులై పోతారు. ఆయనను తేరిపారగా ఒక్కసారి కళ్ళనిండుగా చూసినా చాలు, దారి తప్పే ప్రసక్తే ఉండదు. ఎవరికైనా బుద్ధత్వములోని కొద్దిపాటి అంశ అందినా చాలు, వారి జీవితం మొత్తం మారిపోతుంది.

బుద్ధభగవానుని మూడు వాక్యములు **"బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి"** అనగా బుద్ధుడిని శరణుపొందు, ధర్మమును శరణు పొందు, సంఘమును శరణు పొందు అని అర్థం. అయితే ఆయన చివరి మాట అత్యంత విలువైనది. **"అప్ప దీపో భవ"** – అనగా నీవే దీపంగా మారు, నిన్ను నీవే వెతుక్కో, నిన్ను నీవే తెలుసుకో, నీవే ప్రకాశించు, అంతా నీలోనేవుంది. అంటే కేవలం మనం అంతా మనలోనే ఉందని తెలుకోవడంలోనే ఉన్నది, అనుభూతి చెందడంలోనే ఉన్నది.

*– అఖండజ్యోతి, మే 2014*

*అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్*

**కోపాన్ని వ్యక్తిపైన కాక అతడు/ఆమె అనుసరించెడి చెడుపై ప్రదర్శించు**

బోధ కథ

# పురుషార్థికి మాత్రమే విజయం

సేఠ్ మాణిక్ శాహ్ వద్ద అంతులేని ధన సంపద ఉంది. దేశం మొత్తంలో అతడి అధికారం నడిచేది. అతని మొత్తం ఐశ్వర్యానికి వారసుడు అతని ఏకైక పుత్రుడు సుభద్రుడు. సేఠ్‌జీ తన కుమారుణ్ణి తన ప్రాణాల కన్న మిన్నగా ప్రేమించేవాడు. అతని పుత్రుడు అతడి కనుసన్నలలో ఎల్లప్పుడూ ఉండాలని కోరుకునేవాడు. సుభద్రుడు గుణవంతుడు, ధర్మపరాయణుడు, వివేకవంతుడు మరియు గొప్ప పురుషార్థి కూడా. అతనిలో నిత్యం ఏదో ఒక విశేషమైన కార్యాన్ని చేయాలనే కోరిక బలంగా ఉండేది. ఒకనాడు అతడు సముద్రాన్ని దాటి విదేశాల్లో వ్యాపారం చేయటానికి అనుమతి కోరాడు. సేఠ్‌జీ దీన్ని విన్నంతనే తండ్రి దుఃఖితుడయ్యాడు. అతడు ఆర్ద్ర స్వరంతో కుమారునికి నచ్చచెపుతూ– "నాయనా! నీకు ఏదో చేయాల్సిన అవసరమేముంది? మన గృహంలో దేనికి కొరత లేదు. ఈవిధంగా సముద్రయాత్ర చేయాలనే ప్రమాదకరమైన ఆలోచన ఎందుకు కలిగింది?" అని అడిగాడు.

సుభద్రుడు మంచి ఉత్సాహవంతుడు మరియు శ్రమశీలి. అందుచేత అతడు వినమ్రపూర్వకంగా తండ్రితో ఇలా అన్నాడు. "నాన్నగారు! నేను ఇదేవిధంగా చేతులు ముడుచుకొని ఇంటిలోనే కూర్చొని ఉండిపోతే మీరు నన్నేమి అనకపోయినా, లోకులు నన్ను పనికిమాలిన వానిగా భావిస్తారు. సంపాదించకుండా తినే అలవాటుతో నేను సోమరిగా, మందబుద్ధిగా మారటమేగాక, నాలో ఉన్న శారీరికబలం, మనోబలం, బుద్ధిబలం నిరుపయోగమవుతాయి. దాంతో సద్భావనలన్నీ శరీరం నుండి దూరమవుతాయి. మీ నుండి దూరంగా ఉన్నప్పటికీ, మీ ఉనికి నా హృదయంలో నిరంతరం నిలచే ఉంటుంది. అన్ని దృష్టికోణాలలో పురుషార్థమే శ్రేష్ఠమైనది. అందుచేత తమరు దయచేసి నన్ను సముద్రయానం చేసి వ్యాపారం చేయుటకు అనుమతించండి.

తన కుమారుని సాహసం, కర్తవ్యదీక్ష గమనించిన సేఠ్ ఆనందించి ఇలా అన్నాడు – "కుమారా! నీవు చెప్పిన మాటలకు నేను సంతుష్టి చెందాను. అయితే తండ్రి హృదయం తన కుమారుడిని దూరంగా పంపుటకు ఎన్నడూ కోరుకోదు. కానీ నేను నీ యొక్క వికాసాన్ని, ఇష్టాన్ని ఉత్సాహాన్ని ఆపను. తండ్రికి కీర్తిని, సంపదను వృద్ధి చేయటం శ్రేష్ఠ పుత్రుని కర్తవ్యం. నీవు ఇటువంటి సద్భావనతో వెళుతున్నావు. అందుచేత ఆనందంగా సంతోషంతో వెళ్ళు. నా సంపూర్ణ ఆశీర్వాదాలు ఎప్పుడూ నీ వెంటే ఉంటాయి.

మాణిక్ శాహ్ తన కుమారుని కొరకు ఒక ఓడను తయారు చేయించాడు. సముద్రయాత్రకు అవసరమైన అన్ని వస్తువులను ఉపకరణాలను ఆయన ఆ ఓడలో ఏర్పాటు చేయించాడు. ఆయన తన కుమారునకు సముద్రం మీద ప్రయాణించే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను, అన్ని వస్తువుల ఉపయోగాలను గురించి చాలా వివరంగా తెలియపర్చాడు. ఒకవేళ సముద్రంలో ఏవైన తుఫానులు వస్తే, అప్పుడు ఓడని ఏవిధంగా స్వాధీనంలో ఉంచుకోవాలనే విషయాలను కూడా విడమర్చి చెప్పాడు. అవసరమైన పరివారంతో సాగనంపాడు.

ఓడ సముద్రపు మధ్యలో ప్రయాణించు చూడగా, అకస్మాత్తుగా తుఫాను ఏర్పడింది. నావికులు ఎంతగా ప్రయత్నించినా, ఆ తుఫాను ధాటికి ఓడ మునిగిపోయే స్థితి ఏర్పడింది. నిరాశ చెందిన నావికులు ఇక ఓడ తమ అదుపు నుండి చేజారిపోయి సముద్రంలో మునిగిపోతుందని చెప్పారు. మరికొద్ది సేపట్లో ఓడ మునిగిపోతుంది కాబట్టి అందరూ తమ తమ ప్రాణాలను రక్షించుకొనే ఏర్పాట్లు చేసుకోవలసిందిగా నావికులు సలహానిచ్చారు.

సుభద్రుడు వివేకంతో ఆలోచించి ఇటువంటి ప్రమాద స్థితిలో ఏమాత్రం గాబరాపడకుండా, అందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను తీసుకోసాగాడు. ముందుగా కాలకృత్యాలు తీర్చుకొని పొట్టను ఖాళీ చేసుకున్నాడు. తదుపరి అధిక సమయం వరకు శక్తినందించు తేలికపాటి ఆహార పదార్థాలను తిన్నాడు. తరువాత శరీరాన్నంతటికి ఆయిల్ (నూనె) మాలిష్ చేసుకొన్నాడు. దాంతో సముద్రపు ఉప్పునీటి ప్రభావం శరీరం మీద పడదు. పిదప శరీరానికి అతుక్కుపోయే తోలుతో తయారైన వస్త్రాలను తొడుక్కున్నాడు. సముద్రంలోని జలచరాల నుండి రక్షణ పొందుటలో ఇవి ఎంతగానో ఉపయోగపడగలవు.

ఈవిధమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొని ఒక చెక్క ఆసనాన్ని తీసుకొని సముద్రంలోకి దూకాడు. ఆ చెక్క ఆసన సహాయంతో ఒడ్డుకు చేరగలననే ఉద్దేశ్యంతో ఈదసాగాడు. ప్రస్తుత ఆపద సమయంలో ఓడతో పోల్చుకుంటే, జీవితం

**భగవంతుడు నిరాకారుడు - తాను చేయదలచిన ముఖ్యమైన పనులను ఋషుల ద్వారానే చేయిస్తాడు**

ఎంతో మూల్యమైనదని సుభద్రుడు వివేకంతో ఆలోచించుకొని, ఇదేవిధమైన జాగ్రత్తలో ఉంటే ఏదో ఒక ఉపాయం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని అనుకోసాగాడు. భీరువులాగా మారి ఈ ప్రమాదాన్ని ఎదుర్కోలేని పిరికితనంతో మరణించే కంటే, ధైర్యంతో పోరాడి చనిపోవటం ఎంతో మేలని దృఢంగా విశ్వసించాడు. అయితే ఎంతో విశాలమైన ఈ సముద్రాన్ని కేవలం తన భుజబలంతో ఈది ఒడ్డుకు చేరటమనేది కష్టమే అయినప్పటికి సాహసివలె ప్రాణం వదిలేంత వరకు చేతులు–కాళ్ళు కదుపుతూ (బహదూర్‌లా) మృత్యువునెదిరించి మరణించుట ఎంతో ఉత్తమమని నమ్మి సాహసంతో ఈదసాగాడు.

సుభద్రుడు చెక్కపలక సహాయంతో చేతులు–కాళ్ళను ఆడిస్తూ సముద్రంలో ప్రయాణిస్తూ ప్రవాహపు వేగంలో కొట్టుకుపోసాగాడు. ఆ సమయంలో సముద్రపు అధిదేవత, అతని పురుషార్థాన్ని పరీక్ష నిశ్చయించింది. మృత్యువు ఈ యువకుని ఎదురుగా నోరు తెరచుకొని నిలబడి ఉంది. అయినా కూడా సముద్రాన్ని తన భుజబలంతో దాటే వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు. అప్పుడా దేవత అతనితో ఇలా అంది "యువకుడా! వ్యర్థమైన శ్రమ చేయువానిని మూర్ఖుడని అంటారు. సముద్రాన్ని ఈదుకుంటూ దాటాలనే ప్రయత్నం సంభవం కాని పని. అందులో ఈ తుఫాను సమయంలో అది మృత్యువుతో ఆడుకోవడం వంటిది. అందువల్ల మృత్యువు నిన్ను కబలించుట నిశ్చయం. ఇప్పుడు నీవు ఈ పనికిరాని శ్రమ ఎందుకు చేస్తున్నావు? అందుకని ఈ ఆఖరి సమయంలో భగవంతుని స్మరణలో ఉండుట మంచిది గదా!" అన్నది.

అయితే సుభద్రుడు నిరాశపరచెడి సలహాని విని కూడా భయపడలేదు. అతడు ఇటువంటి ప్రమాద పరిస్థితిలో కూడా చిరునవ్వుతో, దేవతతో ఇలా అన్నాడు. "శ్రీకృష్ణ భగవానుడు గీతలో ఏమన్నాడో మీకు తెలియదా! ఆయన "మా మనుస్మర యుధ్యచ" అనగా నా స్మరణ చేస్తూ యుద్ధం చెయ్యి! సెలవిచ్చాడు. అందుచేత నాకు ఈ సలహా ఇవ్వటానికి మీరెవరు?" ఈ ప్రశ్నకు ఆ దేవత జవాబిస్తూ "నేను ఈ సముద్ర అధిదేవతను!" అన్నది.

సుభద్రుడు అన్నాడు – "తమరు దేవతగా ఉండి కూడా మా మానవుల కన్నా కూడా నిమ్నస్థితిలో ఉన్నారు. పురుషార్థం కొరకు ప్రేరణనిచ్చుటకు బదులు, నన్ను పురుషార్థహీనునిగా చేసి మునిగి చనిపొమ్మని ఉపదేశమిస్తున్నారు. నన్ను పురుషార్థిని గానే ఉండనివ్వండి! మనసులో భగవంతుడిని స్మరిస్తూ శరీరంతో దృఢంగా చివరివరకు శ్రమ చేయడమే నా సిద్ధాంతం!

సముద్రపు అధిదేవత సుభద్రుని జవాబుతో ప్రభావితం చెందింది. ఆ దేవత ఆలోచించసాగింది. ఇటువంటి ప్రమాద పరిస్థితిలో కూడా ఇతడు నా నుండి సహాయ మర్థించుట లేదు. ఇతడు తన పురుషార్థంలో స్థిరంగా నిర్భయుడై ఉన్నాడు. అయినా కూడా ఇంకా కొంత పరీక్షించాలనుకొంది. ఇలాఅంది – "ఓ యువకుడా! నీకిది కూడా తెలియదా? ఎక్కడ అనుకూల పరిణామాలుండవో అక్కడ శ్రమ, పురుషార్థం వ్యర్థమైపోతాయి."

సుభద్రుడు ఇలా అన్నాడు – "ఓ దేవా! పురుషార్థం ఎన్నటికి వ్యర్థమవదు. ఇక నా పురుషార్థ విషయానికొస్తే, దాని మొదటి ఫలితం ఏమంటే దీనిద్వారా నా బుద్ధి, శక్తి సదుపయోగ మవుతుంది. ఇక రెండవ ఫలితం తమరి దర్శనభాగ్యం లభించింది. ఒకవేళ నేను ఓడ మునిగినప్పుడే దాంతోపాటే మునిగి ఉంటే నేను కూడా మునిగి చనిపోయేవాడినే. అప్పుడు నేను నా బౌద్ధిక, శారీరిక శక్తులను ఉపయోగించుకోలేకపోయి ఉండేవాడినే. అంతేగాక నాకు మీ దర్శనం కూడా అయ్యేది కాదు. అందువల్ల నా పురుషార్థం వ్యర్థమవలేదు. సుభద్రుని జవాబు విన్న దేవత ఎంతో ఆనందించి ఇలా అంది – "మరైతే నీవు రక్షించమని నన్ను ప్రార్థించలేదు ఎందుకని? సుభద్రుడు దానికిలా అన్నాడు "నాకు తెలుసు. దేవత ఎన్నడూ తనను ప్రార్థించమని కోరదు. వారు ఎల్లప్పుడు తమ కర్తవ్యపాలనలోనే అభిలాష ఉండే వ్యక్తికి స్వయంగానే సహాయమందిస్తారు. వారి మీద ప్రసన్నం చూపుతారు. జీవితంలో తన కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వహించుతూ ఉండుటయే శ్రేష్ఠమైన ప్రార్థన! ఒకవేళ నా ద్వారా ప్రార్థన జరిగి ఉంటే, అప్పుడు మీరు రక్షించి ఉంటే, తమరి గౌరవం తగ్గి ఉండేది. నా ప్రార్థన లేకుండానే తమరు ఉపకారం చేస్తే, దాంతో తమరి ఉపకారపు మూల్యం పెరుగుతుంది. (తమరి విలువ పెరుగుతుంది)

సుభద్రుని ఈ జవాబుతో సముద్ర అధిదేవత సంతసించి సుభద్రుణ్ణి ఒడ్డుకు చేర్చింది. చివరకు అతనికి వీడ్కోలు చెపుతూ – "మానవీయ పురుషార్థపు చరమబిందువు మీద, దేవుని కృప స్వయంగానే అవతరింపచేయుటకు వివశుణ్ణి చేస్తుంది. నిశ్చయంగానే నీవంటి ధీరుడు, గంభీరుడు, పురుషార్థి వంటి మనిషి మాత్రమే దేవుని కృపను తన వైపుకు ఆకర్షింప చేసుకొనే అర్హతను పొందుతారు. అదే ఇప్పుడు జరిగింది. ఆ తరువాత మంచి వ్యాపారం చేసిన సుభద్రుడు చాలా ధనాన్ని సంపాదించి తన తండ్రి వద్దకు తిరిగి చేరాడు.

*– అఖండజ్యోతి, సెప్టెంబర్ 2000*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**ఆకలితో నిద్రలేచిన నిస్వార్థపరుడు ఆకలితో నిద్రించడు**

వ్యక్తి నిర్మాణం

# పట్టుదల ఉంటే కడగండ్లయినా కమనీయమే

ఏదైనా సాధించి తీరాలని మనం అనుకున్నామంటే దానిని నెరవేర్చాలని పట్టుబడతాం. అది సహజమే. ఆ ప్రయత్నాలలో అనుకోని కష్టాలు వచ్చాయనుకోండి. అప్పుడు మనలో చాలా మంది వెనక్కు తగ్గవచ్చు. కానీ దృఢసంకల్పం కలిగిన కొందరు వ్యక్తులు తాము అనుకున్నది సాధించాలని తమని తాము ఆ లక్ష్యానికి సమర్పించుకుంటారు. ప్రాణాల మీదకు వస్తున్నా వెనుదిరిగి చూడరు. కష్టాలెన్ని వచ్చినా, కన్నీటి మహాసముద్రాలను ఎన్నింటిని దాటాల్సి వచ్చినా, కడగండ్లు ఎన్ని ఎదుర్కోవాల్సి వచ్చినా సరే... లక్ష్యం నెరవేరడమే వీరికి కావలసింది. అలాంటి వారే విజేతలవుతారు. కోట్లాదిమందికి ఆదర్శమవుతారు.

తన తండ్రి స్వప్నాన్ని నిజం చేయడానికి ఒక వ్యక్తి అతని పరివారం ఏ స్థాయి వరకూ కష్టపడగలరో నిరూపించి చూపెట్టేందుకు సంపూర్ణ సమర్పణతో కష్టనష్టాలు లెక్క చేయకుండా ఎలా ముందుకు వెళ్ళాలో ప్రబోధించేందుకు ఒక వంతెనని గూర్చిన కథ ఉన్నది. నేను చెప్పేది అమెరికాలోని న్యూయార్క్ నగరంలోని బ్రూక్లిన్ బ్రిడ్జిని గురించిన వాస్తవ గాథ.

దీనిని రోబ్‌లింగ్ పరివారం నిర్మించింది. జాన్ రోబ్‌లింగ్ జర్మనీలో పుట్టి పెరిగిన సీదా సాదా మనిషి. అతని తండ్రికి ఒక చిన్న పొగాకు దుకాణం ఉండేది. అయినా జాన్ రోబ్‌లింగ్‌ని ఇంజనీర్‌ని చేయాలని కోరుకున్నాడు. జాన్‌కి ఇంజినీరింగ్‌లో కొన్ని కొన్ని సబ్జెక్టులు మాత్రమే నచ్చేవి. వ్రేలాడే బ్రిడ్జీలు అతనిని ఆకర్షించాయి. వాళ్ల ఇంటి ప్రక్కన అలాంటిదే ఒకటి నిర్మించాలని ఆరాటపడిపోయేవాడు.

జర్మనీలో పరిస్థితులు అనుకూలించక జాన్ అమెరికాకి వలస వచ్చేశాడు. ఇంజినీరింగ్ చదువు మాత్రం పూర్తి కాలేదు. అమెరికాలో మొదట వ్యవసాయ వృత్తిని చేపట్టాడు. అది లాభసాటిగా ఉండకపోయేసరికి కాంట్రాక్టు పనులు చేయడం మొదలుపెట్టాడు. తను ఏదైనా గొప్ప ఇంజినీరింగ్ కాంట్రాక్టు చేయాలని ఆశపడ్డాడు. కొన్ని వ్రేలాడే వంతెనలను నిర్మించి తన తృష్ణ తీర్చుకున్నాడు. వైర్ రోప్‌తో వ్రేలాడే వంతెనలను నిర్మించే సత్తాగలవాడని జాన్ రోబ్‌లింగ్ గుర్తింపు పొందాడు. మెల్లి మెల్లిగా డబ్బు, హోదా, పేరు వస్తున్నాయి. అప్పుడు తన దృష్టి న్యూయార్క్ నగరానికి అర కిలోమీటర్ దూరంలో ఉన్న లాంగ్ దీవిపైన పడింది. న్యూయార్క్ నగరానికి లాంగ్ దీవికి మధ్యన వంతెనను నిర్మించాలని ఆశపడ్డాడు. తన తలపుని నలుగురితో చెబితే, వాళ్ళంతా నవ్వారు. వంతెనలను నిర్మించే ఇంజినీర్‌లని కలిస్తే అసంభవమైన పనులకు పూనుకోవద్దంటూ ఉచిత సలహాలిచ్చారు. ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి వంతెనలు లేవు. కాబట్టి మనం చేయలేమంటూ చేతులెత్తేశారు.

అది 1869 వ సంవత్సరం. న్యూయార్కులోని బ్రూక్లిన్ ప్రాంతాన్ని, లాంగ్‌దీవిలోని మాన్‌హట్టన్ ప్రాంతాన్ని కలపడానికి ప్రభుత్వం ముందుకు రాకపోయేసరికి నేనున్నా నంటూ జాన్ ముందుకు దూకాడు. తనకు తెలిసిన విద్యతో వైర్ రోప్ వ్రేలాడే వంతెనను నిర్మించాలని కొంతమంది పనివాళ్ళని కుదుర్చు కున్నాడు. తన కుమారుడు వాషింగ్టన్ రూబ్లింగ్ అప్పుడు ఆర్మీలో కల్నల్‌గా పనిచేస్తున్నాడు. తను వంతెన గురించి చెబితే వాషింగ్టన్ వద్దన్నాడు. 1596 అడుగుల తాళ్ళతో వ్రేలాడే వంతెనను నిర్మించాలంటే చాలా ఖర్చవుతుంది. అందునా అది ఈస్ట్ రివర్ లాంటి భయంకరమైన నది మీద చేయాలంటే అసంభవం అని వారించాడు. జాన్ వినలేదు. తన కల నెరవేరాలని పట్టుబట్టాడు. తను ఈ పని పూర్తి చేయాలని సంకల్పించానని కొడుకుతో చెప్పాడు.

ఇలా ఉండగా ఆ వంతెన సర్వే పనులలో భాగంగా జాన్ రోబ్‌లింగ్ నది వరకూ వెళ్ళవలసి వచ్చింది. అక్కడ అతనికి అనుకోకుండా ప్రమాదం జరిగింది. అతని కాలి మీదకు ఒక పడవ దూసుకువచ్చింది. కాలు నుజ్జునుజ్జయిపోవడంతో కాలు తీసేయవలసి వచ్చింది. ఇది వాషింగ్టన్ రోబ్‌లింగ్‌కి తెలిసి హుటా హుటిన తండ్రి దగ్గరకు వచ్చేశాడు. జాన్ నడవలేకపోతున్నాడు కాబట్టి, ఆ పనులన్నీ తనే చేయాలని పూనుకున్నాడు. ఇంజినీరింగ్ డిజైన్‌లన్నీ తెప్పించుకుని అర్థం చేసుకుని వాటిని తండ్రితో చర్చించేవాడు వాషింగ్టన్ రోబ్‌లింగ్.

జాన్‌కి చికిత్స చేసిన వైద్యులు టెటానస్ సోకిందని తెలుసు కోలేకపోయారు. వారు గుర్తించే సరికి ఆ వ్యాధి ఎంతో ముదిరి పోయి చివరికి జాన్ ప్రాణాన్నే బలి తీసుకుంది. ప్రమాదం జరిగిన 24 రోజులకు జాన్ చనిపోయాడు. చనిపోయిన తన తండ్రి కల నెరవేర్చాలని వాషింగ్టన్ పూనుకున్నాడు. తను ఇక పూర్తిస్థాయిలో ఈ పనికి అంకితమైపోయాడు. కొన్ని నెలలు గడిచాయి. వాషింగ్టన్ బ్రిడ్జి డిజైన్‌ని పూర్తిగా అర్థం చేసుకున్నాడు. ఇప్పుడు ఆ వంతెనకు క్రింద పిల్లర్లు వేయాలి. నది లోపలికి పిల్లర్లు ఎలా వేయవచ్చో

**మానవుల స్వభావం సన్మార్గంలో పడితే - భూమిపై స్వర్గం అవతరిస్తుంది**

పరిశీలించడానికి వాషింగ్టన్ నది అట్టడుగు భాగానికి వెళ్ళాడు. ఆ విషయం గురించి ప్రక్కన ఉన్న వారితో చర్చిద్దామనుకుంటే – నోరు కదలడం లేదు. ఏదైనా సైగ చేద్దామంటే – చేయి పనిచేయడం లేదు. మొత్తం దేహానికి పక్షవాతం వచ్చేసింది. నది అట్టడుగు భాగంలో కొంతమందికి ఇలా జరుగుతుందని వైద్యులు తరువాత చెప్పారు.

32 ఏళ్ళ వాషింగ్టన్ రోబ్‌లింగ్ ఇప్పుడు మంచానికి అతుక్కు పోయాడు. తన శరీరంలో ఏ అవయవమూ పనిచేయడం లేదు. తాను మాట్లాడలేడు, నడవలేడు, కానీ చూడగలడు, ఆలోచించ గలడు. తన తండ్రి కన్న కల నెరవేర్చ లేకపోతున్నందుకు బాధ పడ్డాడు. తన శక్తివంచన లేకుండా కృషి చేద్దామనుకున్నాడు కానీ, తనకిప్పుడు శక్తి లేదు. ఎలా కృషి చేయగలడు? ఇది అతనిని చాలా వేదనకు గురిచేసింది. తను ఇప్పుడు ఏమీ చేయలేకపోతే తను విఫలమవడమే కాకుండా తన తండ్రి ఆశయానికి శాశ్వతంగా సమాధి కట్టిన వాడవుతాడు.

శరీరం మొత్తం పరికించి చూసుకుంటే తన కుడి చేయి చూపుడు వేలు ఒక్కదానినే కదల్చగలుగుతున్నాడు. ఆ వ్రేలితో తన భార్య మోచేతి తాకి ఏదో చెప్పదలచుకున్నాడు. మొదట ఆమెకు అర్థం కాకపోయినా క్రమేణా వాషింగ్టన్ ఏమి చెబుతున్నాడో ఆమెకి సులువుగా అర్థమైపోయింది. ఆమెని ఇంజినీరింగ్ కోర్సు చేయమని ఆ వ్రేలి సందేశం యొక్క ఉద్దేశం. ఆమె ఆ కోర్సు చేస్తే, తను చెప్పే విషయాలను మిగతా ఇంజినీర్లకి ఆమె సులువుగా చెప్పగలుగుతుంది. అందుకని ఆమె తన భర్త కోరిక మేరకు ఇంజినీరింగ్ కోర్సు చేసింది. ఆ కోర్సు పూర్తయిన తరువాత, వాషింగ్టన్ మళ్ళీ వ్రేలి సందేశం ద్వారా ఆ వంతెన కోసం పనిచేసే వాళ్ళని రమ్మని కబురుపెట్టాడు. వారందరూ వచ్చిన తరువాత, తన తండ్రి కల ఎలాగైనా నెరవేర్చాలని, దానికి అందరూ కలిసి పనిచేయాలని భార్య ద్వారా చెప్పించాడు. అందరూ సరేనన్నారు. మళ్ళీ పని మొదలైంది.

తన భర్త అక్కడి పనివారికి ఏమి చెప్పాలనుకుంటున్నాడో అతని భార్య (ఎమిలి రోబ్‌లింగ్) కాగితం మీద వ్రాసేది. భర్త ప్రోద్బలం వల్ల ఎమిలి హయ్యర్ మేథమేటిక్స్, మెటీరియల్ స్ట్రెంగ్త్, కేటనరీ కర్వ్ యొక్క సిద్ధాంతాలు, బ్రిడ్జి స్పెసిఫికేషన్స్, కేబుల్ కన్‌స్ట్రక్షన్‌లోని లోతుపాతులని తెలుసుకుంది. ఆ నైపుణ్యంతో భర్త ఏమి చేయదలచుకున్నాడో మిగతా పనివారికి సులువుగా అర్థమయ్యేలా చెప్పేది. భర్త వాషింగ్టన్ ఆ వంతెన దగ్గరకు వెళ్ళాలంటే – అది సాధ్యమయ్యే పని కాదు. కానీ తను మాత్రం ప్రతీరోజూ వెళ్ళి వంతెన ఎంతవరకు పూర్తయిందనే సంగతి మాత్రం వాషింగ్టన్‌కి చెప్పేది. వాళ్ళిద్దరూ తరువాత ఏమి చేయాలో చర్చించుకునే వారు. భర్త చూపుడువ్రేలి సహాయంతో తన మనసులోని భావాలను వ్యక్తం చేస్తుంటే భార్య వాటిని అర్థం చేసుకుని, ఆ సందేశాలను ఇంజినీర్లకు, పనివాళ్ళకు వివరించి చెప్పేది. కాలక్రమంలో ఎన్నో సమస్యలు తలెత్తాయి. వీరి చర్చల్లో వాటన్నింటికీ సమాధానాలు దొరికేవి. అవరోధాలు ఎన్ని ఎదురైనా సరే వంతెన కట్టడం మాత్రం ఆగలేదు. నిరంతరం కొనసాగుతూనే ఉంది. 1883 వ సం॥లో ఆ నిర్మాణం పూర్తయింది. 13 సంవత్సరాల సుదీర్ఘకాలం తరువాత, ఎన్నో లక్షల వేల సందేశాల అనంతరం ఊహించని ఒక అద్భుతం ఆవిష్కృతమైంది. అసంభవం అని అనుకున్న అర కిలోమీటర్ వంతెన నిర్మాణం సుసాధ్యం అయింది.

ఆ వంతెన ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. స్వయానా నాటి అమెరికా అధ్యక్షులు బ్రూక్లిన్ వంతెనని ప్రారంభించారు. ఆ వేడుకలు రోజు మొత్తం జరిగాయి. అయినా వాటికి వాషింగ్టన్ రోబ్‌లింగ్ హాజరు కాలేకపోయాడు. దేశాధ్యక్షుడు స్వయంగా వాషింగ్టన్ ఇంటికి వెళ్ళి ధన్యవాదాలు తెలిపారు. నేడు న్యూయార్క్ నగరానికి బ్రూక్లిన్ వంతెన ఒక ల్యాండ్‌మార్క్ అయింది. ఆ నగరానికే కాదు, మొత్తం అమెరికాకే ఆ వంతెన శోభని తెచ్చింది. ఆనాటి నుండి ఈనాటికి ఆ వంతెనమీద నుంచి కొన్ని కోట్ల వాహనాలు వెళ్ళి ఉంటాయి. వెళ్తూనే ఉన్నాయి. వాళ్ళంతా రోబ్‌లింగ్ పరివారానికి రుణపడి ఉంటారు. ఈ పరివారంలో రెండు తరాల వారు ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. వీరిని 'పిచ్చి పట్టి ఊహల్లో విహరిస్తున్నారు' అని ఎందరో నిరుత్సాహపరిచారు. అయినా సరే దృఢ సంకల్పం కలిగి ఉంటే కష్టాలన్నీ అవలీలగా గట్టెక్కవచ్చు అని వీరు నిరూపించారు.

మనం కూడా బ్రూక్లిన్ వంతెనకథ నుండి కొంత నేర్చుకుందాం. మనం అన్నింటికంటే ముందు మనల్ని, మన స్వశక్తిని నమ్ముకుందాం. మన లక్ష్యాన్ని నిర్ధారించుకున్న తరువాత, దానికి పూర్తిగా మనల్ని మనం సమర్పించుకుందాం. ఎప్పుడైనా మనకి కష్టాలు వస్తే వాషింగ్టన్ రోబ్‌లింగ్‌ని గుర్తుకు తెచ్చుకుందాం. తను కేవలం తన చేతివ్రేలితో 13 సంవత్సరాలు తన భార్య మోచేతిని తడిమి బ్రూక్లిన్ బ్రిడ్జిని నిర్మించిన సంగతి గుర్తుకు తెచ్చుకుందాం. ఆర్మీలో ఒక కల్నల్ సంపదలన్నీ వదిలేసి తన తండ్రి స్వప్నం నెరవేర్చడానికి తన ప్రాణాన్నే పణంగా పెట్టినప్పుడు మనం మనమనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చలేమా? అని మనల్ని మనం ఉత్తేజపరుచుకుందాం.

*– మీరు "శ్రీ"లు పుస్తకం నుండి*
*శ్రీ అద్దంకి శ్రీధర్‌బాబు, ఐ.ఎ.ఎస్. సౌజన్యంతో*

**భౌతిక ప్రగతికి శ్రమ-శిక్షణలు ప్రధానం**


పూజ్య గురుదేవుల అమృతవాణి

# మానవ శరీరము యొక్క అసలైన సంపదలు - 1

*మానవీయ వ్యక్తిత్వము, సామాజిక నిర్మాణము... అనే ఈ రెండు అంశములను గురించి పరమపూజ్య గురుదేవులు స్పృశించి వ్రాయనీ, చెప్పనీ, తెలియజెయ్యని విషయముగానీ, కోణముగానీ లేవు. గాయత్రీపరిజనుల కోసము ఇవ్వబడిన ఈ అద్వితీయ ప్రబోధములో గురుదేవులు మానవీయశరీరము యొక్క ఔన్నత్యమును నిర్వచిస్తూ 'మానవ శరీరము అనంతమైన సంపదలకు అధిపతి' అని చెప్తున్నారు. మానవుడు భగవంతునిచే సృష్టించబడిన రాకుమారుడు. ఆయన ఎన్నెన్నో సంపదలు, ప్రత్యేకతలతో అతనిని అలంకరించి ఈ భూమిపైకి పంపించాడు. అపారమైన సంపదలకు అధిపతి అయినప్పటికీ అతడు ఇంత అసహాయత, అలజడికి ఎందుకు గురవుతున్నాడు? ఇంత ఘనమైన శరీరమును కలిగియుండికూడా మానవుడు అసంఖ్యాకమైన రోగములు, వ్యాధులతో బాధపడటానికి ఒకే ఒక్క కారణము 'అతడి అనియంత్రణ' మాత్రమే అని యుగఋషి తెలియజేస్తున్నారు. అనియంత్రణ కారణముగా మానవుడు తన అసలైన సంపదలను, వాటి విలువలను అర్థం చేసుకొనలేకపోతున్నాడు. రండి! గురువర్యుల అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాము!*

## మానవుడు భగవంతునిచే సృష్టించబడిన రాజకుమారుడు

మానవుడు భగవంతుని యొక్క అత్యంత శ్రేష్ఠమైన రాజకుమారుడు! అతడి జీవితములో సమస్యలకు స్థానమే ఉండకూడదు. ప్రపంచమనే ఈ ఉద్యానవనములో సుందర కాశ్మీరములో విహరించటానికి ఆయన తన బిడ్డను పంపించాడు. సమస్యలలో చిక్కుకొని, హైరానాపడి, దిగులుతో దుఃఖించటానికి పంపించలేదు. మనము మన పిల్లలకు డబ్బులిచ్చి విజ్ఞాన యాత్రలకో, విహారయాత్రలకో పంపించినట్లుగానే ఆయన తన బిడ్డలను ఆనందమయ జీవనాన్ని గడపటానికి ఈ ప్రపంచములోకి పంపించాడు. కానీ మానవుడు దుర్గంధ పూరితమైన బురదలో చిక్కుకొని అందులోనుండి బయటకు రావటానికే ఇష్టపడటము లేదు. అందుచేతనే అంతులేనన్ని సమస్యలు అతనిని చుట్టుముడుతున్నాయి.



దీనికి కారణమేమిటి? ప్రతి మనిషి అనేకానేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాడు. శరీరము జీర్ణమై శిథిలమైపోతున్నది. అందులో ఎన్నోరకాల రోగములు వచ్చిచేరుతున్నాయి. 'జబ్బు' అంటూ లేని మనిషిని ఇప్పుడు వెదకవలసి వస్తున్నది.

అఖండజ్యోతిలో ఇంతకు క్రితమే ఒక వ్యాసము ముద్రించియున్నాము. అమెరికాకు చెందిన నర్తకియైన ఒక మహిళ చలనచిత్ర రంగములో నర్తకిగా స్థిరపడి కొన్ని కోట్లరూపాయలు ఆర్జించినది. ఆమె ఎంత సౌందర్యవతి అంటే ఆమె చిత్రాన్ని చూడటానికి అమెరికాలోని ప్రతి మనిషి కొన్నివేల డాలర్లు ఖర్చుచెయ్యటానికి సిద్ధపడేవాడు. ఇంత డబ్బు, కీర్తి సంపాదించటమే కాదు, ఇంతమందిని తన పాదాక్రాంతులను గావించు కొనగలిగిన ఈ వనిత 'ఈ జీవితమును ఎందుకు గడపాలి? ఎన్నాళ్ళు గడపాలి? ఇంకా బ్రతకడము నావల్ల కాదు' అని నిర్ణయించుకొని నిద్రమాత్రలు మ్రింగి జీవితమును అంత మొందించుకున్నది. దుఃఖము, అశాంతి, వేదన నిండిన ఈ ప్రపంచమునుండి తప్పుకున్నది. వాస్తవానికి ఈ ప్రపంచము ఆమె ఊహించుకున్నంత భయంకరమైనదా? కానే కాదు. నిజముగా అంత వ్యర్థమైనదే అయితే ఏ జీవీకూడా ఇక్కడ జీవించటానికి సుముఖముగా ఉండలేదు. మనం దీన్ని గురించి లోతుగా ఆలోచించాలి. సమస్య తీవ్రమైనది కాబట్టి తేలికగా పరిష్కారమును కనుగొనలేము. ఒకవేళ కనుగొన్నా అలాంటి పరిష్కారము మన ఆవశ్యకతలను, అవసరములను నెరవేర్చలేదు. మన సమస్యలకు సమాధానమూ చెప్పలేదు.

**అన్ని అపజయాలకు మూలం అవిద్య మరియు అజ్ఞానం**

## అసలు సమస్యలన్నింటికీ కారణమేమిటి?

అనేక సమస్యల కారణముగా మనిషి ఇంత వేదనకు ఎందుకు గురవుతున్నాడు? అన్న విషయమును గురించి మనము శోధించవలసి ఉన్నది. 'ఈ జీవితములో ఇసుమంతైనా సుఖమును, శాంతిని పొందగలిగామని చెప్పగలిగిన మనిషి ఒక్కడైనా ఉన్నాడా?' అని భర్తృహరిమహాకవి మానవజాతిని ప్రశ్నించాడు. అందరూ అశాంతితో రగిలిపోయేవారే. మన జీవితములో ఎన్ని రంగాలున్నవో అవన్నీ కూడా ఒకదానిని మించి మరొకటి సమస్యలతో నిండిపోయున్నాయి. మనది అనుకున్న ఈ శరీరమునకు సుఖ-సౌకర్యములను సమకూర్చ టానికి బుద్ధి, తెలివితేటలు అన్నీ కలిపిన జీవితము మన వద్ద ఉన్నది.

## మనకు లభించిన మూడు సంపదలు

మనకున్న మొట్టమొదటి సంపద 'శ్రమ!' మొత్తము శ్రమనంతా శరీరము కోసమే ఖర్చుపెడుతున్నాము. 'సమయము' మనకున్న రెండవ సంపద! మన ఒక్కొక్క శ్వాస ముత్యముల కన్నా, రత్నములకన్నా, వజ్రములకన్నా విలువైనది. అసలు దాని విలువను లెక్కకట్టలేము. దాని విలువను మీరు ఇప్పుడు లెక్కించలేరు. చిట్టచివరి శ్వాస తీసేటప్పుడు దాని విలువ మీకు అర్థమౌతుంది. 'జీవితము మీద మమకారముతో ఇంకొక్క రోజు బ్రతికితే బాగుండును. కొన్ని వేల రూపాయలైనా ఖర్చు చేస్తాను' అని మీరు కోరుకున్నప్పుడు జీవితము మీకు రాదు, ఒక్క శ్వాసకూడా పొడిగించబడదు. కొన్ని కోట్ల రూపాయల విలువైన జీవితమును వృథాగా ఖర్చుచేసేశారు. మొత్తము శరీర సౌఖ్యములకే వెచ్చించారు. మానవునికన్నా శ్రేష్ఠమైన పదార్థము ఈ భూప్రపంచము మీద మరొకటి లేదు. అతడి బుద్ధి ఎంతో నిశితమైనది, నైపుణ్యము కలిగినది. అతడు ఈ భూమిని స్వర్గముగా మార్చగలిగాడు. 'మనిషి' అనే జీవి ఉదయించకముందు అనగా లక్షల సంవత్సరముల క్రితము చంద్రుడి ఉపరితలము మీద వలెనే ఎగుడు-దిగుళ్ళతో, రాళ్ళు రప్పలతో, నీటిప్రవాహాలతో, గుంటలతో, గోతులతో నిండి ఉండేది. కానీ మనిషి పుట్టిన తరువాత తన బుద్ధికుశలతతో దీనిని ఒక ఉద్యానవనమువలె అత్యంత సుందరముగా తీర్చి దిద్దాడు.

ఈ బుద్ధి బృహదీశ్వరాలయమును, అమరావతీగుహలను నిర్మించగలిగినది. అంతేకాదు విజ్ఞానశాస్త్రమును, ఫిజిక్స్‌ను, జ్ఞానవిజ్ఞానముల భాండాగారమును తయారుచేసింది. ఆ తెలివంతా ఏమైపోయింది? ఒక హద్దువరకు మాత్రమే పరిమితమైపోయింది. మన తెలివంతా శరీరము కోసమే వెచ్చించబడినది.

## మన తేజస్సు ఎక్కడికిపోయింది?

మన దగ్గర క్రియానైపుణ్యమున్నది. ప్రభావితము చెయ్య గలిగిన శక్తి ఉన్నది. ఓజస్సు, తేజస్సు, మనస్విత అనబడే అయస్కాంతశక్తి ఉన్నది. ఈ శక్తులన్నింటినీ పుష్కళంగా కలిగి, ఇతరులను ప్రభావితము చెయ్యగలిగిన ప్రతిభావంతులైన వ్యక్తులు, ప్రపంచములో వీరవిహారము చెయ్యగలిగిన వ్యక్తులు మనలో ఉన్నారు. వారియొక్క ఈ శక్తి అంతా ఏమైపోతున్నది? మనకున్న ఈ శక్తి యావత్తూ కేవలము శరీరము కోసమే వెచ్చించబడుతున్నది. ఇంత చేసినప్పటికీ మన ఈ శరీరము మనకు ఎలాంటి సహాయమూ చెయ్యకపోగా మనలను దుఃఖమనే అగాధములోకి నెట్టివేస్తున్నది. శరీర భాగాలన్నీ ముక్కలుచెక్కలుగా విరిగి అస్తవ్యస్తముగా పడియుండి మనలను బాధకు గురిచేస్తున్నాయి. మోకాళ్ళనొప్పులు, కడుపులో వాయువు, అజీర్ణము... ఇవన్నీ మనలను మంచం మీదకు చేరుస్తున్నాయి. ఇదీ మన శరీరము.

## మన శరీరము యొక్క ప్రాముఖ్యత

ప్రయోగశాలలో ఉంచి పరీక్షించగలిగితే మానవ శరీరము ఎంత విలువైనదో మీకు అర్థము కాగలదు. కానీ దీని విలువ తెలియని కారణముగా ఇది ఎలా తయారైనదంటే-ఇది జబ్బు పడి మిమ్మల్ని విసిగిస్తూంటుంది. మనకెలా అనిపిస్తుందంటే వ్యాధులు ఎక్కడో బయటినుండి వచ్చి మనలను బాధ పెడుతున్నాయని. కానీ అసలు వ్యాధులు ఎందుకు వస్తున్నాయో మీరే చెప్పగలరు. మనలోని వాత, పిత్త, కఫములనేవి వికారము చెందటం వలన వస్తున్నాయి. అది జరుగకుండా మిమ్మల్ని మీరు రక్షించుకోండి.

## వ్యాధులకు మూలకారణము

మానవులు పెంచి పోషించే ఆవు, కుక్క, ఎద్దు, మేక వంటి జంతువులు, అలాగే మిగిలిన ఏ ప్రాణియైనా పుట్టినది

పరమాత్మను తెలిసికొనుటే విద్య అంతిమ లక్ష్యం

మొదలు చనిపోయేవరకూ సాధారణముగా ఎటువంటి జబ్బుకు గురికాదు. వ్యాధులకు మూలకారణము 'క్రిములు' లేదా 'సూక్ష్మజీవులు' అని మనం అనుకుంటే అది సరికాదు. క్రిముల వల్ల రోగాలబారిన పడేటట్లయితే టీ.బి., కేన్సర్ రోగులకు చికిత్స నందించే వార్డ్‌బాయ్‌లకూ, వారి పనులన్నీ చేసే పని వారికి, బట్టలు ఉతికి, కాలువలు కడిగేవారికీ కూడా రావాలికదా? కానీ అలా రావటము లేదు.

మీ బాధలకు ఇతరులను నిందించాలని మీరు అనుకుంటే మిమ్మల్ని ఎవ్వరూ ఆపలేరు, కానీ అసలు విషయము ఏమిటంటే ఈ ప్రపంచములో రోగాలు రావటానికి ముఖ్యమైన, అసలైన ఏకమాత్ర కారణము 'అనియంత్రణ' మాత్రమే! అనియంత్రణ కారణముగా మన శరీరము 'డొల్ల' అయి పోతున్నది. అనియంత్రణ వల్ల మన నాలుక మన పొట్టమీదకెక్కి స్వారీ చేస్తున్నది. తత్ఫలితముగా రోగాలు ఉత్పన్నమవు తున్నాయి. కాబట్టి ఆ 'అనియంత్రణ' మీద మనము గొడ్డలితో వేటువెయ్యగలగాలి.

### అన్ని రోగములకు మూలము 'అనియంత్రణ!'

పెన్సిలిన్ ఒక ఆరునెలలపాటు తన ప్రభావమును చూపించి క్రమముగా అదృశ్యమౌతుంది. తరువాత వేరొక మందు, ఆ తరువాత మరొకటి... ఇలా ఒకదాని తరువాత మరొకటి. ఎన్నోరకాల మందులు వచ్చాయి, రాబోతున్నాయి. కానీ ప్రతి ఒక్క 'మందు' విఫలమైపోతున్నది. నిజానికి రోగములకు మూలకారణము మన ఒక్క అసంయమనము (అనియంత్రణ). అనగా అనాత్మతత్త్వము! సమస్త రోగములకు అదే మూలకారణము.

'ఆధ్యాత్మికత' అనేది మీరు అనుకునే పదార్థము కాదు. నిజం చెప్పాలంటే అసలు మీరు ఆధ్యాత్మికతకు వ్యతిరేకులు. నాస్తికులు, కమ్యూనిష్టులు భగవంతుడిని దూరంగా తరిమేశారు, ధర్మమును నాశనముచేశారు అని చాలామంది అంటూంటారు. కానీ అది తప్పు. వాస్తవానికి మనము ఒప్పించి చక్కగా సరిచెయ్యగలిగినది, ఆస్తికులుగా మార్చగలిగినదీ ముందుగా కమ్యూనిష్టులనే. ఎందుకంటే వారు నిజం లోతుల లోపలికి దిగి తరచిచూడగలిగే అలవాటు కలిగినవారు.

'ధనం' సమానంగా పంపిణీకాకపోవటం వల్ల ఈ ప్రపంచములో పేదరికం అధికమౌతున్నది అని అర్థము చేసుకొని వారు అడుగుముందుకేశారు. నెహ్రూవంటి సంపన్న వ్యక్తి కూడా ఈ వాదన సరియైనది కావచ్చునని భావించారు. కమ్యూనిష్టు వ్యక్తులు నిజాయితీపరులేనని మేమూ అంగీకరిస్తు న్నాము. ఆధ్యాత్మిక సిద్ధాంతములు మానవ జీవితానికి ఉపయోగకరమైనవి, ఆవశ్యకమైనవి అని మనము చెప్పినప్పుడు వారు అర్థము చేసుకుంటారు, తెలుసుకుంటారు. కాబట్టి ముందుగా మనం అటువంటి వ్యక్తులకు 'భగవంతుడున్నాడు, మనకు సహాయపడతాడు, ఇది సత్యము! మీరు నమ్మితీరాలి!' అని చెప్పి ఒప్పిస్తే వాళ్లు అంగీకరిస్తారు. *(సశేషము)*

*– అఖండజ్యోతి, సెప్టెంబరు 2014*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

### పునాదిని బలంగా తయారుచెయ్యి

*భవనం ఎంత ఎత్తుగా నిర్మించాలనుకొంటే దాని పునాది అంత దృఢంగా ఉండాలి. పునాది దృఢత్వం మీదనే భవనపు ఎత్తు ఆధారపడి ఉంటుంది. ధ్యేయం ఎత్తుగా ఉంచుకోవాలనుకొంటే, మన వ్యక్తిత్వాన్ని కూడా అంతే దృఢంగాను, గంభీరంగాను నిర్మించుకొనవలసి ఉంటుంది. అట్టి గృహాల మీద ఏ గాలివాన, తుఫానులు లేక భూకంపాల ప్రభావం ఉండదు. ఎందుకనగా వాటి పునాది దృఢంగా ఉన్న కారణంగా అవి ఏమాత్రం చలించవు.*

*మొత్తం పునాది పని పూర్తి అయిన తరువాతనే భవన నిర్మాణపు దిశా–స్వరూపం తయారవుతుంది. ఇదేవిధంగా జ్ఞానం చరిత్ర–వ్యక్తిత్వం బలంగా తయారైన పిదపనే లక్ష్యం పూర్తి అగుట ప్రారంభమవుతుంది. ఈ రీతిగా తయారైన భవనం మీద చిన్నా–పెద్దా దెబ్బలు తాకినా, పెద్ద కుదుపులు ఏర్పడినా దానికి ఏమాత్రం నష్టం వాటిల్లదు. కాని దాని పునాది బలహీనంగా ఉంటే ఒకే ఒక్క ఊపుకు పెగలించబడి ఒక ప్రక్కకు ఒరిగిపోగలదు. జీవితాన్ని ఎంత గొప్పగా తయారు చేయగలగాలనుకొంటే అంతే బలంగా 'మనో బలం' గల పునాదిని తయారు చేసుకోగలగాలి.*

*– అఖండజ్యోతి, ఆగస్టు 1985*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**మనిషికి గల యోగ్యత, విద్వత, ప్రతిభలే అతని గొప్పతనానికి గీటురాయిగా నిలుస్తాయి**

నా వారితో నా మాట

# ఇది కాలానుగుణ ధర్మాన్ని వికసింపచేయవలసిన సంవత్సరం



## సంవేదన, సంభాషణ మరియు సృజన - ఇవే ధర్మానికి ఆధారాలు కావాలి

ఈమధ్య మతం గురించి చాలా చర్చలు జరుగుతున్నాయి. ధర్మం, మతాల పేరిట రాజకీయ వ్యూహాలెన్నో అల్లుతూ ఉంటారు. మతం పుణ్యమా అని ఉగ్రవాదం తన క్రూరత్వంతో ప్రపంచాన్ని కాలరాస్తోంది. కాషాయం తొడిగే కొందరు వింత చేష్టలు చేసినప్పుడు ధర్మం గురించి చర్చలు జరుగుతూంటాయి. గుళ్ళు, ఇతర ధర్మస్థలాల మధ్య గొడవలు జరిగినప్పుడు ముఖ్యాంశాల్లో ధర్మ ప్రస్తావన జరుగుతూ ఉంటుంది. మతాల మధ్య పరస్పర గొడవల గురించి అతి పురాతన చరిత్ర నుండి మొదలుకొని నేటి దిన పత్రికల వరకు రకరకాలుగా చదువుతూనే ఉన్నాం. ఇంతలా చర్చిస్తున్నా కూడా సామాన్యులకి మాత్రం ధర్మం అంటే ఏమిటో పాలుపోవట్లేదు. ధర్మాన్ని ఏమని అర్థం చేసుకోవాలి? సంవేదన, సంభాషణ, సృజన అనా లేక వేదన, వివాదం, విధ్వంసమనా?

ఈ సందర్భంలో మన గాయత్రీ పరివార సభ్యులు, అఖండజ్యోతి పాఠకులు ధర్మతంత్రం గురించిన లోకశిక్షణ బాధ్యతను నెరవేర్చాలి. పరమపూజ్య గురుదేవులు మనకి బాధ్యతను అప్పగించారు. విచక్షణారాహిత్యపు స్థితిలో వివేకాన్ని నూరిపోయడం లాంటిది. ఇందుకు చర్చల కన్నా ఆలోచించడం చాలా అవసరం. వాదులాటలకన్నా సంభాషణల సంవేదన ముఖ్యం. ఇసుకలో నూనె, నీళ్ళలో నెయ్యి వెతికినా దొరకదు. ధర్మ తత్త్వాన్ని ధర్మగ్రంథాల్లో వెతకాలి. అవతార పురుషులు, దేవదూతలు మరియు అనుభవజ్ఞులైన మహా మానవుల జీవితాలలో వెతకాలి. వీరంతా నానా కష్టాలను ఓర్చుకుని ధర్మంలోని మర్మాన్ని అర్థం చేసుకుని, అందరికీ తెలియజెప్పే ప్రయత్నం చేశారు. వారి ఆధ్యాత్మిక ప్రకాశంతో మానవులను ప్రకాశింపచేశారు. నేటి ప్రపంచంలో, నేటి స్థితిలో వీటి గురించిన చర్చల అవసరం మునుపటికన్నా ఇప్పుడు ఎక్కువ. ప్రచార సాధనాల వల్ల ప్రపంచం నలుమూలల్లోని మనుషులు దగ్గరయ్యారు, కాని హృదయాలు దూరమవుతూనే ఉన్నాయి. హృదయాలు దగ్గరవ్వాలంటే సంవేదన, సంభాషణ మరియు సృజనతో నిర్వచించాలి. అన్ని ధర్మాల మధ్య చర్చలతో సమ్మతి నిష్పాక్షికంగా బహిర్గతమవ్వాలి. పైకి చూడడానికి అసంభవమైన పని అనిపిస్తుంది. ఈ వేరు వేరు ధర్మాలన్నీ ప్రపంచంలోని వివిధ స్థానాల్లో వికసించాయి. వాటి ధర్మగ్రంథాలు వేరు. వాటి ధర్మస్థలాలు వేరుగా ఉంటాయి. పూజావిధానాలు, వేషభాషలు అన్నిట్లో తేడాలుంటాయి. పుట్టినప్పటి నుండి పోయేంత వరకు పాటించే కర్మకాండలు, ఆచారాలు అన్ని వేరువేరుగా ఉంటాయి. ఈ పరిస్థితిలో వాటి మధ్య పరస్పర సంభాషణ అనేది చాలా కష్టం అనిపిస్తుంది. ప్రచార ప్రసార సాధనాలు, వసతులు పెరిగాక భౌగోళిక దూరాలు తగ్గి, మనుషులు కలుసుకుంటున్నా, మతం విషయానికొస్తే మాత్రం పెడచూపులు చూస్తారు. భావనలలో దూరం పెరుగుతుంది. ఒక్కోసారి ఈ దూరాలు బాగా పెరిగినప్పుడు లేదా కొందరు ధూర్తులు తమ లాభం కోసం ఈ దూరాలని కావాలని ఇంకా పెంచి హింస, తీవ్రవాదం, యుద్ధాల పరిస్థితి నెలకొల్పుతారు.

ఇదంతా జరగడానికి మూలకారణం మతాలన్నిటినీ పైపై దృష్టితో మాత్రమే చూడడం. పరమపూజ్య గురుదేవులు మనందరికీ ధర్మంలోని మర్మాన్ని తెలియజేశారు. అందరికీ చెప్పమన్నారు. అన్ని ధర్మాలకు సంబంధించిన విద్వాంసులు, ఆలోచనాపరులు ఒకచోట సమావేశమై చర్చించుకుంటే ఒక విషయం తేలుతుంది. అన్ని ధర్మాల సారము ఒకటే - ప్రేమ, పరిష్కారం, ప్రకాశం. ఈ తత్త్వాలన్ని మనుషులందరిలో వికసింపచేసి లోకకళ్యాణం చేయాలన్నదే ఆశయం. కంటికి కనిపించే తేడాలన్నీ దేశకాల పరిస్థితులను బట్టి ఏర్పడ్డవి మాత్రమే. ప్రపంచంలో అందరూ కలిసిపోతున్నప్పుడు ధర్మాలు కూడా పరస్పరం ఒకటవ్వాలి. మానవత్వానికి మంచి జరగడం కోసం ప్రేమ, పరిష్కారం, ప్రకాశాల ఆలోచనలు వికసింప జేయాలి. దానితో అన్ని ధర్మాల్లో వెలసిన లోకకళ్యాణ తత్త్వాలన్నీ ఒకే తాటి పైకి రావాలి.

**విద్య మనుష్యుని శ్రేష్ఠునిగా, ఉన్నతునిగా చేస్తుంది**

యుగ ఋషి, పరమపూజ్య గురుదేవులు విశ్వధర్మం పేరిట, అనగా మానవ ధర్మం పేరిట ఈ యుగంలో ఆలోచన సూత్రాలను అందించారు. మనిషికి ఆధ్యాత్మిక మానవత్వం అనే యుగదృష్టిని ప్రసాదించారు. సంపూర్ణ మానవజాతి కళ్యాణం కోసం ఆధ్యాత్మికతను సరళతరం గావించారు. మనిషిలోని ప్రేమ, ప్రకాశాలు దృఢపరిచే విధానాలు, ప్రక్రియలు, ప్రణాళికలను ఆధ్యాత్మికవాదం దృఢతరం గావిస్తుంది. వీటిలో ఏది తగ్గినా, లేకపోయినా మనిషిలో చెడు, విధ్వంసకత పుట్టు కొస్తాయి. మతోన్మాదానికి కారణం కూడా ఇదే. మనిషిలోని ఆంతరిక వికృతులే సమాజంలో ద్వేషం, హింస, హత్యలు, క్రూరత్వానికి జన్మనిస్తాయి. ఏ ధర్మాన్ని పాటించేవారైనా ప్రేమపూర్ణ, వికసించిన, ప్రకాశవంతమైన అంతఃకరణం ఉంటే ఎవ్వరికీ, ఏ కారణం వల్ల నష్టం చేకూర్చరు. అన్ని ధర్మాలకు చెందిన మహామానవులు, సాధువులు, ఫకీర్లు, సంతుల స్థాయి ఇలాగే ఉండేది.

## అన్ని ధర్మాల సంగమస్థానం - ఆధ్యాత్మిక మానవతావాదం

ఆధ్యాత్మిక మానవతావాదం అన్ని ధర్మాలకు సంగమ స్థానం. దానిలో అన్ని ధర్మాలు స్వీకరించబడతాయి. ఎవరినీ తిరస్కరించరు, అడ్డుపడరు. మనిషిలో ప్రేమ, పరిష్కారం, ప్రకాశం నింపడానికి అన్ని ధర్మాలలో పేర్కొనబడిన ఆలోచనలు, విధానాలు ఇందులో మిళితమై ఉన్నాయి. దాని కోసం మతమార్పిడి లేదా మతోన్మాదం అవసరం లేదు. నిజంగా లోకకళ్యాణం, మానవ హితం కోరుకుంటే మనిషిలో దేవత్వాన్ని ఉదయింపజేయడానికి ప్రయత్నించాలి. దీనికై అతను గుడికి వెళ్ళినా, మసీదుకెళ్ళినా, చర్చికెళ్ళినా దీని లక్ష్యంగా మనిషిని శ్రేష్ఠుడిగా మార్చి అందరిని శ్రేష్ఠులుగా చేయడమే. ఇదే మానవ కళ్యాణానికి హితం. భూమిమీద శ్రేష్ఠులు ఎంత మందుంటే అదేస్థాయిలో స్వర్గీయ వాతావరణం ఏర్పడుతుంది.

నేటి అవసరం మంచి మనుషులుగా, గొప్ప మానవులుగా తయారుకావడం, తయారుచేయడం. వేదాలు, ఉపనిషత్తులు, గీత, ఖురాను, బైబిలు, గురుగ్రంథ సాహిబ్ అన్నిట్లో పవిత్రమైన మంచి ఆలోచనలే ఉన్నాయి. అన్నీ కూడా మనం ప్రేమగా, పరిష్కృతులుగా, ప్రకాశవంతులుగా మారే సందేశాన్ని, ఆదేశాన్నే ఇస్తున్నాయి. ధర్మం పేరిట ప్రపంచంలో జరిగే ఘోరాలు అన్నిటికీ కారణం – ధర్మాన్ని పాటించకపోవడం. పాటించేవాళ్ళు ఆంతరిక వికృతులు తొలగించుకుని ఆనందంలో ఓలలాడుతున్నారు. రహీమ్, రస్‌ఖాన్ మొదలైన వారి కృష్ణభక్తి ఎంతో ప్రసిద్ధి చెందింది. దీనికై ఎటువంటి మత మార్పిడి అవసరం పడలేదు. అందరూ కలిసి గురుగ్రంథ సాహిబ్ సూక్తులను పాడవచ్చు. ఆనందం అందరికీ ఇష్టమే, ప్రేమ అందరికీ ప్రీతికరమే, పరిష్కృతులైతే అందరూ బావుంటారు. ఇదే ఆధ్యాత్మిక మానవతావాదం యొక్క ఆదర్శం. దీని తత్త్వదర్శనాన్ని వికసింపచేయాలన్నదే నేటి పిలుపు.

ఆధ్యాత్మిక మానవతావాదం ఎలా వికసించాలి? ఎలా ప్రాచుర్యం పొందాలి? అందుకు పరమపూజ్యగురుదేవులు మానవత్వానికిచ్చిన చక్కటి ఆలోచన – "వైజ్ఞానిక ఆధ్యాత్మిక వాదం". అంటే అర్థం – ఆధ్యాత్మికతలో వైజ్ఞానిక దృష్టికోణం అలవడడం. దానితోపాటు విజ్ఞానరంగం ఆధ్యాత్మిక సంవేదనతో పరిపూర్ణమై ఉండాలి. మతాల వల్ల చాలా గొడవలు, కొట్లాటలు, యుద్ధాలు కూడా జరిగాయన్నది అందరికీ తెలుసు. కానీ విజ్ఞానం కూడా కావలసినంత విధ్వంసక సామాగ్రిని పోగు చేసింది. ఒకప్పుడు ఏదో తిట్టుకుని, చేయి చేసుకుని కొట్లాడు కునేవారు. కాని ఇప్పుడు అణాయుధాలు చేపడు తున్నారు. చిన్న దేశమైనా సరే చుట్టుప్రక్కల రాజ్యాలను పరమాణు యుద్ధాలంటూ బెదిరిస్తున్నది. అంతేనా! అమెరికా వంటి సర్వసాధనా సంపన్న దేశం కూడా ఎక్కడ తీవ్రవాదులకి అణ్వస్త్రాలు చేజిక్కుతాయో అని భయపడుతోంది. ఇదే జరిగితే, జరిగే అవకాశాలు ఉన్నాయి కూడా. అప్పుడు జరిగే విధ్వంసాన్ని ఊహించుకున్నా వెన్నులో వణుకు పుడుతుంది.

ప్రపంచం నవ్వుతూ హాయిగా ఉండాలంటే ధర్మం, విజ్ఞానం రెండూ సన్మార్గంలో పయనించి తీరాలి. వైజ్ఞానిక దృక్పథాన్ని అలవర్చుకుంటేనే ధర్మం అనవసరమైన వ్యత్యాసాలను వదుల్చు కోగలదు. ధర్మంలో ఇమిడి ఉన్న మానవ ప్రేమతో విజ్ఞానం పరిపూర్ణమైతే విధ్వంసకర సృష్టిని నిర్ణయిస్తుంది. కాలం అనే గీటురాయి మీద పరీక్షిస్తే నేటికి ఏది సరైనదో, ఏది కాదో తెలుస్తుంది. ఏదో ఒక ధర్మానికి కాదు, ప్రపంచంలోని మతాలన్నిటికీ వైజ్ఞానిక దృష్టి అవసరం. ప్రతి మతానికి చెందిన ఆలోచకులు దీన్ని అర్థం చేసుకోవాలి.

**ఆధ్యాత్మికత మనిషికి సరియైన దిశానిర్దేశాన్ని, ప్రకాశాన్ని అందిస్తుంది**

## ధర్మాన్ని నిర్ధారించే తత్త్వం మరియు సత్యం

ఏ ధర్మానికైనా రెండు రకాలైన తత్త్వసత్యాలుంటాయి. 1) శాశ్వతమైనవి, 2) కాలానుగుణమైనవి. ఉదాహరణకి ఈశ్వర ప్రేమ, మానవకళ్యాణంతో సంబంధించిన ఆలోచనలు, తత్త్వాలు శాశ్వతమైనవి. ప్రతి యుగానికి అన్ని కాలాలలోనూ వీటి అవసరం ఉంటుంది. కాని ధార్మిక కర్మకాండల విధి విధానాలు, మానవజీవితంలో ముడిపడ్డ వ్యక్తిగత, కుటుంబ పరమైన, సామాజిక విధానాలు, పద్ధతులు మాత్రం మార్పును కోరుకుంటాయి. కాలానుగుణంగా వైజ్ఞానిక దృష్టితో వీటన్నిటిని నేడు సవరించాలి. నేటి సమయానికి తగ్గట్టుగా వైజ్ఞానిక దృష్టితో తగిన సవరణలు చేయాలి. ప్రపంచపు నలుమూలల్లో పరంపరలు, మూఢనమ్మకాలతో ధర్మం యొక్క శాశ్వత తత్త్వాలు కమ్ముకుని ఉన్నాయి. ఈ అవివేకం, తర్కరాహిత్యం మతాలను విషపూరితం చేశాయి. ధర్మం పేరిట జరిగే హింస, విధ్వంసం దీనివల్లే. ధర్మం పేరిట హింసిస్తూ, హత్యలు చేసే మూర్ఖులకు అర్థం కాని విషయం ఏంటంటే చంపేది అమాయకపు ప్రజలను కాదు, వారు నమ్మే ధర్మాన్నే. ధర్మం పేరిట జరిగే ఈ హింసా కాండలన్నీ జీవితంలోని నిర్బలమైన, విచక్షణారహితమైన దృష్టి కోణాన్నే సూచిస్తున్నాయి. అంటే అంధవిశ్వాసపు మూర్ఖత్వం. గడిచిన శతాబ్దమంతా ఈ అంధవిశ్వాసంతోటే వర్ధిల్లింది. కానీ ఈ క్రొత్త 21వ శతాబ్దంలో పరిస్థితి మారింది.

ఇది విజ్ఞానయుగం. ఇప్పుడు బలమైన, తార్కికమైన, ప్రామాణికమైన, పరిపక్వమైన దృష్టికోణం వికసించింది. మూర్ఖత్వాన్ని ఎవరూ స్వీకరించరు. ధర్మము, ధార్మికత ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి. ధర్మం వైజ్ఞానిక దృష్టికోణాన్ని అలవర్చుకుని శాశ్వత తత్త్వాలను, కాలానుగుణ తత్త్వాలను మరింత సమయానుసారంగా సవరించుకోవాలి. ఏదో ఒక ధర్మం కాదు, ప్రపంచంలోని అన్ని ధర్మాలకి ఇది వర్తిస్తుంది. ఆలోచనాపరులంతా ఈవిధంగా ఆలోచిస్తే మనిషి, మానవత్వానికి కూడా వారి ధర్మం కళ్యాణకరమైనదవుతుంది.

మార్పు అనే ఈ తథ్యాన్ని ధర్మము, ఆధ్యాత్మికమే కాదు విజ్ఞానం కూడా అర్థం చేసుకోవాలి. ఇప్పటికే రెండు ప్రపంచ యుద్ధాలను చూశాము. మూడోది చూసే ఓపిక మానవత్వానికి లేదు. విధ్వంసానికి కావలసినంత సామాగ్రి సృష్టించబడింది. ఇప్పుడు సృజనకి అవసరమయ్యే సామాగ్రి పోగుచేసుకుందాం. అలా జరగడానికి ధర్మం నేర్పించే ప్రేమ, పరిష్కారం, ప్రకాశం అనే పాఠాలను విజ్ఞానం చదవాలి. ఆధ్యాత్మిక సంవేదనతో కూడుకున్న విజ్ఞానము మరియు వైజ్ఞానిక తర్కం అనే సత్యాన్ని అవగాహన చేసుకున్న ఆధ్యాత్మికం. ఇదే 21 వ శతాబ్దపు ఘోషణ.

ఇదెలా సాధ్యం అనే ప్రశ్న రావచ్చు. భౌతికత, ఆధ్యాత్మికత ఎలా కలగగలవు అని అనిపించవచ్చు. విజ్ఞానము, ఆధ్యాత్మిక వాదం కలిసి ఎలా ప్రయాణించగలవు. జవాబు చాలా సరళమైనది. ఆత్మ, శరీరం కలిసి పయనించినట్టే. శరీరం, ఆత్మల కలయికతో జీవితం ఏర్పడినట్టే, విజ్ఞానం మరియు ఆధ్యాత్మికతల కలయికతో జీవితంలోని సమస్యలన్నీ పరిష్కరింప బడతాయి. 21వ శతాబ్దం యుగ పరివర్తనా శతాబ్దం. ఈ మహాపరివర్తన ఈవిధంగానే ఆరంభమవుతుంది. ధర్మం పేరిట కుతంత్రాలను, క్రూరపు చేష్టలను బాగానే చూశాం. వీటన్నిటికీ ఇక విరామం పెట్టవలసిందే. ఎంత కాలం శకుని తన కపట పాచికలతో యుధిష్ఠిరుడిని మోసం చేస్తూ ఉంటాడు?

యుగ సాహిత్యాన్ని విస్తరించే ఈ సంవత్సరం సమయాను కూల ధర్మబోధన జరిగి తీరాలి. గురువుగారి శిబిరాల్లో, గోష్ఠుల్లో, సంవాదనలలో, చర్చలలో ఆధ్యాత్మిక మానవతా వాదపు నేపథ్యం ముందే అల్లబడి ఉంది. దాని కోసం వైజ్ఞానిక ఆధ్యాత్మికవాదం యొక్క ఆధారం వికసింపజేయాలి. ధర్మం, ఆధ్యాత్మికవాదాల వాస్తవిక ఉద్దేశ్యం మానవకళ్యాణం అన్న విషయం ఈ శతాబ్దపు రెండవ దశకంలో స్పష్టంగా అందరికీ తెలియాలి. ఆధ్యాత్మిక మానవతావాదం ధర్మాలకు సంగమ స్థానం. ఈ పవిత్ర తీర్థంలో అందరూ కలిసి సంవేదన, సంవాదం, సృజనల యుగసంస్కృతిని వికసింపజేయవచ్చు. వేదన, వివాదాలు, విధ్వంసానికి తావులేని యుగధర్మం, విశ్వధర్మం, మానవధర్మాన్ని బోధించవచ్చు. యుగదేవత అందిస్తున్న ఈ సందేశాన్ని ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలి. ధర్మం పేరిట అధర్మాన్ని కొనసాగనివ్వం అని ప్రమాణం చేయాలి. ధర్మం గురించిన చర్చలు జరిగితే ధర్మం ప్రతిష్ఠ కూడా పెరుగుతుంది. యుగ సైనికులు ఈ దిక్కులోనే సమిష్టిగా ప్రయాణించాలి.

*– అఖండజ్యోతి, ఏప్రిల్ 2015*

*అనువాదం: ఎం.వి. ప్రసాద్*

**వివేకాన్ని మేల్కొల్పని విద్య పతితుల గావిస్తుంది**

ఆయుర్వేద వైద్యం-1

# ఇంగువ - దానిలోని రోగనివారణ శక్తి



భారతదేశంలో వందల కొలది సంవత్సరాల నుండి ఇంగువ ఉపయోగాలను మసాలా రూపంలో పొందుచున్నారు. పప్పు లేక కూరలు, సాధారణ భోజనంలో ఇంగువపలుకును వేసినంత మాత్రానే వీని రుచి కొన్ని రెట్లు ఇనుమడించుట మనకు అనుభవమే. ఇంగువ "రసం" తయారీలో మాత్రమే పనికివచ్చెడి మసాలాదినుసు కాదు, ఇది ఒక మంచి ప్రభావ శాలియైన ఔషధం. "ఫెరులా ఫొయిటిడా" అనే పేరు గల మొక్క రసమును ఎండబెట్టి ఇంగువను తయారుచేస్తారు. ఈ మొక్క 2 నుండి 4 అడుగుల ఎత్తు పెరుగుతుంది.

ఈ మొక్క విశేషంగా ఇరాన్, ఆఫ్గనిస్తాన్, తుర్క్మిస్తాన్, బలూచిస్థాన్, కాబూల్ మరియు ఖురాసాన్ పర్వతసానువు లందు పెరుగుతుంది. అచ్చటి నుండి పంజాబ్ మరియు ముంబాయి ప్రాంతాలకు వస్తుంది. మహర్షి చరకుని అనుసారము ఇంగువ – ఊపిరితిత్తులకు సంబంధించిన రోగులకు రామబాణంలాంటి ఔషధము. ఇది కఫాన్ని తొలగించి, గ్యాస్ సమస్యల నుండి ఉపశమనాన్నిస్తుంది. మూర్ఛ రోగుల చికిత్సకు ఉపకరిస్తుంది. కండ్ల జబ్బులకు విశేష లాభకారి.

సొంఠి, మిరియాలు, చిన్న రావిపండ్లు, వాము, తెల్లజీర, నల్లజీరలను శుద్ధమైన నెయ్యిలో వేయించి ఇంగువ మరియు సైంధవలవణం అన్నీ సమాన పరిమాణంలో తీసికొని నూరాలి. ఈ చూర్ణాన్ని నిత్యము 2 నుండి 4 గ్రాములను భోజనానంతరం నీటితో సేవించాలి. నియమితంగా దీనిని సేవించినచో పొట్ట లోని (గ్యాస్) వాయువు సమస్య నివారింప బడుతుంది.

❖ ఇంగువను నీటితో రంగరించి బొడ్డుకు చుట్టూ పట్టి వేసిన లేక నేతితో వేయించిన ఇంగువను తేనెతో కలిపి తిన్నా పొట్టలోని నొప్పిని తగ్గిస్తుంది.

❖ ఇంగువ చిన్న తుంపును (ముక్కను) నీటితో రంగరించి తీసికొన్నచో పొట్టనొప్పి నుండి త్వరితంగా విముక్తి లభిస్తుంది.

❖ పొట్టలో నొప్పిగానున్నచో 2 గ్రాముల ఇంగువను అర లీటరు నీటిలో తెర్లించి, నాలుగవ వంతు నీరు మిగిలే వరకు ఉంచి దీనిని చల్లార్చి గోరువెచ్చగా ఉన్నప్పుడు త్రాగాలి.

❖ ఇంగువను నీటిలో కలిపి రంగరించి, లేపనాన్ని మోకాళ్ళపై పూతగా వ్రాసిన మోకాళ్ళ నొప్పికి ఉపశమనం లభిస్తుంది.

❖ దంతాలలో నొప్పి ఉన్నచో నొప్పి ఉన్నచోట ఇంగువను పెట్టినచో నొప్పి తగ్గుతుంది.

❖ ఇంగువను నీటిలో ఉడికించి పుక్కిలించినచో దంతాల బాధ ఉపశమనమవుతుంది.

❖ జలుబు కారణంగా తలనొప్పి ఉన్నచో, నీటిలో కొంచెం ఇంగువను రంగరించి ఈ గంధాన్ని కణతలకు వ్రాయాలి. తల నొప్పికి ఉపశమనం లభిస్తుంది.

❖ ఇంగువను నీటిలో నానబెట్టి ఆ వాసనను ముక్కుతో పీల్చుచుండినా మైగ్రేన్ బాధ నుండి విముక్తిని పొంద వచ్చును.

❖ పిల్లలకు న్యూమోనియా సోకిన ఇంగువ కలిపిన నీటిని కొంచెం కొంచెం పరిమాణంలో ఇస్తూ ఉంటే చాలావరకు బాధ తగ్గుతుంది.

❖ భోజనంతోపాటు ఇంగువను తగు మోతాదులో తీసికొన్నచో స్త్రీల గర్భాశయం సంకోచింపజేయుటలో తోడ్పడుతుంది. అట్లే నెలవారి ఋతుక్రమం క్రమబద్ధీకరించబడి స్వస్థత చేకూరుతుంది.

❖ పాతబెల్లంలో కొద్దిపాటి ఇంగువను కలిపి తిన్నచో దగ్గు వెంటనే తగ్గిపోతుంది.

❖ మూర్ఛ (హిస్టీరియా) రోగులకు ఇంగువ వాసన చూపినచో వెంటనే కోలుకుంటారు.

*– తెలుగు అనువాదం : ఎ. వేణుగోపాలరెడ్డి*

**విద్య మనుష్యులలోని పశుత్వాన్ని, చెడులను దూరం చేస్తుంది**

# స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 12

## వరికుంట ముని వరప్రసాదరాజు



వరికుంటముని వరప్రసాదరాజు, బాలమునిరాజు-లక్ష్మమ్మ దంపతులకు, వారి మాతామహుల స్వగ్రామమైన కలువాయి గ్రామం, నెల్లూరు జిల్లాలో 15 డిసెంబరు 1972లో జన్మించారు. వీరి తల్లిదండ్రుల నివాసమైన కడప జిల్లాలోని ప్రొద్దుటూరు పట్టణములో ప్రాథమిక, హైస్కూల్ విద్యాభ్యాసముల పూర్తిగావించుకొని అదే పట్టణములో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమాను 1992లో పొందుట జరిగింది. 1996లో సబ్ ఇంజనీయరుగా రాష్ట్ర ఎలక్ట్రిసిటి బోర్డులో ఉద్యోగంలో ప్రవేశించారు. అటు పిమ్మట కరస్పాండెన్స్ కోర్సు ద్వారా 2006లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పట్టాను పొందుట జరిగింది. ప్రస్తుతం రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో అసిస్టెంట్ ఇంజనీయరుగా వి.వి.రెడ్డినగర్, కలమల గ్రామం, కడపజిల్లాలో పని చేస్తున్నారు.

చిన్ననాటి నుండి రాజుగారు రాష్ట్రీయ స్వయం సేవక్‌లో పనిచేయుటవలన, బాల్యము నుండి క్రమశిక్షణతోపాటు, సమయపాలన, ఆర్థిక సంయమనం అబ్బాయి. దీనితోపాటుగా భారతీయ సంస్కృతి, ధర్మముల పట్ల, భగవద్గీత పట్ల చక్కని అవగాహనను పెంచుకొని తన భావి జీవితానికి రాజ మార్గాన్ని ఏర్పాటు చేసికొన్న గుణశీలి.

బాల్యము నుండి తన తల్లి ద్వారా ఆధ్యాత్మిక చింతన పట్ల అవగాహనను పెంపొందించుకొనుట జరిగింది. తల్లిగారి తాతలిరువురు అవధూతలైనందున ఆధ్యాత్మిక చింతన ఉగ్గుపాలతో అబ్బింది. ఈ రీతిగా ఆధ్యాత్మికశక్తిని జన్మతః పుణికి పుచ్చుకొన్న పుణ్యశాలి.

గాయత్రీ పరివార్ పురాతన కార్యకర్త ప్రొద్దుటూరు పట్టణ నివాసి అయిన శ్రీ సత్యన్నారాయణరెడ్డిగారి ద్వారా గాయత్రీ పరివార్ సంస్థతో రాజుగారికి పరిచయమేర్పడింది. 2009లో రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో జరిగిన గాయత్రీ యజ్ఞము ద్వారా రాజుగారికి గాయత్రీ యజ్ఞము, గాయత్రీ మాత, పూజ్య గురుయుగ్మం పరిచయ భాగ్యం దక్కింది. ఆనాటి నుండి వీరికి గాయత్రీ ఉపాసన, సాధన, ఆరాధనల పట్ల చక్కని అవగాహన ఏర్పడి క్రమం తప్పకుండా గాయత్రీ మంత్ర జపాన్ని చేయుట అలవాటుగా మార్చుకున్నారు. గాయత్రీ యజ్ఞాలు చేయించుట, సంస్కారాలు అందించుట చేస్తున్నారు. దీనితోపాటు పూజ్యగురుదేవుల సాహిత్యాన్ని ఇంటింటికి చేర్చుతూ గురుదేవుల జ్ఞానయజ్ఞానికి తన వంతు కర్తవ్యాన్ని అనునిత్యము చేస్తున్నారు. ప్రతి నెల యుగశక్తి గాయత్రి 50 మాసపత్రికలను విక్రయించుట తన సాధనలలో ఒకదానినిగా మార్చుకున్న వివేక సంపన్నుడు.

తనకు జన్మతః లభించిన ఆధ్యాత్మిక జ్ఞానానికి పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య సాహిత్యాన్ని జోడించి, క్రమక్రమంగా మెరుగులు దిద్దుకొనుట తనకు లభించిన అదృష్టంలా రాజుగారు భావిస్తున్నారు.

ఎవరైన తనను దుర్భాషలాడిన వారిని తిరిగి నిందించుటకు బదులు మౌనం వహించుట అలవాటు చేసికొన్నారు. తిరిగి కోపం రాలేదేమిటని ప్రశ్నిస్తే, మనం స్వీకరించనిది ఏదైనా తిరిగి ఆ వ్యక్తికే చెందుతుంది / చేరుతుంది, ఇది ప్రకృతి నియమం. దూషించెడివాడు, దూషింపబడెడి వానిలోనున్న ఆత్మల రెండింటికి మూలమైనది ఒకే ఆత్మ. కావున దూషించుట, దూషింపబడుటలో తరచిచూచిన భేదం లేదు. పరనింద అనెడి ప్రశ్న ఉదయించదు అనెడిది రాజుగారిలోని ఆధ్యాతిక చింతన పరిపక్వతకు చక్కని ఉదాహరణ. అట్లే ఆత్మను వివరించమని అడుగగా వారిచ్చిన సమాధానం మరింత చక్కని విశ్లేషణాత్మ కంగా ఉంది.

శరీరం సెల్‌ఫోన్ కాగా శరీరంలో పనిచేస్తున్న ఆత్మ సెల్‌ఫోన్‌లోని సిమ్‌కార్డు వంటిది. ఆత్మ నిష్క్రమించినపుడు శరీరం ఏ రీతిగా తన ఉనికిని కోల్పోతుందో, అదే రీతిలో సిమ్‌కార్డు లేని సెల్‌ఫోన్ మూగపోయి వ్యర్థంగా మారుతుంది. ఆత్మ పునర్జన్మ ద్వారా మరో శరీరాన్ని పొంది తిరిగి పునర్జీవితాన్ని పొందినట్లు, సిమ్‌కార్డు మరో సెల్‌లో ప్రవేశించి తిరిగి పనిచేస్తుంది. ఆత్మ తన పూర్వ జన్మకర్మలను నూతన శరీరం ద్వారా అనుభవించి నట్లు సిమ్‌కార్డు తనలో నిక్షిప్తమై ఉన్న విషయాలన్నింటిని తిరిగి వినిపిస్తుంది.

**విద్య ఆత్మదాహాన్ని తీర్చుతుంది**

అట్లే సద్భావనల శక్తితో తనపై పగబట్టినవారిని తన ప్రేమశక్తితో జయించి వారిని నిర్వీర్యుల గావించుట రాజుగారి ఆధ్యాత్మిక వికసికతకు ఒక మచ్చు తునక. రాజుగారు తన కార్యాలయంలో తన క్రింద పని చేసెడి వ్యక్తిలోని క్రమశిక్షణా రాహిత్యాన్ని సంస్కరించుటకు ప్రయత్నించగా, అతడు ప్రతీకార యత్నాలను ప్రారంభించుట చూచి, "అమ్మా! గాయత్రీ! ఇతనిలోని దుష్ట చింతనను మార్చి, సత్ చింతనల ప్రవేశింప చెయ్యి. అతని దుష్ప్రవృత్తులనెదుర్కొని తట్టుకొనెడి శక్తిని ప్రసాదించు" అని అను నిత్యము ప్రార్థించాడు. ఈ ప్రక్రియ 3 నెలలు కొనసాగగా ఒకానొక రోజు అతడు చేసిన చిన్న నేరానికి ప్రతిఫలంగా అతని పదవీ స్థాయిని తగ్గించి (డీ ప్రమోట్) మరో చిన్న పదవిలో వ్యవస్థ అతనిని కూర్చుండపెట్టి మరో స్థలానికి మార్చింది డిపార్టుమెంట్.

ఇట్టి భావాలున్న వి.యం.వి.రాజుగారు మనకు స్ఫూర్తి దాయకుడే! వీరికి, వీరి కుటుంబానికి గాయత్రీమాత, పూజ్యగురుయుగ్మం ఆశీస్సులు అందజేయాలని కోరుకుంటున్నది యుగశక్తి గాయత్రి.

## పేరం సునందరావు-వెంటక లలితాంబ దంపతులు



పేరం సునందరావుగారు 1 ఆగస్టు, 1943లో గుంటూరు జిల్లా రేపల్లెలో పోతురాజు-లక్ష్మీకాంతమ్మ దంపతులకు జన్మించారు. రేపల్లెలోనే వీరి బాల్యం మరియు హైస్కూలు విద్యాభ్యాసం ముగించి, కళాశాల విద్యను, విజయవాడలో పూర్తిచేశారు. అటు తరువాత అనంతపురంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యను 1964లో పూర్తిచేశారు. అట్టి సమయంలో ఖాజీపాలెం గ్రామం, గుంటూరు జిల్లాలో మోతుబరి రైతు కుటుంబములో జన్మించిన కుమారి వెంకట ప్రసూనాంబగారు అర్ధాంగిగా వీరి జీవితంలో అడుగిడుట జరిగింది. గృహస్థాశ్రమంలో ప్రవేశించగనే ఉద్యోగం పురుష లక్షణంగా ఎంచి, ఎలక్ట్రిసిటీ బోర్డ్, ఆర్&బి, ఇరిగేషన్, శ్రీశైలం ప్రాజక్టులో, సాగర్ కుడి, ఎడమ కాలువల ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్గా, తదుపరి తెలుగు గంగ ప్రాజెక్టులో, కాకినాడ పోర్టు, మచిలీపట్నం పోర్టు మున్నగు అనేక ప్రదేశాల్లో అనేక పదవులు నిర్వహించారు.

సునందరావు దంపతులు మార్కాపురంలో ఉద్యోగరీత్యా పనిచేస్తూ ఉండగా గాయత్రీ పరివార్లోని శ్రీమతి రాజ్యలక్ష్మి ద్వారా పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారి దర్శనభాగ్యం కలిగింది. మార్కాపురంలో రామకృష్ణ మాష్టారి ప్రవచనాలకు అత్యంత ఆకర్షితులై ఈ దంపతులిరువురు మార్కాపురం, గిద్దలూరు, కంభం, బేస్తవారిపేట మున్నగు ప్రాంతాలలో నిర్వహించిన గాయత్రీ పరివార్ యజ్ఞములలో చురుకుగా పాల్గొన్నారు. వీని ద్వారా మాష్టారికి మరింత దగ్గరై వారి ఆధ్యాత్మిక గ్రంథ రచనలను, ప్రసంగాలను మరింతగా ఆస్వాదించసాగారు.

అప్పటికే మాష్టారు ఒక ఆశ్రమ స్థాపనకై స్థలాన్వేషణలో నున్నారనెడి వార్త శ్రీమతి వెంకట లలితాంబరావుగారి చెవి సోకగా స్పందించి శ్రీమతి రాజ్యలక్ష్మిగారి ద్వారా ఆశ్రమ నిర్మాణానికై తగిన స్థలాన్ని ఇవ్వగలనని తనంత తానుగా తన సంసిద్ధతను తెలియజేయుట జరిగింది. మాష్టారుగారు దీనికి వెనువెంటనే తన అంగీకారాన్ని తెలుపలేదు. దీనిని గమనించిన సునందనరావుగారు కార్యాలయము పనిమీద గుంటూరు వచ్చినప్పుడల్లా మాష్టారు గారిని కలిసి వారి అంగీకారాన్ని కోరుతూ వచ్చారు. ఇలా ఒక సంవత్సరం పాటు మాష్టారు తన అంగీకారాన్ని తెలుపలేదు. మాష్టారి నుండి సమాధానం రాకపోవుసరికి సునందనరావు దంపతులు గురువుల ప్రణాళిక పట్ల తమ సమర్పణకు పరీక్షగా దీనిని తలంచి తమ భూమిని తీసికొనమని మాష్టారుగారిపై ఒత్తిడి పెంచుతూ వచ్చారు. చిట్టచివరకు సంవత్సరం గడచిన తదుపరి మాష్టారు తమ అంగీకారాన్ని తెలిపి, కాకివాయి గ్రామంలో ఆశ్రమ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపుగా 5 ఎకరాల భూమిని ఆశ్రమ నిర్మాణానికై దానంగా ఇచ్చారు.

పై రీతిగా ఈ దంపతులిరువురూ మాష్టారిగారి ద్వారా అనేక యజ్ఞాలు నిర్వహించి గాయత్రీ ప్రచారానికి, అనేక రీతుల తమ శారీరిక, మానసిక, ధనశక్తులను దానంగా ఇచ్చి తమ తోడ్పాటునందించారు.

వీరికి వీరి కుటుంబానికి పూజ్యగురుయుగ్మం తమ ఆశీస్సులనందించవలసిందిగా కోరుచూ యుగశక్తి గాయత్రి ప్రార్థించుచున్నది.

**మనిషి ఆలోచనలు సకారాత్మకంగా, సృజనాత్మకంగా ఉన్నప్పుడే జీవితం సార్థకమవుతుంది**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## గాయత్రీ జ్ఞాన మందిరము, ఓల్డ్ బోయినపల్లి, హైదరాబాద్

గాయత్రీ జ్ఞానమందిరము, స్వర్ణధామనగర్‌లో గాయత్రీకి సంబంధించిన జ్ఞానాన్ని విస్తృత పరిధిలో అందించుటలో భాగంగా గాయత్రీ మంత్రంలోని 24 అక్షరాలకు ప్రతీకగా నిలచిన 24 శక్తిధారల గాయత్రీ పాలరాతి మూర్తులను పంచ రంగులలో 11 ఏప్రిల్ 2015 శనివారమునాడు ఆవిష్కరించుట జరిగింది. ఈ కార్యక్రమం అఖిల విశ్వగాయత్రీ పరివార్ అధినేత, దేవ సంస్కృతి విశ్వవిద్యాలయ కులపతి ఆదరణీయ డా॥ ప్రణవ్‌పండ్యాగారి దివ్య హస్తాల మీదుగా నిర్వహింప బడింది.

**కార్యక్రమం జరిగిన తీరు:** డా॥ ప్రణవ్ పండ్యాగారిని మరియు దక్షిణ భారత విభాగం శాంతికుంజ్ ప్రముఖులు ఆదరణీయ డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్‌ని తీసికొని దక్షిణ భారత గాయత్రీ పరివార్ కన్వీనర్ శ్రీ అశ్విని సుబ్బారావుగారు తోడ్కొని స్వర్ణధామనగర్ ఉ॥ 8.30 గం॥లకు విచ్చేవారు. కాలనీలో ప్రవేశించే ముందు, కాలనీ ప్రవేశద్వారం వద్ద నిర్మించిన గాయత్రీ ప్రవేశద్వారాన్ని వీక్షించి, తదుపరి కాలనీ ప్రథమ దేవరుడైన శ్రీ వేంకటేశ్వరస్వామి గుడివద్ద శ్రీ రాఘవేంద్రరావు ప్రభృతులు ఇచ్చిన పూర్ణకుంభ స్వాగతాన్ని అందుకొని, ఆలయ ప్రదక్షిణ చేసి, గాయత్రీ జ్ఞానమందిరానికి చేరుకొన్నారు. అచ్చట పూర్ణకుంభ స్వాగతం తిలకధారణ స్వీకృతి తదుపరి గాయత్రీ మందిరంలో ప్రవేశించి, పూజ్య గురుయుగ్మానికి, గాయత్రీ మాతకు హారతిచ్చి, పాదుకా చరణాల వద్ద పుష్పాంజలి ఘటించి అటుపిమ్మట "గాయత్రీ యొక్క 24 శక్తిధారలు యంత్రములు వాటి మర్మములతో కూడిన గాయత్రీమాత పంచరంగుల పాలరాయి 24 ప్రతిమలను ఆవిష్కరించిరి.

మూడవ అంకములో వేదికపైకి శ్రీ అశ్విని సుబ్బారావు మరియు డా॥ బ్రిజ్‌మోహన్ గౌడజీలు తోడ్కొనిరాగా దీప ప్రజ్వలన గావించి సభను ప్రారంభించారు.

ఆదరణీయ ప్రణవ్‌పండ్యాగారిని సత్కరించి పూల మాలాంకృతుని గావించారు. తదుపరి శ్రీ కృష్ణారెడ్డి, శ్రీ సుబ్బారావు, శ్రీ వెంకట్రావు, శ్రీ గోపాలకృష్ణ, శ్రీ రామలింగారెడ్డి మున్నగువారు సత్కరించారు.

శ్రీ అశ్విని సుబ్బారావుగారు, డా॥ ప్రణవ్‌పండ్యాగారిని సభకు పరిచయం చేస్తూ యుక్తవయస్సు నుండి పూజ్య గురు దేవుల సన్నిధిలో ఆధ్యాత్మిక విద్యలో అంచెలంచెలుగా ఎదిగిన వజ్రసంకల్ప దివ్యాత్మ, 12 కోట్ల పైచిలుకు గాయత్రీ పరివారానికి 80 దేశాలలో దిశానిర్దేశనం చేయుచున్న ప్రకాశ శీలి అన్నారు.

డా॥ ప్రణవ్ పండ్యాజీ మాట్లాడుతూ, "గాయత్రీ జ్ఞాన మందిరాన్ని చూచినంతనే ఆ దివ్య కాంతులలో తన మానసము మిగుల సంతోషంతో ఆశ్చర్యాంబుధిలో మునిగి, ఆనంద పారవశ్యం చెందింది. ఇట్టి మందిరాన్ని, సుందర స్వాగత ప్రవేశ ద్వారాన్ని దేశంలో ఎచ్చట చూడలేదు. మీ అందరికి నా అభినందనలు తెలుపుతున్నా" అన్నారు.

గాయత్రీ మంత్రశక్తిని, దాని ప్రాశస్త్యాన్ని వివరించారు. గాయత్రీ జ్ఞానగంగను గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్ హరిద్వార్ నుండి ఢిల్లీ మీదుగా హైదరాబాద్ నగరానికి, గాయత్రీ జ్ఞానమందిరానికి తెచ్చాను. ఓం! స్తుతామయా వరదా ...... కీర్తిం, ద్రవిణం మహ్యందత్వా, వ్రజతా బ్రహ్మ లోకమ్ మా! అని గాయత్రీ శక్తిని గానం చేశారు. గాయత్రీ మంత్రోపాసన అమృతదాయిని, పారస్‌మణి, కల్పవృక్షం మున్నగు శక్తులను ఉపాసకునికి అందజేస్తుంది. గాయత్రీ త్రిపద శక్తులైన మహా సరస్వతి, మహాలక్ష్మి, మహా కాళికలతోపాటుగా ఓంకారమైన ప్రాణశక్తిని కూడా సాధకునికి అందజేస్తుంది.

దక్షిణ భారతావనిలో మానవజాతిలో అర్థశక్తిగా అలరారుచున్న స్త్రీలను గాయత్రీ మంత్రాన్ని ఉచ్ఛరింపరాదని ఆంక్షలు విధించారు. ఇది వేద విరుద్ధము. శాస్త్ర విరుద్ధమని స్త్రీ పురుషులు నిర్భయంగా, నిస్సంకోచంగా పూర్ణ మనస్సుతో ఉపాసించవచ్చునని ప్రబోధించారు. సంకట స్థితులందు యుగ పురుషులైన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు మున్నగువారు గాయత్రీ

**డబ్బు నీడ లాంటిది - నువ్వు దానివెంట పడితే అది దొరకదు, కష్టించి పనిచేస్తే అది నీ వెంట పడుతుంది**

మంత్రాన్ని ఉపాసించి విజయులైనారు. తన పరిశోధనలలో మరియు తదితర ప్రముఖ శాస్త్రజ్ఞుల పరిశోధనలలో గాయత్రీ మంత్రంలోని శబ్ద శక్తి, ధ్వని శక్తి అత్యంత శక్తిశాలివైనవని ఋజువైనదని తెలిపారు. ఇన్ని మహత్తులతో, లాభాలతో కూడిన మంత్రాన్ని ఇంటింటికి చేర్చుట మనందరి బాధ్యత అని ఉద్బోదిస్తూ తన ప్రవచనాన్ని ముగిస్తూ వారు ఆశీస్సులను అందించారు.

శాంతి మంత్రంతో కార్యక్రమం ముగిసింది. వరుణుడు కరుణించి చల్లని వాతావరణాన్ని కల్పించాడు. పరివార్ జనులు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గాయత్రీ చేతనాకేంద్ర సందర్శన

11వ తేది ఏప్రిల్ 2015 ఉదయం 10.30 గం॥లకు ఆదరణీయ ప్రణవ్‌పంద్యాగారు, అశ్విని సుబ్బారావు, డా॥ బ్రిజ్‌మోహన్‌గౌడ్‌జీల వెంట చేతనా కేంద్రంలో అడుగిడినారు. హారతినిచ్చి, పుష్పాంజలి ఘటించి, పరివారన్ని ఉద్దేశించి ప్రవచించారు.

సాయంత్రము "దియా" డివైన్ ఇండియా యూత్ అసోసియేషన్ (అనగా ఈశ్వర ప్రణిత భారతదేశ యువజన సంస్థ) సమ్మేళనము జరుగుచున్నది. ఇది గాయత్రీ పరివార్‌లోని ఒక అంతర్భాగం. మేధావులు, సాంకేతిక శాస్త్ర నిపుణులు, కళాశాల ఆచార్యులు, ఉపన్యాసకులు, ఉపాధ్యాయ వైద్యులు, పరిపాలనాదక్షులు, విద్యార్థి, విద్యార్థినులతో కూడిన సమావేశమిది.

వివిధ దేశాలలో, దేశంలోని కొన్ని ప్రధాన నగరాలలో దియా సారథ్యంలో స్వచ్ఛ గంగా అభియాన్, రామేశ్వర్ మున్నగు ప్రదేశాలలో కార్యక్రమాలు చేపట్టారు.

వాలంటీర్ అనగా స్వచ్ఛంద సేవకుని లక్షణాలను వివరిస్తూ పండిత జవహర్‌లాల్ నెహ్రూగారి అనుభవాన్ని ఉటంకించారు. అట్లే పూజ్య గురుదేవుల సేవానిరతిని స్వాతంత్ర్య సంగ్రామంలో వారు అందించిన సేవలను ఉటంకించుట జరిగింది.

నిష్ఠాపూర్వకంగా, నిష్కామంతో, ప్రతిఫలాపేక్షలనాశించ కుండగా సేవలనందించవలసినదిగా కోరుచూ పరివార్ సభ్యులను ఉద్బోధిస్తూ – తమ ఆశీస్సుల అందించారు.

**శిల్పారామంలోని శిల్పాకళావేదికలో జరిగిన "దియా" కార్యక్రమంపై నివేదిక:**

11వ తేది ఏప్రిల్ 2015 శనివారము, సాయంత్రము 4 గంటలకు శిల్పకళావేదికలో దియా కార్యక్రమాలు అత్యంత శోభాయమానంగా అలంకరించిన వేదిక నుండి ప్రారంభ మయ్యాయి.

శాంతికుంజ్ నుండి విచ్చేసిన సంగీత బృందము, హైదరాబాద్ సంగీత బృందాలు హిందీలో మరియు తెలుగు భాషలలో వరుసగా ప్రేరణాగీతాలను ఆలపించాయి. 3వేల పై చిలుకు ప్రేక్షకులను ఈ సంగీతం ఉర్రూతలూగించింది.

సాయంత్రం 5 గంటలకు డా॥ ప్రణవ్‌పంద్యాగారు, శ్రీ అశ్విని సుబ్బారావుగారు, శ్రీ గౌడ్‌జీగార్లతో కలసి శిల్పకళా వేదికలో అడుగిడిరి. దీపప్రజ్వలన గావించి సభా కార్యక్రమాలను ప్రారంభించారు. "ఆలోచనలలో విప్లవం రావాలి. ఆలోచనలో క్రమబద్ధంగా పరివర్తన రావాలి. సామాజిక విప్లవం, సంస్కృతి విప్లవం, నీతి నియమపాలనలో విప్లవం మున్నగు వాటిని మించినది భావ విప్లవం లేక ఆలోచనలలో విప్లవం.

స్వామివివేకానంద న్యూయార్క్ నగరంలో ప్రవచిస్తుండగా శ్రోతలలో కొందరు ఆయన శిరస్సు వెనుక ఒక చక్కని వెలుగుతో నిండిన వలయాన్ని వీక్షించారు. ఆలోచనల్లో క్రాంతి, భావ సంవేదనలతో నిండిన మనస్సున్న ప్రతివారు వివేకానందుని మార్గంలో పయనిస్తూ ఆయనకు స్ఫూర్తిగా గొనెదరు. నేడు మానవజాతి అనుభవించుచున్న సుఖదుఃఖాలకన్నింటికి మూలం మానవులలోని ఆలోచనల సారమే. దీనిని ఆసరాగా తీసికొని మానవజాతిని పట్టి పీడించుచున్న అభద్రతా భావాన్ని, భయభ్రాంతులను, అశాంతిని, అజ్ఞానాన్ని దూరం చేయాలన్నచో వారిలోని అజ్ఞానం తొలగిపోవాలి అని ఉద్బోదించారు. పరమ పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యులు పై లక్ష్య సాధనకై మానవజాతికి తగిన జ్ఞానాన్ని తాను రచించిన 3200 పై చిలుకు గ్రంథాల ద్వారా అందించారు అని సెలవిచ్చారు.

హరిద్వార్‌లో 350 కోట్ల రూపాయలు వెచ్చించి వేదమాత గాయత్రీ ట్రస్టు వ్యవస్థను ఏర్పాటు చేశాము. 150 కోట్ల రూపాయల ధనాన్ని వెచ్చించి దేవ సంస్కృతి విశ్వవిద్యాలయ సముదాయాన్ని నిర్మించుట జరిగింది. మొదటిదానిలో సంఘ

**ఆలోచనలు క్రింది స్థాయి నుంచి పైకి - ఆదేశాలు పై స్థాయి నుంచి క్రిందికి ప్రవహించాలి, అదే వ్యవస్థ విజయానికి మూలసూత్రం**

సంస్కర్తలను, పరివ్రాజకులను తయారుచేసి స్వచ్ఛంద సేవకులుగా సమాజానికి అందించుట జరుగుచున్నది. రెండవ వ్యవస్థ ద్వారా సుసంస్కారవంతులై, దేశం, సమాజంపట్ల భక్తిశ్రద్ధలు. అత్యంత సమర్పణాభావంతో నూతన జాతి నిర్మాణం జరుగుచున్నది. ఈ విశ్వవిద్యాలయ విద్యార్థులు కొద్దిక్షణాల్లో దేవసంస్కృతి విశ్వవిద్యాలయంలో తాము నేర్చుకొన్న యోగాసనాలు మీ ముందు ప్రదర్శించెదరు.

ఇంతటి మహోన్నత లక్ష్యాల సాధనదిశగా అడుగులు వేయుచున్న పైనుదహరించిన రెండు సంస్థలను మీరంతా హరిద్వార్ వచ్చి సందర్శించవలసిందిగా మిమ్ముల ఆహ్వానించు చున్నాం.

జై హింద్, జై భారత్, జై గురుదేవ్ అని సభకు ఆశీస్సు లందిస్తూ తమ ప్రసంగాన్ని ముగించారు. అటుపిమ్మట విశ్వవిద్యాలయ విద్యార్థులచే యోగాసనాల ప్రదర్శన జరిగింది.

దీని తరువాత ఉత్కృష్ట సమాజ సేవకులను సన్మానించుట జరిగింది.

దీనిలో మొదటి వక్తగా మాట్లాడుతూ దేశంలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొని ఉన్న క్షామాన్ని గురించి, పేదరికాన్ని గురించి వివరిస్తూ ఇలా అన్నారు.

ఒడిషా రాష్ట్రంలోని కలహంది గ్రామంలోని పేదరికాన్ని గురించి ప్రజలను విచారిస్తుండగా జీవనోపాధిని వెతుక్కుంటూ గ్రామంలోని పురుషులంతా వలసవెళ్ళారు. స్త్రీలు పిల్లలు మాత్రమే ఉన్నారని తెలిసింది. వీరు ఎట్టి ఆహారాన్ని పొందు చున్నారనెడిది విచారించగా, గాలికి కొట్టుకొని వచ్చిన మామిడి ఎండుటెంకలను నీళ్ళలో తెర్లించి ఆ నీటిని త్రాగి ఆకలి నుండి ఉపశమనాన్ని పొందుచున్నారు.

మధ్యప్రదేశ్‌లోని చంబల్‌లోయలో దారిద్ర్యాన్ని పరిశీలి స్తుండగా గ్రామంలో ఒకచోట తల్లీ-కూతురు మాత్రమే జీవిస్తున్నారు. వీరిద్దరిని కలిపి ఫోటో తీయాలని ప్రయత్నించారు. కాని దీనికి వారు అంగీకరించలేదు. కారణం పరికించి చూడగా తల్లీ కూతురుకు కలిపి ఒకే జాకెట్టు ఉన్నది. దానిని వారు మార్చి మార్చి ధరించుచున్నారు. ఇది వీరి హృదయవిదారక ఆర్థిక స్థితిని తెలియజేస్తున్నది.

ఒడిషాలోని మరొక గ్రామంలో పేదరికాన్ని గురించి విషయసేకరణ జరుపుచుండగా మా గ్రూపునకు తెలిసినదే మనగా తరువాతి భోజనం ఎప్పుడు లభిస్తుంది అనెడిదే దారిద్ర్య రేఖను నిర్వచించుట జరుగుతుంది.

కావున నేటి యువత దీనిని రూపుమాపుటకు తీవ్రంగా కృషి సల్పాలి. కొన్ని త్యాగాలకు సిద్ధం కావాలి, పరుల హితం కోరి కొన్ని త్యాగాలు చేయాలి అని పిలుపునిచ్చారు.

## ఖమ్మం జిల్లాలో

భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష ఖమ్మం జిల్లాలో శ్రీ ఎన్.బి.కె. చౌధురి గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో 2014-15 విద్యా సంవత్సరంలో నిర్వహించారు. ఈ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థిని-విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవాన్ని 23 మార్చి 2015 ఆదివారము ఖమ్మం పట్టణంలో నిర్వహించారు. ఈ సంవత్సరము 4500 మంది విద్యార్థిని-విద్యార్థులు పరీక్షలు వ్రాశారు. దాదాపు 30 పాఠశాలకు పైగా దీనిలో పాల్గొటను జరిగింది.

భారతీయ సంస్కృతి నానాటికి కనుమరుగవుచున్న నేటి సామాజిక పరిస్థితులలో, గాయత్రీ పరివార్ దీనికి ప్రాణం పోయుట అత్యంత ఆనందదాయకమని దేశానికి లాభదాయక మని అనేకులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

విద్యార్థులు తల్లిదండ్రులు పరీక్షల పట్ల, పాఠ్యాంశాల పట్ల వారి సంతృప్తిని వ్యక్తం చేశారు. శ్రీమతి సృజన గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ "భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష పాఠ్యాంశాలు తమకు సాత్విక ఆహార సేవన ప్రాముఖ్యతను, లాభాలను గురించి అవగాహన కల్పించామని తెలిపింది. ఆధ్యాత్మిక జీవన విధానానికి సాత్విక ఆహార సేవనం అత్యంత ఆవశ్యకమని తాను తెలిసికొన్నానన్నది. అట్లే తన పిల్లలకు రాముని గుణాలకు, రావణుని గుణాలకు మధ్యగల వ్యత్యాసాన్ని తెలిసికొనుటలో ఈ పాఠ్యాంశాలు చాలా తోడ్పడ్డాయని, వారి ఆహారం ద్వారా మంచి కుటుంబ వాతావరణం తద్వారా చక్కని సమాజం ఏర్పడతాయని తన అభిప్రాయాన్ని; అదేవిధంగా విద్యార్థిని-విద్యార్థులు కూడా పరీక్షల పట్ల తమ సంతృప్తిని వ్యక్తం చేస్తూ, పాఠ్యాంశాలు తమకు ఉపయోగకారిగా ఉన్నాయని తెలియజేశారు.

సభనుద్దేశించి శ్రీ ఎస్.రంగారావుగారు, మేధా ఇంజనీరింగ్

**విభిన్నంగా వినూత్నంగా ఆలోచించు - అదే నిన్ను అంబరానికి చేర్చుతుంది**

కళాశాల ప్రధాన ఉపన్యాసకులు (ప్రిన్సిపల్) మాట్లాడుతూ పిల్లలు సంస్కృతి, సంస్కారాల పట్ల తగిన శ్రద్ధ వహించి ఎదగాలని ప్రబోధించారు.

పర్యావరణవేత్త శ్రీ హేమంతరావు మాట్లాడుతూ, పిల్లలంతా చెట్లు నాటుట, వానికి నీరు పోసి సంరక్షించుట వారి రోజువారి పనులలో ఒకదానినిగా చేసికోవాలి అని ప్రబోధించారు.

ఆహ్వానితుల సత్కారం, బహుమతి ప్రదానం, శాంతి మంత్రంతో ఆనాటి సభ ముగిసింది.

### గుంటూరు జిల్లాలో

2015 మార్చి 8వ తేదిన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు గ్రామంలో 54 కుండముల గాయత్రీ మహాయజ్ఞము అత్యంత శోభాయమానంగా జరిగింది. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ మదమంచి సుధాకర్, శ్రీ అంకారావు, శ్రీ బ్రహ్మారెడ్డి, శ్రీమతి లీల మున్నగువారు యజ్ఞాన్ని నిర్వహించారు.

### నెల్లూరు జిల్లాలో

15.03.2015 ఆదివారము నాడు నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామంలోగల సింహపురి ఎనర్జీ లిమిటెడ్, మధుకాన్ ప్రాజెక్ట్ లిమిటెడ్ నందు గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో శ్రీమతి భువనగారు, శ్రీ టి.రమణమూర్తిగారు పంచకుండీ గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏర్పాటుకు కారకులు మధుకాన్ (ప్రాజెక్ట్స్) సి.ఒ.ఒ. శ్రీజగన్నాథంగారు గతంలో ఉత్తరప్రదేశ్‌లో గాయత్రీ పరివార్ సభ్యుడుగా ఉండటం గమనార్హం.

పవర్‌ప్లాంట్‌లోని ప్రతి ఉద్యోగి కుటుంబ సమేతంగా ఈ యజ్ఞంలో పాల్గొని విశేష అనుభూతిని పొందారు. సుమారు 200 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రముఖులు సీనియర్ జి.యం. సి. హోలిరామ్‌గారు, ఇ.రాధాకృష్ణగారు, శ్రీరామమూర్తిగారు, వైస్ ప్రెసిడెంట్ జయంత్ సగడేగారు, గాయత్రీ యజ్ఞానికి ప్రభావితులయ్యారు.

### విశాఖపట్నంలో

గాయత్రీ పరివార్ ట్రస్ట్, విశాఖపట్నం వారి దశమ వార్షికోత్సవం 2015 మార్చి 29న 51 కుండములతో రాజస్థానీ సంస్కృతి మండల్ ప్రాంగణంలో జరిగింది. దాదాపు 1000 మందికిపైగా యజ్ఞంలో పాల్గొన్నారు. రూ.7500/- విలువగల సాహిత్యం విక్రయించుట జరిగింది. స్థానిక పార్లమెంటు సభ్యులు శ్రీ కంభంపాటి హరిబాబుగారు, స్థానిక ఎమ్మెల్యే శ్రీ పల్లా శ్రీనివాసరావు, మహావిశాఖనగర పాలక సంస్థ కమీషనరు ప్రభృతులు పాల్గొన్నారు. రాజకీయ ప్రముఖులైన గాయత్రీ పరివార్ ట్రస్టు సభ్యులందరూ దీనిలో పాల్గొన్నారు. యజ్ఞాన్ని శ్రీ చంద్రశేఖర జైన్‌గారు నిర్వహించారు.

## సంస్మరణ - శ్రద్ధాంజలి



మరణం:
03.04.2015

**కీ॥శే॥ శ్రీమతి రస్మి సాహు (30 సం॥లు)**

*శ్రీమతి రస్మి సాహుగారు 2003 ఏప్రిల్ 6న శ్రీతోషన్ సాహుగారిని (దక్షిణ విభాగం, గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్) వివాహమాడారు. అప్పటి నుండి తోషన్‌సాహు గారితో కలిసి గాయత్రీతీర్థ్ శాంతికుంజ్, హరిద్వార్‌లో నివాసముంటూ, పరమపూజ్యగురుదేవులు పరమ వందనీయ మాతాజీలు చూపిన మార్గంలో పయనిస్తూ భర్తకు చేదోడు వాదోడుగా నిలచి చేయూత నిచ్చారు. వీరికి ఒక కుమార్తె. ఇట్టి వీరు ఆకస్మికముగా అనారోగ్యము పాలై 2015 ఏప్రిల్ 3న శివసాయుజ్యాన్ని చేరుకొన్నారు. వీరి పవిత్రాత్మకు సుఖశాంతులు ప్రసాదించవలసినదిగా పూజ్యగురుయుగ్మాన్ని యుగశక్తిగాయత్రి ప్రార్థించుచున్నది.*


**యుగశక్తిగాయత్రి**

**మాస పత్రిక చదవండి ! చదివించండి !!**


**మానవీయతకు చిహ్నాలు ఆదర్శాలే కాని ఆడంబరాలు, విలాసాలు కావు**




# గోదావరి నది పుష్కరాలు-2015




## పుష్కరము

పుష్కరము అనగా 12 సంవత్సరాలు అని అర్థము. పూర్వం తందిలుడనే ధర్మాత్ముడు ధర్మబద్ధమైన జీవితం గడుపుతూ ఈశ్వరుని గురించి తపమాచరించి ప్రత్యక్షం గావించుకున్నాడు. ఈశ్వరునిలో తనకు శాశ్వతంగా స్థానం కావాలనగా ఈశ్వరుడు అంగీకరించి తన అష్టమూర్తులలో ఒకటైన జలమూర్తిలో అతనికి శాశ్వత స్థానం కల్పించాడు. ఈ రీతిగా సకల జీవరాశిని పోషించగలిగే శక్తి నీటి ఆవాసంతో అతనికి లభించింది. సంస్కృతంలో పుష్కరానికి మరోపేరు పోషించేశక్తి. ఈ రీతిగా తందిలుడు పుష్కరుడయ్యాడు. సృష్టి చేయుటకై బ్రహ్మదేవునికి జలం కావలసిరాగా శివుని ఆజ్ఞమేరకు పుష్కరుడు బ్రహ్మదేవుని కమండలంలోనికి ప్రవేశించాడు. బ్రహ్మదేవుని చేత సృష్టించ బడిన ప్రాణులకు జీవాధారమైన జలం కావలసి రాగా, బృహస్పతి. పుష్కరునిమ్మని బ్రహ్మను కోరగా బ్రహ్మ అంగీ కరించినప్పటికి, నీటిని విడచుటకు పుష్కరుడు సిద్ధపడలేదు. అప్పుడు బ్రహ్మపుష్కరులతో కలసి బృహస్పతి ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. ఆ ఒప్పందం ప్రకారం గ్రహరూపంలో ఉన్న బృహస్పతి మేషరాశితో మొదలు వరుసగా ఒక్కొక్కరాశిలో ప్రవేశించి సంవత్సరకాలం ఉంటూ ఈ రీతిగా పన్నెండు రాశులలో ప్రవేశిస్తాడు. ఆ సమయంలో సమస్త దేవతలు బృహస్పతి అధిపతిగా ఉన్న నదికి పుష్కరునితో వస్తారు. కనుక పుష్కరకాలంలో నదీస్నానం పుణ్యప్రదమని పురాణాల ద్వారా తెలుస్తున్నది.

## పుష్కరాల వెనుక ఉన్న ఇతిహాసం

మానవుల సంపర్కంతో పవిత్ర నదులు అపవిత్రంగా మారసాగాయి. పుష్కరుడు అనెడి పేరుగల ఒక మహానుభావుడు బ్రహ్మ గురించి తపస్సు చేసి, తనను ఒక పవిత్ర నదీక్షేత్రంగా మార్చమని కోరాడు. ఆవిధంగా పుష్కరుడు పుష్కరతీర్థంగా మారి స్వర్గలోకమున మందాకిని నదియందు అంతర్భూతమై ఉన్నాడు.

బ్రహ్మలోకవాసి పుష్కరుడు గురుగ్రహం (బృహస్పతి) ఆయారాశులలో ప్రవేశించెడి కాలాన్ని బట్టి ఆయా నదులకు పుష్కరాలు వచ్చినప్పుడు, సప్తమహాఋషులు ఆయనకు ఆతిథ్యం ఇచ్చి గౌరవిస్తుంటారని ప్రతీతి. ఈ క్రింద తెలిపిన విధంగా పుష్కరుడు ఆయా రాశులనుబట్టి ఆయా నదులలో ప్రవేశిస్తాడు. అప్పుడు ఆయా నదుల పుష్కరాలు జరుగుతాయి.

| నదిపేరు | రాశిపేరు |
|---|---|
| గంగానది | మేషరాశి |
| కృష్ణానది | కన్యారాశి |
| గోదావరి | సింహరాశి |
| సింధు | కుంభరాశి |
| నర్మద | వృషభరాశి |
| యమున | కర్కాటకరాశి |
| సరస్వతి | మిథునరాశి |
| కావేరి | తులారాశి |
| ప్రాణహిత | మీనరాశి |
| భీమ | వృశ్చికరాశి |
| తుంగభద్ర | మకరరాశి |
| పుష్కరీ | ధనుస్సురాశి |

బృహస్పతిరాశిలో ప్రవేశించిన మొదటి పన్నెండు రోజులను ఆదిపుష్కరం అంటారు. సంవత్సరం కాలం జరిగే ఈ ఉత్సవాలలో చివరి 12 రోజులను అంత్యపుష్కరం అని పిలుస్తారు. ఆదిపుష్కరం ప్రశస్తమైనది.

పితృదేవతలను స్మరించుకొనుటకు, తర్పణాదుల విడచుటకు ఇది చాలా మంచి సందర్భమని అనాదిగా మనకున్న ఒక విశ్వాసం. సప్తర్షులే గాక చాలామంది దేవతలు కూడా సూక్ష్మ రూపులై ఈ నదీ ప్రాంతంలో పుష్కరాల సమయమందు సంచరిస్తూ స్నానాలు చేసేవారికి శుభాలు కలిగిస్తారనెడిది నమ్మకం. ఈ కాలమందు నదికి సమీప ప్రాంతంలోని వారు వివాహాది కార్యాలు చేయరు.

**మనిషిలోని ఉత్కృష్ట ఆలోచనలు అతనిని సంస్కారవంతుని చేస్తాయి**

### జల ప్రాధాన్యత

సమస్త ప్రాణికోటి మనుగడకు ఆధారం జలం. జలం తరువాత జీవకోటి ఆవిర్భవించింది. జలాధారాల వెంటే నాగరికత విలసిల్లింది. నదీస్నానాలు, కోనేటిస్నానాలు, సముద్రస్నానాలు, మాఘస్నానాలు, మంగళస్నానాలు ఇవన్నీ నీటితో ముడిపడి ఉన్నాయి. తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాల దర్శనం కూడా నీటితో ముడిపడి ఉంది. శ్రాద్ధకర్మలు, పిండప్రదానాలు, తర్పణాలు కూడా జలంతో ముడిపడి ఉన్నాయి.

బ్రహ్మనుండి ఆకాశం, ఆకాశం నుండి వాయువు, వాయువు నుండి జలం, జలం నుండి భూమి, భూమి నుండి ఔషధులు, ఔషధుల నుండి అన్నం, అన్నం నుండి జీవులు పుట్టాయని తైత్తరీయఉపనిషత్ వాక్యం – ఈ రీతిగా జీవ రాశులకు ప్రధానమైన జలం స్నానం ప్రాముఖ్యతను గుర్తు చేసేవి పుష్కరాలు.

**శ్రాద్ధ తర్పణం:** ఈ స్థూల దృశ్యజగత్తులో స్థూల శరీరధారులు ఇంద్రియ భోగాలు, కోరికలు, ఆకాంక్షలు, అహంకారం మున్నగువానిని తీర్చుకొనుట ద్వారా తృప్తిజెందెదరు. ఇదే రీతిలో పితరుల సూక్ష్మశరీరాలు శుభకర్మలతో ఉత్పన్నమయ్యే సుగంధిత రసాస్వాదన చేస్తూ తృప్తిని అనుభవిస్తాయి. శ్రద్ధయే వారి ఆకలిని తీర్చేది. దానితోనే వారు తృప్తిజెందుతారు. కావున తృప్తికొరకై తర్పణ ఇస్తాము. స్వర్గస్థ ఆత్మలు తృప్తి చెందుటకు పదార్థాలు, ఆహారము, దుస్తులు మున్నగు వస్తువులతో పనిలేదు. సూక్ష్మశరీరానికి ఆకలిదప్పులు, వేడి, చల్లదనం లాంటి అవసరాలు ఉండవు. సూక్ష్మశరీరంలో విచారణ, చేతన మరియు భావనలకు ప్రాధాన్యత ఉంటుంది. ఉత్కృష్ట భావనలతో నిండిన అంతఃకరణము మరియు వాతావరణమే శాంతిదాయకం.

తర్పణలను ఆరుభాగాలుగా విభజించారు. 1) దేవతర్పణ 2) ఋషి తర్పణ 3) దివ్యతర్పణ 4) దివ్యపితృతర్పణ 5)యమ తర్పణ 6) మనుష్య తర్పణ.

**1) దేవతర్పణ :** ఇది దేవతలకు (దేవతాశక్తులకు) ఇచ్చెడి తర్పణం

**2) ఋషితర్పణ :** వ్యాస, వశిష్ఠ, యాజ్ఞవల్క్య, కాత్యాయన, అత్రి, జమదగ్ని, విశ్వామిత్ర, నారద, చరక, శుశ్రుత, పాణిని, దధీచి మున్నగు ఋషుల పట్ల శ్రద్ధను 'ఋషితర్పణ' ద్వారా వ్యక్తీకరిస్తాము.

**3) దివ్యమనుష్యతర్పణ :** తమ జీవితాలలో సింహభాగాన్ని లోకకళ్యాణం కొరకు త్యాగబలిదానం గావించిన దేవ మానవులు రాజాహరిశ్చంద్ర, శిబి, జనకుడు, పాండవులు, శివాజి, ప్రతాపరుద్రుడు, అల్లూరి సీతారామరాజు, వీరేశలింగం మున్నగువారికిచ్చెడి తర్పణం.

**4) దివ్యపితృతర్పణ :** దివ్య పితరుల కోసం అనగా లోకసేవ, తపస్సు చేయకున్నా తమ చరిత్రను ఆదర్శవంతంగా మలచుకొని, అనుకరణ, ఆచారాలు మరియు ప్రతిష్ఠల సంపదను ముందు తరాలకందించి వెళ్ళిన దివ్య మానవుల కిచ్చెడి తర్పణం.

**5) యమతర్పణ :** జనన మరణ వ్యవస్థను నియంత్రించెడి శక్తిని యముడు అంటారు. దీనికిచ్చెడి తర్పణం యమతర్పణం.

**6) మనుష్య పితృతర్పణ :** పరమపదించిన పరివారానికిచ్చెడి తర్పణాలు.

2015 జులై మాసం 14 నుండి ప్రారంభం కానున్న గోదావరినదీ పుష్కరాలను పురస్కరించుకొని గాయత్రీ చేతనా కేంద్రము, హైదరాబాద్ తెలంగాణ (భద్రాచలం) మరియు ఆంధ్రప్రదేశ్ (రాజమండ్రి) రాష్ట్రాలలో సముచిత స్థాయిలో గోదావరి నది పుష్కర స్నానాలు తర్పణల కార్యక్రమాలకు ఈ క్రింది రీతిలో ఏర్పాటు చేయ సంకల్పించింది.

1) తర్పణ వేదిక ఏర్పాటు నిర్వహణ 2) యజ్ఞవేదిక ఏర్పాటు నిర్వహణ 3) సత్సంగము, సాంస్కృతిక వేదిక ఏర్పాటు నిర్వహణ 4) భోజనశాల ఏర్పాటు నిర్వహణ.

పైనుదహరించిన 12 రోజుల కార్యక్రమాలకు (ఆది పుష్కరం) హాజరయ్యెడి అశేష ప్రజావాహినికి అందించెడి సేవలకు అధిక సంఖ్యలో ఈ క్రింది వస్తువులు కావలసి ఉన్నవి.

**1) తర్పణాలకు:** తర్పణ పాత్రలు, దర్భలు, పసుపు, కుంకుమ, పిండములకు కావలసిన పిండి, ఆవుపాలు, జంద్యాలు, ఆసనాలు వగైరాలు. ఒక్కొక్క బ్యాచిలో 500 నుండి 1000 మంది తర్పణలిచ్చుటకు ఏర్పాట్లు చేయ సంకల్పము.

**2) యజ్ఞశాల:** 154 కుండములతో యజ్ఞశాల నిర్వహణ. దాదాపు నిత్యము 5000 మంది ఆహుతులు సమర్పించుటకు ఏర్పాట్లు. కావలసిన సామాగ్రి – యజ్ఞకుండములు, కాష్ట

**సాధన మరియు ప్రేమ ద్వారా సువ్యవస్థ నిర్మాణమవుతుంది**

పాత్రలు, హవనసామాగ్రి, పువ్వులు, అక్షతలు, తమలపాకులు, హవనసామాగ్రి పాత్రలు, గ్లాసులు, చెంచాలు, ప్లేట్లు, ఆవునెయ్యి, అగర్‌బత్తీలు, కర్పూరం, సంకల్పసూత్రాలు, ఎండుకొబ్బరి చిప్పలు, పచ్చివక్కలు ఆసనాలు, వగైరాలు.

**3) సత్సంగము మరియు సాంస్కృతిక వేదిక:** దీపయజ్ఞంతో పాటు సత్సంగము మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహింపబడును. నిత్యము కనీసం 5580 దీపాలతో దీప యజ్ఞం. దీనికి కావలసిన ప్రమిదలు, ఆవునెయ్యి, వత్తులు, కర్పూరం, కొవ్వొతులు.

**4) భోజనశాల:** నిత్యము 10000 మంది పై చిలుకు భక్తులకు భోజన ఏర్పాట్లు. దీనికి కావలసిన సామాగ్రి బియ్యం, కూరగాయలు, గోధుమపిండి, పాలు, కిరాణాసరుకులు, విస్తర్లు, గ్లాసులు, మంచినీళ్ళు, టీపొడి వగైరాలు.

పై నాలుగు వేదికల నిర్వహణకు కావలసిన సుశిక్షితులైన స్వచ్ఛంద కార్యకర్తలు 2000 మంది కావలసి ఉన్నారు.

మిత్రులారా! ఇది ఒక మహోద్భుతమైన ప్రజాహిత, సామాజికహిత కార్యక్రమము. దీనిలో పాల్గొని సేవలను అంశ దానాలను మరియు సమయదానాల రూపంలో అందించుట ఒక మరపురాని మహద్భుత అవకాశము. రామసేతు నిర్మాణ వేళ వానరులు, భల్లూకాలు, ఉడుతలు సాయం అందించిన రీతిలో మనమంతా ఈ మహాక్రతువు నిర్వహణలో పాలు పంచుకొని పూజ్య గురుయుగ్మ కృపకు పాత్రులు కావలసిందిగా కోరుచున్నాము. పరిణామక్రమంలో మహామానవులుగా ఎదుగుటకు ఇది ఒక చక్కని అవకాశం. "నాటు–కోసుకో" అన్న గురుదేవుల సూక్తితో లబ్ధి పొందుటకిది ఒక మహద్భుత అవకాశం.

ఈ కార్యక్రమానికి స్పందించి ఇప్పటికే రూ. 5,00,000/– అంశదాన రూపంలో అందించుటకు దాతలు ముందుకు వచ్చినారు. త్వరలో వారి పేర్లు ఈ పత్రికలో ప్రచురించ బడతాయి.

మీ మీ అంశదానము మరియు సమయదానాల వివరాలను తెలుపుచూ ఈ క్రింది చిరునామాకు తెలియజేయ ప్రార్థన.

**గాయత్రీ చేతనాకేంద్రం,** అశ్విని హౌస్ ప్రక్కన,
హెచ్.పి.రోడ్, మూసాపేట, హైదరాబాద్ – 500018.
ఫోన్: 040–23700722, మొబైల్: 9949411181,
9949111175, 9440769798
ఇ–మెయిల్: gckhyderabad@gmail.com

## దేవసంస్కృతి విశ్వవిద్యాలయ (హరిద్వార్) ప్రవేశ పరీక్ష 2015-16

**డా॥ ప్రణవ్‌పండ్యా, కులపతి,** MBBS, PGD, M.R.C.S, లండన్

***విషయం:*** *దేవసంస్కృతి విశ్వవిద్యాలయ కోర్సులలో ప్రవేశానికై ప్రవేశ పరీక్ష 2015–16 గురించిన ప్రకటన.*

దేవ సంస్కృతి విశ్వవిద్యాలయములోని వివిధ బోధనా కోర్సులలో 2015–16 విద్యా సంవత్సరంలో ప్రవేశం కొరకై ప్రవేశ పరీక్షలను హైదరాబాద్ మహా నగరములో 1వతేది జులై 2015 గురువారం నిర్వహించబడతాయి. ప్రవేశ పరీక్ష సమయం ఉ॥ 10.30. దీనితోపాటుగా దేశంలోని హరిద్వార్, నొయిడా (న్యూఢిల్లీ), లక్నో, భోపాల్, పాట్నా, రాజనందగావ్, కోల్‌కత్తా, నాగపూర్, హైదరాబాద్, బరోడా (వడోదరా) మరియు జోధ్‌పూర్ నగరాలలో ప్రవేశ పరీక్షలు జరుపబడతాయి.

ఈ క్రింది కోర్సులలో అనగా బి.ఎ., బి.ఎస్.సి., బి.సి.ఎ. మరియు డిప్లొమా ప్రవేశ పరీక్షలు నిర్వహింపబడతాయి.

బి.ఎడ్. కోర్సులో నూతనంగా ప్రవేశాన్ని కోరేవారికి 10 జులై 2015 శుక్రవారం ప్రవేశ పరీక్షను జరిపెదరు. దీని ప్రవేశ పరీక్షా కేంద్రము – దేవసంస్కృతి విశ్వవిద్యాలయము, హరిద్వార్.

పై విషయాలకు సంబంధించిన పూర్తివివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లలో సంప్రదించగలరు.
01334–261367, 262094 (ఎక్స్‌టెన్షన్: 3528), ఫ్యాక్స్: 01334–262095
E-mail: chinmay.pandya@dsvv.ac.in | Website: dsvv.in, www.awgp.org

**చక్కని ఆలోచనలకు శ్రమశక్తి తోడైతే జీవితం ఆనందభరితమవుతుంది**